కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220



నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 172 | గురువారం | 22-05-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


### రూ.153కోట్లు పెండింగ్ బిల్లులు విడుదల

హైదరాబాద్ : గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించింది. బుధవారం ఒకే రోజు రూ.153 కోట్లు విడుదల చేసింది. పెండింగ్ ఉన్న 9,990 బిల్లులను క్లియర్ చేసింది. ఈ విడతలో రూ. 10 లక్షల లోపు బిల్లులను చెల్లించింది. 2024 ఆగస్టు వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులకు ప్రాధాన్యతనిచ్చింది. వీటితో పాటు ఎస్‌డిఎఫ్ (ప్రత్యేక అభివృద్ధి నిధి) కింద చేపట్టిన వివిధ పనులకు రూ.85 కోట్లు విడుదల చేసింది. కాగా, పంచాయతీలకు భారీ మొత్తంలో నిధులు పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

# 27 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్

## మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతి

- ప్రాణాలు కోల్పోయిన మరో కేంద్ర కమిటీ సభ్యుడు రూపేశ్
- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఎదురుకాల్పులు
- ఇవి చట్టవిరుద్ధ హత్యలు : వామపక్షాల తీవ్ర ఖండన
- భద్రతాదళాలకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా ప్రశంసలు



మావోయిస్టు అగ్రనేత నంబాల



ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి రక్తసిక్తమయ్యాయి. బుధవారం భద్రతాబలగాల ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, సిపిఐ(మావోయిస్టు) పార్టీ ప్రధానకార్యదర్శి నంబాల కేశవ రావు అలియాస్ బసవరాజ్, అలియాస్ గంగన్న ఉన్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు రూపేశ్ కూడా మృతుల్లో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరోప్రక్క భద్రత బలగాలకు చెందిన డిఆర్‌జి సభ్యుడు కూడా ఈ ఎదురు కాల్పుల్లో మృతి చెందినట్లు కేంద్ర హోమ్‌మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్ పూర్ జిల్లా మాఢ్ అడవుల్లో ఈ ఘటన చోటు చేసుకుంది. మావోయిస్టు కేంద్రమిటీ సభ్యులు బృంధం కర్రెగుట్టల నుండి తప్పించుకుని వేరే ప్రాంతానికి మకాం మార్చారనే సమాచారం మేరకు మాఢ్ అడువులను నారాయణ్‌పూర్, దంతెవాడ, బీజాపూర్, కొండాగావ్ నాలుగు జిల్లాల డిఆర్‌జి భద్రతా సిబ్బంది చుట్టుముట్టాయి. బుధవారం తెల్లవారు ఝూమున మావోయిస్టు పార్టీ మకాం వేసిన ప్రాంతానికి చేరుకోవడంతో ఎన్‌కౌంటర్ జరిగినట్లు, ఇరు వర్గాల మధ్య తెల్లవారుఝూము 5 గం. నుండి సుమారు ఆరు గంటలపాటు ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్లు ఆ రాష్ట్ర పోలీసులు వెల్లడిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు రెండు రోజుల ముందే ఆ ప్రదేశాన్ని బలగాలు చుట్టుముట్టాయి. ఇప్పటి వరకు మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు మృత దేహంతో సహా 27 మావోయిస్టుల మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రి స్వాదీనం చేసుకున్నారు. కాగా పూర్తి కేంద్రకమిటీ సమావేశంపై బలగాలు విరుచుకు పడటంతో మృతుల్లో ఇంకా అగ్రనేతలు ఉండే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో ఇరు వర్గాలకు భారీగా గాయాలు అయ్యాయని, సహచరులను మావోయిస్టులు అడవుల్లోనికి తీసుకెళ్లినట్లు భావిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు నారాయణ్‌పూర్ జిల్లా ఎస్‌పి ప్రభాత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయశర్మ మాట్లాడుతూ మావోయిస్టుల ఏరివేతలో ఇదో పెద్ద మైలురాయిగా అభివర్ణించారు. మావోయిస్టు పార్టీని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు మృతుల్లో ఉండవచ్చని చెప్పారు. తాజాగా చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వేర్వేరు ఘటనల్లో సుమారు 200 మంది మావోయిస్టులు హతమయ్యారు. బీజాపూర్, నారాయణ్‌పూర్, దంతెవాడ, కొండగావ్ జిల్లాలు ఉన్న బస్తర్ డివిజన్‌లో 183 మంది మావోయిస్టులు హతమయ్యారు.

**ప్రజలకు ప్రశాంత జీవితం అందిస్తాం : మోదీ**

ఎన్‌కౌంటర్‌పై ప్రధాని నరేంద్రమోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను ప్రశంసించారు. మీ అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి..

తరువాయి 2లో



మోస్ట్ వాంటెండ్ మావోయిస్టులు నంబాల కేశవరావుతో సహా 27 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో హతమ య్యారు. ఇది కీలక విజయం. మావోయిస్టు పార్టీకి వెన్నె ముక అయిన కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు మట్టు బెట్టడం గొప్పవిషయం.
ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పూర్తయిన తర్వాత 54 మంది మావోయిస్టులను అరెస్టు చేశాం. 84 మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించేందుకు నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
– కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు అగ్రనేతను, అనేకమంది ఆదివాసీ ప్రజలను భద్రతా దళాలు చట్టవిరుద్ధంగా హత్యలు చేయడాన్ని ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు ఈ దారుణచర్యలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలి. ఈ అన్యాయాన్ని ఖండించాలి. చత్తీస్‌గఢ్ ప్రజలకు సంఘీభావగా నిలబడాలి. ఆపరేషన్ కగార్‌పై ఒక స్వతంత్ర న్యాయవిచారణ జరపాలి.
– సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్

కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజయోత్సవంతో చేసిన వ్యాఖ్య (పోస్టు) ద్వారా రాజ్యమే చట్టవిరుద్ధ నిర్మూలన కార్యక్రమానికి నేతృత్వం వహిస్తూ, పౌరులను చంపిన ఘనతను తీసుకుంటూ, కార్పొరేట్ల దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసుల నిరసనను అణిచివేస్తున్నట్లు స్పష్టమవుతుంది.
– సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, మేధావులు, ప్రజాస్వామిక వాదులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్ షాలు పట్టించుకోకపోవడం దారుణం. ప్రభుత్వం చేస్తున్న ఈ నరమేధాన్ని ప్రజలూ, ప్రజాస్వామిక వాదులు ఖండించాలి.
సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

శాంతి చర్చలకు సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఎన్‌కౌంటర్లు చేయడం అప్రజాస్వామికం. రాజకీయ పార్టీలు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు, మేధావులు రచయితలు తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్రం మొండివైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం.
– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

మావోయిస్టులను, వామపక్ష భావజాలాన్ని అంతం చేయడం లక్ష్యంగా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ఆపరేషన్ కగార్ చేపట్టి విచ్చలవిడిగా మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారు. ఉగ్రవాదుల కంటే దారుణంగా మన దేశ పౌరులైన మావోయిస్టులపై దుర్మార్గపు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగిస్తున్నారు.
– సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ



## ఎసిబికి చిక్కిన 'అవినీతి జలగలు'

దాడులు ఉధృతం అవుతున్నా 'డోంట్‌కేర్' అంటున్న అధికారులు
సూర్యాపేట ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, నిజామాబాద్ జిల్లా గొట్టుముక్కల పంచాయతీ కార్యదర్శి పట్టివేత

ప్రజాపక్షం/కోదాడ /నిజామాబాద్

గత కొద్ది మాసాలుగా అవినీతి అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కుతున్నారన్న వార్తలు ఎన్ని వస్తున్నా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో కొందరు అవినీతి అధికారులు తాము పట్టుబడతామన్న భయం ఏమాత్రం లేకుండా 'డోంట్ కేర్' అంటూ యథేచ్ఛగా తమ అవినీతిని కొనసాగిస్తున్నారు. బుధవారం నాడు ఎసిబి అధికారులు జరిపిన దాడులలో తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట ఆర్‌డబ్ల్యుస్ ఎఇ ఇస్లావత్ వినోద్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం గొట్టుముక్కల పంచాయతీ కార్యదర్శి కట్కం గంగామోహన్ చిక్కారు. వివరాలలోకి

తరువాయి 2లో

## ఈదురు గాలులతో వర్ష బీభత్సం



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పలు జిల్లాల్లో వర్షంతో పాటు ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల పిడుగులు పడిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. నల్లగొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నిర్మల్ జిల్లాలో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం నీటిపాలు అయింది. అధికారులు తేమ పేరుతో కొనుగోలు చేయడం ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గూడూరు మండలం గుండెంగా గ్రామానికి చెందిన మైదం ప్రవీణ్‌కుమార్ (ప్రభు) బహిర్భూమికి వెళ్లి పిడుగుపాటుకు గురై మృతి చెందారు. గతంలో ప్రవీణ్‌కుమార్ గ్రామపంచాయతీ సిబ్బందిగా పనిచేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రవీణ్ కుమార్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.అదేవిధంగా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన ఏషియ బోయిన చేరాలు యాదవ్ పిడుగుపాటుకు గురై మృతి చెందారు. నల్లగొండ జిల్లా పలు చోట్ల భారీ వర్షం పడింది. నాగార్జునసాగర్‌లో కొన్ని గంటలు ఎడతెరిపి లేకుండా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవగా, పలు చోట్ల పిడుగులు పడ్డాయి. దీనితో దాదాపు 7 గంటల పాటు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెండు గంటల పాటు వర్షం దంచి కొట్టడంతో రోడ్లన్నీ

తరువాయి 2లో

**రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షం**
**పిడుగుపాటుకు ముగ్గురు మృతి**
**మరో ఐదు రోజులు భారీ వర్షాలు : ఐఎండి**

## అప్రమత్తంగా ఉండండి

అధికారులకు సిఎం ఆదేశం

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని

తరువాయి 2లో



## పాక్‌కు బుద్ధిచెప్పడంలో ప్రధాని వెనకడుగు

- ట్రంప్ చెబితే కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ చేసిన పరిస్థితి
- బిజెపి నాయకులు తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునే యత్నం
- ప్రధానిగా దేశానికే వన్నెతెచ్చిన మహానేత రాజీవ్‌గాంధీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ అని, ఆర్థిక సరళీకృత విధానాలతో దేశాన్ని బలమైన ఆర్థిక దేశంగా నిలబెట్టారని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కొనియాడారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారని పేర్కొన్నారు. పహల్గామ్ ఘటనలో పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు వేశారన్నారు. ట్రంప్ చెబితే కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ చేసిన పరిస్థితి ఇప్పటి కేంద్ర ప్రభుత్వానిదన్నారు. భారత రత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ సచివాయలం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, ఎంపి ఎం.అనిల్‌కుమార్ యాదవ్,

తరువాయి 2లో

బ్రిజేష్ ట్రిబ్యునల్‌పై గత ప్రభుత్వం నిర్ణయం వల్ల

## ఎడారిగా దక్షిణ తెలంగాణ

- కృష్ణా జలాల్లో 66శాతం ఆంధ్రాకు 34 శాతం తెలంగాణకు కేటాయించేలా లిఖితపూర్వక ఒప్పందం
- తమ ప్రభుత్వం రాగానే 70 శాతం వాటా వచ్చేలా కేసు రీ ఓపెన్ చేయించాం
- కాళేశ్వరం పేరుతో రూ.లక్షల కోట్ల ప్రజాధనం వృథా
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజం



ప్రజాపక్షం/చింతలపాలెం

కాళేశ్వరం పేరుతో గత ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అంజలి సిమెంట్ ఆడిటోరియంలో రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, ముక్త్యాల బ్రాంచ్ కెనాల్, నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంల పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల పంపకాలలో బ్రిజేష్ ట్రిబ్యూనల్‌పై గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దక్షణ తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగి పంట భూములు ఎడారిగా మారాయని అన్నారు. తెలుగు రాష్ట్రాలకు 811 టిఎంసిలు కేటాయించగా, 512 టిఎంసిలు 66 శాతం ఆంధ్రకి, 299 టిఎంసిలు 34 శాతం తెలంగాణకు కేటాయించేలా లిఖితపూర్వకంగా గత పాలకులు ఒప్పందం

తరువాయి 2లో

## హైబ్రీడ్ ఉచ్చులో రైతు

- ఆర్భాటపు ప్రచారాలతో గందరగోళం
- డీలర్లను కాదని రైతుల వద్దకు ఏజెంట్లు

ప్రజాపక్షం/ఖమ్మం




సాగుకు సంబంధించి విత్తన ఎంపిక ప్రక్రియ ప్రధానమైంది. గతంలో రైతులే విత్తనాలను తమ పంటల నుంచి తయారు చేసుకునే వారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు ముఖ్యంగా ఆధునీకరణ, యాంత్రీకరణ నేపథ్యంలో హైబ్రీడ్ విత్తనాలు ఇప్పుడు రాజ్యమేలుతున్నాయి. రైతు తన విత్తనాలను తయారు చేసుకునే పరిస్థితిని విడనాడి ప్రతియేటా విత్తనాలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. వాణిజ్య పంటలకే కాదు సాంప్రదాయ పంటలకు సంబంధించి కూడా ప్రతి యేటా రైతాంగం హైబ్రీడ్ విత్తనాలను కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఒక ఏడాది సాగు చేసిన పంట నుంచి విత్తనాన్ని తయారు చేసే పరిస్థితి లేదు. తయారు చేస్తే మొలకెత్తదు. మొలకెత్తిన కాత, పూత రాదు. దీనితో ప్రతియేటా విత్తనాలను తయారు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో విత్తన సంస్థల ప్రచార హోరు రైతులను గందరగోళానికి గురి చేస్తుంది. ఎన్నికలు, సినిమా బహిరంగ సభలను తలదన్నే రీతిలో కొన్ని విత్తన సంస్థలు ప్రచారం చేపడుతున్నాయి. గత ఏడాది దిగుబడులు, తెగుళ్ల నివారణ, పెట్టుబడి తదితర విషయాలను ఘణంగా పెట్టి విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. డీలర్ల ద్వారా విత్తనాలను కొనుగోలు చేస్తే విత్తన చట్టాలను

తరువాయి 12లో

## సిరాజ్ ఖాతాలో భారీగా నగదు

లాకర్‌ను సీజ్ చేసిన పోలీసులు
తెరిచేందుకు అతని తండ్రి విఫలయత్నం
కస్టడీ పిటిషన్ వేసిన పోలీసులు
నజీర్, సమీర్‌ల కుటుంబ సభ్యులపై నిఘా పెంపు

ప్రజాపక్షం/హైదరాబాద్




బాంబు పేలుళ్ల కుట్ర కేసులో ఎ పి, తెలంగాణలో ఇటీవలే అరెస్టు అయిన నజీర్, సమీర్‌ల కేసులో విచారణ సంస్థలు దూకుడు పెంచాయి. విజయనగరంలోని సిరాజ్ కుటుంబ సభ్యులపై హైదరాబాద్‌లోని బోయిగూడలో ఉన్న సమీర్ కుటుంబ సభ్యులపై పోలీసులు నిఘా

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## టెక్సాస్ బస్సులో కత్తితో దాడి

### సాటి భారతీయ యువకుడు హత్య



**ఆస్టిన్ :** అమెరికా టెక్సాస్ రాష్ట్ర రాజధాని ఆస్టిన్‌లో పబ్లిక్ బస్సులో ప్రయాణిస్తున్న సాటి భారతీయుడిపై మరో భారత యువకుడు కత్తితో దాడిచేసి చంపాడు. హత్యకు పాల్పడిన నిం దితుడు దీపక్ కాండెల్‌పై ఫస్ట్ డిగ్రీ హత్యానేరం నమోదు చేసిన పోలీసులు అతడిని వెతికి పట్టుకుని అరెస్టు చేసి ట్రావిస్ కౌంటీ జైలుకు తరలించారు. హత్యకు పాల్పడిన నిందితుడు దీపక్ కాండెల్ 31 ఏళ్ళ యు వకుడు కాగా, మృతుడు అక్షయ్ గుప్తా వయసు 30 సంవ త్సరాలు. సాటి భారతీయుణ్ణి మరో భారతీయ యువకుడే పట్ట పగలు బస్సులో ప్రయాణం చేస్తుండగా దాడిచేసి చంపిన ఘట నపై సర్వత్రా దిగ్భ్రాంతి వ్యక్తమైంది. ఆస్టిన్ పోలీసులు దీపక్ కా ండెన్ చిత్రాన్ని బహిరంగంగా విడుదల చేశారు. ఈనెల 14వ తేదీ సాయంత్రం ఘటన జరిగింది. గుప్తా పక్క సీటులోనే కూర్చు న్న కాండెల్ కత్తితో అతడి మెడమీద ఇతరచోట్ల పొడిచి చంపాడు. ఎమర్జెన్సీ బృందాలు రంగంలోకి దిగి గుప్తాను రక్షించేందుకు యత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు.

## కర్ణాటక రచయిత్రి బానూ ముష్తాక్‌కు
# ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్




**లండన్ :** కర్ణాటక రచయిత్రి, మతఛాంధసవాదాన్ని, సామాజిక అన్యాయాన్నీ ప్రతిఘటించే న్యాయవాది బానూ ముష్తాక్ (77) కు అంతర్జాతీయ బుకర్ ప్రైజ్–2025 లభించింది. ఈ బహుమతిగా ఆమెకు 67 వేల డాలర్లు లభిస్తాయి. తన అనువాదకురాలు దీపా భస్తీతో కలిసి ఈ నగదుబహుమతిని ఆమె పంచుకుంటారు. దక్షిణభారతదేశంలో ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమె ఎన్నోకథలు రాశారు. ఈ కథలను ఎంపికచేసి దీపా భస్తీ ఆంగ్లంలో ''హార్ట్ ల్యాంప్'' చిన్న కథల సంకలనం రూపొందించారు. ఈ సంకలనానికి ఈ అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ లభించింది. ఇవన్నీ ఫెమినిస్టు కథలైనప్పటికీ, పితృస్వామ్య వ్యవస్థను ప్రతిఘటించిన కథలని జ్యూరీ ఛైర్మన్ చెప్పారు. నిత్యజీవితంలో జరిగే ఎన్నో గొప్ప సంఘటలను రచయిత్రి అద్భుతంగా ఈ కథల్లో చిత్రించారని ప్రశంసించారు. సామాజిక అన్యాయాన్ని ప్రతిఘటించడంలో ఆమెకు ఆమే సాటిగా నిలిచారు. ముస్లిం మహిళలను మసీదులలోకి అనుమతించాలని హక్కులకోసం వాదించినందుకుగాను 2000 సంవత్సరంలో ముష్తాక్‌పై మూడు నెలలపాటు సాంఘిక బహిష్కరణ అమలు చేశారు. రాజకీయాలు, మతం ఈ రెండూ స్త్రీని అతిక్రూరంగా అణచివేస్తున్నాయని ఆమె విమర్శిస్తూ ఉంటారు. ఐనాకూడా ఆమె ముస్లిం బాలికలు కర్ణాటక పాఠశాలల్లో హిజాబ్ ధరించడాన్ని సమర్థించారు.

ఇంగ్లీషు,హిందీ, ఉర్దూ, తమిళ్, మలయాళ భాషల్లో ఆమె రచనలు చేశారు. కర్ణాటక రచయిత్రికి ఈ విధంగా ఒక అంతర్జాతీయ బుకర్ బహుమతి లభించడం ఇదే మొదటిసారి. ఫిక్షన్ అనువాద కథలకుగాను ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ బహుమతి లభించింది. ఆమె రచనలను అనువాదం చేసిన దీపాభస్తీతో కలిసి బానూ ముష్తాక్ సెంట్రల్ లండన్‌లోని మోడరన్ గ్యాలరీలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరై ఫొటోలు దిగారు. బానూ ముష్తాక్ వృత్తిరీత్యా న్యాయవాది, సాంఘిక కార్యకర్త. ''ఈక్షణం నాకు రాత్రి ఆకాశంలో వేయి మిణుగురు పురుగులు (ఎర్రటి అగ్ని కాంతులు ప్రతిబింబించే దోమలు) ఒకేసారి సమష్ఠిగా, అద్భుతంగా ఆవరించుకుని అందాలు వెదజల్లినట్టు అనిపిస్తోంది'' అని రచయిత్రి బానూ ముష్తాక్ బుకర్ ప్రైజు తీసుకున్న సందర్భంగా అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మకమైన బుక్ బహుమతిని తాను ఒంటరిగా అందుకోవడంలేదని, ఎంతోమంది ఇతర రచయితలతో కలసి సమష్ఠిగా అందుకుంటున్నాననీ అన్నారు. కర్ణాటక రాష్ట్రం హస్సన్‌లోని ఒక ముస్లిం కుటుంబంలో 1948లో జన్మించారు బానూ ముష్తాక్. శివమొగ్గలోని మిషినరీ స్కూలులో చదువుకున్నారు. ఇంగ్లీషు, హిందీ,కన్నడ, దక్కనీ ఉర్దూభాషలు ఆమె మాట్లాడతారు. కన్నడభాషలో ప్రచురితమైన ''లంకేష్ పత్రికే'' పత్రికలో ఆమె జర్నలిస్టుగా పనిచేశారు. బెంగళూరులోని ఆలిండియా రేడియోలో పనిచేశారు. తన 29వ ఏట ముష్తాక్ రచయిత్రిగా మారారు. మహిళల సమస్యలపైనే ప్రధానంగా ఆమె ఎన్నో రచనలు చేశారు. ఆరు సంపుటాలలో చిన్న కథలను ఆమె ప్రచురించారు. ఒక నవల రాశారు. ఆమె రాసిన చిన్నకథ ''కరినగరగలు''ను 2003లో కన్నడభాషలో ''హసీనా'' పేరుతో సినిమాగా తీశారు. 1980వ దశకం నుండీ ఆమె సాంఘిక కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించారు. 1999లో ఆమెకు కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

## ఇజ్రాయెల్‌పై సర్వత్రా
# ఊపిరిసలపని ఒత్తిడి

**జెరూసలెం :** ఇజ్రాయెల్ అంతుదరీలేని దాడులు గాజాలో చేస్తూ ఉండటంతో ఆ దేశంపై ప్రపంచవ్యాప్తంగా ఒత్తిడి పెరిగింది. వెంటనే గాజాలోకి మానవతాసహాయం పంపాలని, ఆహార కొరత తీర్చాలని ఇజ్రాయెల్‌పై ముఖ్యంగా యూరప్ దేశాలు, ఐక్యరాజ్యసమితి వివిధ విభాగాలు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయెల్ బుధవారం నాడు ఒకవైపు దాడులు కొనసాగిస్తూనే, హమాస్ గనుక బందీలను విడుదల చేస్తే తమ యుద్ధ వ్యూహం మారుస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. మరోవైపు గాజా ప్రజలు అంతర్జాతీయ సహాయం కోసం, ఆహారం కోసం ఎదురుచూస్తున్నారు. పరిమితస్థాయిలో గాజాలోకి ఆహార సరఫరాలను అనుమతిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ సోమవారంనాడు ప్రకటించినప్పటికీ, యుద్ధాన్ని గాజాలో మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. గాజా మొత్తాన్ని ఆక్రమించుకుంటామని, అందులో రాజీపడేదిలేదన్నారు. కాగా బుధవారం తెల్లారేవరకూ జరిగిన గగనతల దాడుల్లో 19 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. కాగా గాజాలో మారణహోమంపై ఇప్పటికే ఇజ్రాయెల్‌కు తీవ్ర హెచ్చరికలు చేసిన యూరోపియన్ యూనియన్‌లోని దేశం స్పెయిన్ పార్లమెంటు ఇజ్రాయెల్‌పై



ఆయుధ సరఫరా ఆంక్షలు విధించింది. ఈ మేరకు ఒక తీర్మానం ఆమోదించింది. అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న లెఫ్టిస్టు సుమార్ కూటమి పార్లమెంటులో ఈ తీర్మానం ప్రవేశపెట్టింది. మతఛాందసవాద కన్జర్వేటివ్ పీపుల్స్‌పార్టీ, ఫార్ రైట్ వోక్స్‌పార్టీలు తీర్మానాన్ని వ్యతిరేకించాయి.

ఇరాన్ అణువ్యవస్థపై

**ఇజ్రాయెల్ దాడికి సన్నద్ధం?**

ఇరాన్–అమెరికా మధ్య ఒకవైపు చర్చల ప్రక్రియ కొనసాగుతున్న దశలోనే ఇరాన్ అణ్వాయుధ మౌలిక స్థావరాలపై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ సైన్యం సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా పాలనాయంత్రాంగాన్ని ఉటంకిస్తూ ఆ దేశ మీడియా బుధవారంనాడు ఈ విషయం వెల్లడించింది. ఇరాన్–అమెరికా మధ్య ఇప్పటికే నాలుగు విడతల పరోక్ష చర్చలు పూర్తయ్యాయి. కానీ ఇరాన్ మాత్రం ఈ చర్చలవల్ల ఎలాంటి ప్రయోజనం లేదని కొద్దిరోజులుగా సంకేతాలు పంపుతున్నది. ఇరాన్ సర్వాధినేత ఆయితుల్లా అలీ ఖొమైనీ రెండు రోజులక్రితం ప్రకటన చేస్తూ ఈ చర్చలు సత్ఫలితాలివ్వవని విమర్శించారు. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని శాంతియుత ప్రయోజనాలకోసం యురేనియం శుద్ధిచేసే స్వాతంత్ర్యాన్ని అమెరికా ప్రశ్నించడం అర్థరహితమని ఖొమైనీ హెచ్చరించారు. అమెరికా ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం ఇటీవలికాలంలో ఇరాన్ తన అణువ్యవస్థకు సంబంధించిన మౌలిక సదుపాయాలను గణనీయంగా వృద్ధిచేసుకుంది. ఇరాన్ అణువ్యవస్థ సదుపాయాలపై దాడికి ఇజ్రాయెల్ తుది నిర్ణయం తీసుకుందని అమెరికా గూఢచారి వ్యవస్థ ధృవీకరించినట్లు ఆ దేశ మీడియా పేర్కొందని టాస్ వార్తాసంస్థ పేర్కొంది. ఇరాన్–అమెరికా మధ్య ఏప్రిల్ 12వ తేదీన మొదటి విడత అణు చర్చలు ఓమన్ రాజధాని మస్కట్‌లో జరిగాయి. ఏప్రిల్ 19న రోమ్‌లో రెండో విడత చర్చలు, ఏప్రిల్ 26, మే 11 తేదీలలో మూడు, నాలుగు విడతల చర్చలు మళ్ళీ మస్కట్‌లో జరిగాయి. ఐదు విడత చర్చలకు కూడా రెండు దేశాలు అంగీకరించిన తర్వాత ఈ వాగ్యుద్ధం జరుగుతున్నది.

## బెలూచిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

**కరాచీ:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ రాష్ట్రంలో ఒక స్కూలు బస్సుపై జరిగిన ఆత్మాహుతి బాంబు దాడిలో ఆరుగురు మరణించారు. వీరిలో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఖుజ్దార్‌జిల్లాలో బుధవారంనాడు ఈ ఘటన జరిగింది. ఇది పిరికిపందల చర్య అని పాకిస్థాన్ సైన్యం విమర్శించింది. ఈ ఆత్మాహుతి బాంబుదాడిలో 38 మంది మరణించినట్లు హోంమంత్రి మొహిసిన్ నక్వి చెప్పారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. పిల్లల మరణంపట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను గుర్తించి వారికి కఠినశిక్షలు అమలు చేయాలని కోరారు. తామే ఈ దాడికి పాల్పడ్డామని ఏ ఉగ్రవాద సంస్థా ప్రకటించలేదు.

## సిరియాపై ఆంక్షలు ఎత్తివేసిన ఇయు



**లండన్ :** సిరియాపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేసేందుకు యూరోపియన్ యూనియన్ అంగీకరించింది. యూరోపియన్ యూనియన్ దేశాల విదేశాంగమంత్రులతో సమావేశం అనంతరం ఇ యు విదేశీ వ్యవహా రాల, భద్రతా విధాన ఉన్నతస్థాయీ ప్రతినిధి కాజా కల్లాస్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఈ ప్రకటన చేశారు. సిరియాపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని తాము ఈరోజే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కొద్దిరోజులముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యప్రాచ్య పర్యటన సందర్భంగా కూడా సిరియాపై 40 ఏళ్ళుగా ఉన్న ఆర్థిక ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఇక అమెరికాకు సిరియా ఒక కొత్త మిత్రదేశమన్నారు.

## పండుటాకు వయసులో డిగ్రీ విద్య

### కలసాకారం చేసుకున్న బామ్మగారు

**బ్రాంక్స్ :** రెండో ప్రపంచయుద్ధకాలంలో జర్మనీ మారణహోమం సృష్టించిన సమయంలో ఫ్రాన్స్‌ను వదిలి అమెరికా పారిపోయిన ఒక బాలిక చివరకు తన 97 ఏళ్ళ పండుటాకు వయసులో కాలేజీ విద్య పూర్తిచేయాలనే కలను సాకారం చేసుకున్నారు. బ్రాంక్స్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మౌంట్ సెయింట్ విన్సెంట్‌లో వృద్ధురాలు జాక్వెలిన్ కిమ్మెల్‌స్టీల్ ఒకరోజుపాటు ఉద్ధృతంగా విరామం లేకుండా తరగతులకు హాజరయ్యారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ సుసాన్ బర్న్స్ ఆమెకు డిగ్రీ పట్టాను ఇచ్చి ఘనంగా సత్కరించారు. నూరేళ్ళ చరిత్రగల ఆరోగ్య సంరక్షణ సంస్థ రివర్‌స్ప్రింగ్ లివింగ్ ఈ వృద్ధురాలి కలను సాకారం చేయడంలో కీలకపాత్ర పోషించింది. ఈ సంస్థ ''గోల్డెన్ విషెస్'' అనేక ఒక కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా జాక్వెలిన్ కిమ్మెల్‌స్టీల్‌కు చిరకాలంగా మిగిలిపోయిన కలను ఈ సంస్థ నెరవేర్చి ఆమెకు పట్టా లభించేట్టు చేసింది. వృద్ధురాలిమనుమలు జాన్ కిమ్మెన్‌స్టీల్, రెబెక్కా కెవెలెన్స్‌లు ఆమెను కాలేజీలో చేర్చి ఆమె విద్యాభ్యాసం పూర్తయ్యేట్టు చూశారు. లిటరేచర్ క్లాసులో వృద్ధురాలు పాఠాలు నేర్చుకోవడానికి వారు సహాయం అందజేశారు. ''విద్య అనేది అందరికీ చాలా అవసరం, ఆమె కొడుకులు, మనుమలు అందరూ మంచి వైద్యులు. అందువల్ల ఆమెకు కూడా విద్య ఎంతో అవసరం. వృత్తివిద్యా కళాశాలకు వెళ్ళడంకంటే కాలేజీ విద్య పూర్తిచేయడమే ఎంతో గొప్పది'' అని ఆమె మనుమరాలు వాషింగ్టన్ పోస్ట్‌కు చెప్పారు.



## చైనా ఎకనామిక్ కారిడార్‌లో అఫ్గానిస్థాన్

**బీజింగ్ :** చైనా–పాకిస్థాన్ దేశాలు ముమ్మరంగా నిర్మిస్తున్న ఆర్థిక కారిడార్ ప్రాజెక్టులో అఫ్గానిస్థాన్ కూడా భాగస్వామిగా చేరేందుకు అంగీకరించింది. ఈ మూడు దేశాల నాయకులు తమ మధ్య త్రైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు అంగీకరించారు. చైనా–పాకిస్థాన్ దేశాల ఆర్థిక కారిడార్ (సిపిఇసి)లో అఫ్గానిస్థాన్ చేరుతున్నట్లు పాకిస్థాన్ ఉపప్రధానమంత్రి ఇషాక్ దార్, చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ, అఫ్గానిస్థాన్ విదేశాంగశాఖ తాత్కాలికమంత్రి అమిర్ ఖాన్ ముత్తాకీలు బుధవారంనాడు త్రైపాక్షిక సమావేశం నిర్వహించినట్లు ఇస్లామాబాద్‌లో విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇషాక్ దార్ మూడు రోజులపాటు బీజింగ్‌లో పర్యటిస్తున్నారు. బీజింగ్‌లోనే ఈ సమావేశం జరిగింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ఉప ప్రధానమంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ''తమ మూడు దేశాలూ ప్రాదేశిక శాంతి, సుస్థిరతలకు కట్టుబడి ఉన్నాయని, అభివృద్ధిని ప్రో త్సహిస్తాయని, ఆర్థిక సంబంధాల వృద్ధికి మౌ లిక సదుపాయాలను విస్తరిస్తాయని ప్రకటన పే ర్కొం ది. అదేవిధంగా తర్వలో కాబూల్‌లో ఈ మూ డు దేశాల విదేశాంగమంత్రులతో ఆరోసారి త్రైపాక్షిక సమావేశం త్వరలో నిర్వహించేందుకు కూడా అంగీకరించినట్లు ప్రకటన పేర్కొంది.



## ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని ప్రధాని పేర్కొన్నారు.

**శాంతిచర్చల అంశాన్ని పట్టించుకోని పాలకులు**

మావోయిస్టు పార్టీ పలు మార్లు శాంతి చర్చలకు సిద్ధమంటూ లేఖలు విడుదల చేయడంతో పాటు వామపక్ష పార్టీలు సైతం ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలని సమావేశాలు నిర్వహించి, కేంద్రానికి లేఖలు సైతం రాశాయి. అయినప్పటికీ కేంద్రప్రభుత్వం శాంతిచర్చలకు ఏ మాత్రం ఆస్కారం ఇవ్వడం లేదు. మావోయిస్టు పార్టీని తుదముట్టించేందుకు కేంద్ర ఆదేశాలతో భద్రతా బలగాలు కంకణం కట్టుకుని అడవులను జల్లెడ పడుతున్నాయి. అబూజ్‌మడ్ లాంటి కీలక స్థావరాల దిశగా వెళ్లాయి. మావోయిస్టులు స్థావరాలు మార్చుకుంటున్నప్పటికీ వాటిని సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో పసిగట్టి, స్థావరాలను చుట్టుముట్టి తూటాల వర్షం కురిపిస్తుండటంతో వందల సంఖ్యలో మావోయిస్టులు, నాయకులు నేలరాలుతున్నారు. శాంతిచర్చల ఊసు లేకుండానే కేంద్రం మావోయిస్టుల ఏరి వేతకు ముందుకు సాగుతోంది.

## ఎడారిగా దక్షిణ తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

చేసుకున్నారన్నారు. తమ ప్రజా ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రిగా తాను నిపుణులు, న్యాయ కోవిదుల సలహాలు తీసుకుని కృష్ణ జలాల పంపకంలో 70 శాతం వచ్చేలా కేసు రీ ఓపెన్ చేయించినట్లు తెలిపారు. పాలమూరు రంగారెడ్డి జిల్లాలకు కృష్ణ జలాల పంపకాల్లో గత ప్రభుత్వం నీటిని కేటాయించకపోవడంతో తాము వచ్చాక నీటి కేటాయింపుల కోసం పోరాడుతున్నట్లు చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రూ.30వేల కోట్లతో తుమ్మడి హట్టి వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత, చెవేళ్ల ప్రాజెక్టు పనులు మొదలుపెట్టగా దానిని రద్దు చేసి, మేడిగడ్డ ప్రాజెక్టును నిర్మించి కాళేశ్వరం పేరుతో లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో కృష్ణానదిపై బీమా, నెట్టెంపాడు, కోయిలసాగర్, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్‌బిసి టన్నెల్ అలాగే గోదావరిపై దేవాదుల, సీతారామ ప్రాజెక్టులు పూర్తి అయ్యేవని అన్నారు. నక్కగండి లిఫ్ట్ ఇరిగేషన్‌పై మాట్లాడుతూ 2008 పనులు మొదలు పెట్టి, 2012లో పూర్తి చేసి రైతులకు నీరు అందజేస్తామని చెప్పి 2018 నుండి మరమ్మతులు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రూ. 37.70 కోట్లతో నక్కగూడెం, చింత్రియాల, కిష్టాపురం, తమ్మారం గ్రామాల్లో 3200 ఎకరాల భూమి సాగు కానున్నదని అన్నారు. 2025 ఆగస్టు నాటికి సంబంధిత పనులను పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. భూమి కిందిభాగంలో వేసే పైపులైన్ సైతం రైతులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు ఇందిరగాంధీ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేయడం జరిగిందన్నారు. ఈ స్కీంకు 1450 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని, మఠంపల్లి మండలంలో 2500 ఎకరాలు, మేళ్లచెరువు మండలంలో 15800 ఎకరాలు, చింతలపాలెం మండలంలో 16700 ఎకరాలు మొత్తం 53వేల ఎకరాల భూమికి సాగునీరు అందిస్తామన్నారు. 2026 నాటికి పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను, అధికారులను అదేశించారు. రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు రూ.394 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. మేళ్లచెరువు, కోదాడ, హుజూర్‌నగర్, చింతలపాలెం, చిలుకూరు మండలాల పరిధిలో 12 గ్రామాల్లో 14100 పంట భూములు సాగులోకి తేనున్నట్లు చెప్పారు. ఈ మూడు స్కీంల ద్వారా 71వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ సిఈ రమేష్‌బాబు, ఎస్ఇ శివధర్మతేజ, డిఇలు చారి, హరి కిషోర్, తహసిల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

జలమయమయ్యాయి. ఒక గంట కుండపోత వర్షం కురవడంతో సాగర్ లో 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. అప్పాజిపేట పరిధిలోని బంటుగూడెంలో మహిళా రైతు జాల బిక్షమ్మ(46) అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఓ గంట పాటు వాన దంచికొట్టింది. ఉరుములు, మెరుపులు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షానికి రహదారులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. న్యూటౌన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వరద నీరు నిలిచిపోవడంతో రోగులు, జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు**

ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఉత్తర కర్నాటకగోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపైనున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందన్నారు. ఇది రాగల 36 గంటల్లో ఉత్తర దిక్కులో కదులుతూ క్రమేపి బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో బుధవారం నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని అధికారులు చెప్పారు.

## ప్రధాని వెనకడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, జిహెచ్‌ఎంసి మేయర్, తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీని విమర్శించడం ద్వారా బిజెపి నాయకులు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలబడాల్సిన సమయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దుప్పటి కప్పుకుని పడుకున్నారని, తాము బయటకు వచ్చి కేంద్రానికి అండగా ఉన్నామని ప్రకటించి మద్దతు తెలిపామన్నారు. ఆనాడు కనీసం మమ్మల్ని అభినందించని వ్యక్తి నేడు రాహుల్‌గాంధీని విమర్శిస్తున్నారన్నారు. తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై విమర్శలు చేస్తున్నారన్నారు. సంకుచిత మనస్తత్వం కలిగిన కొందరు రాజీవ్ గాంధీని విమర్శిస్తున్నారన్నారు. పహల్గామ్ ఘటన నేపథ్యంలో ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ స్ఫూర్తిని దేశంలో ప్రతీ ఒక్కరు గుర్తు తెచ్చుకున్నారన్నారు. తీవ్రవాదుల ముసుగులో దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరాగాంధీ పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పారని, తమ దేశాన్ని తాము రక్షించుకోగలుగుతామని, ఎవరి మధ్యవర్తిత్వం అవసరంలేదని ఇందిరా గాంధీ ఆనాడే స్పష్టం చేశారన్నారు. 'దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది. కాంగ్రెస్ పార్టీది. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం. అది మా బాధ్యత. దేశ సమగ్రత విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేయదు. దేశ భద్రతకు కట్టుబడి పనిచేస్తాం' అని రేవంత్ రెడ్డి అన్నారు.

## 'అవినీతి జలగలు'

(మొదటి పేజీ తరువాయి)

వెళితే... మహబూబ్‌నగర్ జిల్లా మర్తాల్ అర్‌డబ్ల్యుఎస్ ఎఇగా పనిచేసి ఏడునెలల క్రితం బదిలీపై సూర్యాపేట అర్‌డబ్ల్యుఎస్ ఎఇగా బదిలీపై వచ్చిన చిలుకూరు మండలం శీతల్‌తండాకు చెందిన ఇస్లావత్ వినోద్ ఎసిబి అధికారుల వలలో చిక్కారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మర్తాల్‌లో ఆయన విధులు నిర్వహించినప్పుడు మిషన్ భగీరథ పనులకు సంబంధించి ఎంబి రికార్డును కాంట్రాక్టర్ అతని వద్దకు తీసుకువచ్చాడు. ఆ బిల్లును చేయకుండా తనవద్దే గత కాలంగా ఉన్న సదరు ఎఇ వినోద్ పనిచేయాలంటే కొంతడబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో ఆయన ఎంబి రికార్డును చేయించుకునేందుకు తన స్వస్థలమైన కోదాడకు వచ్చి లక్ష రూపాయలు ఇవ్వమని అడగ్గా ఆయన ఎసిబి అధికారులను ఆశ్రయించారు. మంగళవారం కోదాడకు సదరు కాంట్రాక్టర్ డబ్బులు తీసుకుని ఇచ్చేందుకు రాగా డబ్బులు తీసుకున్న తర్వాత తనను ఎవరో వెంబడిస్తున్నారని గమనించి వినోద్ తనతో వచ్చిన మూర్తికి ఆ డబ్బులు ఇచ్చి పారిపొమ్మని చెప్పి తాను కూడా కారులో పరారయ్యాడు. అదే రాత్రి మండలంలోని ఆయన స్వగ్రామమైన శీతల్‌తండాకు రావడంతో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎసిబి అధికారులు వినోద్‌ను పట్టుకున్నారు. బుధవారం కూడా అక్కడ ఆయన ఇంటిలో, బంధువుల ఇళ్లు సహా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బంధువుల ఇళ్లలో ఎసిబి అధికారులు సోదాలు చేశారు. అదుపులో ఉన్న అతడిని విచారించగా లంచంగా తీసుకున్న డబ్బులు తన అన్న కుమారుడు మూర్తికి ఇచ్చినట్లు చెప్పాడు. నల్లగొండ జిల్లా ఎసిబి అధికారులు రామారావు బృంద సభ్యులు స్థానిక పోలీసులతో కలిసి శీతల్‌తండాకు వచ్చారు. మూర్తి ఇంట్లో సోదాలు చేసి వివరాలు సేకరించారు. అతనిని విచారించగా లంచం తీసుకున్న డబ్బులు తన వద్దనే ఉన్నట్లు తెలిపారు. ఎసిబి అధికారుల అదుపులో ఉన్న ఎఇ వినోద్‌ను హైద్రాబాద్‌లోని ఎసిబి కోర్టులో హాజరుపర్చారు.

**ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన గొట్టుముక్కల పంచాయతీ కార్యదర్శి...**

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని గొట్టుముక్కుల పంచాయతీ కార్యదర్శి కట్కం గంగామోహన్ లంచం తీసుకుంటూ బుధవారం ఎసిబి అధికారులకు చిక్కాడు. అధికారుల కథనం ప్రకారం... గొట్టుముక్కల గ్రామస్తుడైన ముప్పడి రాజేందర్ గ్రామంలోని ఓపెన్ ప్లాట్ ఇంటి నెంబర్ కోసం పంచాయతీ సెక్రటరీని ఆశ్రయించారు. పంచాయతీ కార్యదర్శి గంగామోహన్ ఇంటినెంబర్ ఇవ్వడానికి రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. పంచాయతీ కార్యదర్శి కట్కం గంగామోహన్‌ను, ముప్పడి రాజేందర్ కాళ్లావేళ్లా బడ్డా ససేమిరా అన్నాడు. చివరకు రూ. 10 వేలు ఇస్తానని చెప్పినా కూడా వినకుండా రూ.20 వేలు ఇస్తే కానీ చేయనని, 15 రోజుల నుండి ఇబ్బందికి గురి చేయసాగాడు. గత్యంతరం లేక అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించానని ముప్పడి రాజేందర్ అని తెలిపారు. పక్కా పథకం ప్రకారం ఎసిబి డిఎస్‌పి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు బాధితుడు ముప్పడి రాజేందర్ పంచాయతీ కార్యదర్శికి లంచంగా 18 వేలు ఇస్తున్న సమయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. గంగామోహన్‌ను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎసిబి డిఎస్‌పి శేఖర్‌గౌడ్ తెలిపారు.

## ముందస్తు రుతు పవనాలతో
# ప్రభుత్వం అప్రమత్తం

### మార్గ దర్శకాలను విడుదల చేసిన విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ముందస్తుగానే ప్రవేశిస్తుండడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. రుతు పవనాల ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున విపత్తుల నివారణకు ముందస్తు చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో ఈ నెల చివరి నాటికి రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలకు ముందస్తు చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ మార్గదర్శకాలను విడుదల చేశారు.2024 ఆగస్టులో వచ్చిన భారీ వర్షాలతో సకాలంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు చేరుకోక పోవడంతో జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని, ముందస్తుగానే ఈసారి 12 స్టేట్ డిసాస్టర్ రిలీఫ్ ఫోర్స్ (ఎస్‌ఆర్‌డిఎఫ్) లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఒక్కో టీమ్‌లో తెలంగాణా స్పెషల్ పోలీస్‌కు చెందిన 100 సుశిక్షితులైన పోలీసులు ఉంటారని, ఈ బృందాలను రాష్ట్రంలోకి పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేశామని చెప్పారు. తద్వారా ఎక్కడైనా భారీ వర్షాలు, తుఫానులు వచ్చినా, వెంటనే సమీపంలోని ఎస్‌ఆర్ డిఎఫ్‌బృందాలు చేరుకుంటాయని కలెక్టర్లకు తెలిపారు. దీనితో పాటు ఈసారి 3 ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాలు కురిసే జిల్లాల్లో ఈసారి ప్రత్యేకంగా అదనపు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు విజ్ఞప్తి చేశామని ఆయన వెల్లడించారు.ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న అన్ని ఫైర్ స్టేషన్లలో ఫైర్ సిబ్బందికి ప్రత్యేకంగా విపత్తుల నివారణ చర్యలపై శిక్షణను ఇచ్చామని,హైదరాబాద్ తోపాటు శివారు ప్రాంతాలకు తక్షణమే స్పందించేలా హైడ్రా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాలు, ఆకస్మిక వర్షాలు వస్తే నష్టాలను తగ్గించడానికి పై చర్యలు ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశముంటే, సంబంధిత జిల్లాలకు కేటాయించిన ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో టచ్ లో ఉండాలని ఆయా బృందాల వివరాలు సంబంధిత అధికారులకు కూడా ఇవ్వాలని సూచించారు. అప్పటికప్పుడు జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల ఫైర్ ఆఫీసర్లతో సంప్రదిస్తూ, స్టేట్ డిజాస్టర్ ఫోర్స్ సేవలను పొందాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ సేవలు కావాలంటే స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విపత్తుల నివారణలో సుశిక్షితులైన సింగరేణి కాలరీస్ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించుకోవాలన్నారు. కలెక్టర్లు తమ తమ జిల్లాలోని వరదలు, వర్షాల వల్లముంపు ప్రాంతాలు, ఇతర సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఆదేశాలు జారీచేశారు.

## అప్రమత్తంగా ఉండండి (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. హైదరాబాద్‌నగరంలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలువకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సిఎం ఆదేశించారు. జిహెచ్‌ఎంసి, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

**గమనిక**

'పార్లమెంట్ కంటే విదేశీ యాత్రలకు ప్రాధాన్యత : డి.రాజా' అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన వార్తలో 'లోక్‌సభ, రాజ్యసభలో సిపిఐకి చెరోక సభ్యుడు చొప్పున ఇద్దరు సభ్యులు ఉన్నారు.' అని పొరపాటున వచ్చింది. బదులుగా 'లోక్‌సభ, రాజ్యసభలలో సిపిఐకి ఇద్దరు చొప్పున మొత్తం నలుగురు సభ్యులు ఉన్నారు.' అని చదువుకోగలరు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌ను ఖండించిన సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత కొన్ని నెలలుగా మధ్య భారత అడవుల్లో కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' పేరుతో కొనసాగిస్తున్న హత్యాకాండను తక్షణమే నిలిపివేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్ పేరుతో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు 25కు మందిని కాల్చి చంపివేయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వి.సూర్యం అన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, మేధావులు, ప్రజాస్వామికవాదులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమితేషాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పైగా నరమేధాన్ని తీవ్రతరం చేసి ఈ దేశ పౌరులను హత్యలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం చేస్తున్న ఈ నరమేధాన్ని ప్రజలూ, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని ఆయన కోరారు.

# ఎందుకు చట్టవిరుద్ధ హత్యలకు పాల్పడుతున్నారు?

### ఆపరేషన్ కగార్‌పై స్వతంత్ర న్యాయ విచారణకు సిపిఐ డిమాండ్

**న్యూఢిల్లీ :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు అగ్రనేతను, అనేకమంది ఆదివాసీ ప్రజలను భద్రతాదళాలు చట్టవిరుద్ధంగా హత్యలు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు ఈ దారుణచర్యలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని, ఈ అన్యాయాన్ని ఖండించాలని, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు సంఘీభావంగా నిలబడాలని సిపిఐ పిలుపు ఇచ్చింది. ఆపరేషన్ కగార్‌పై ఒక స్వతంత్ర న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేసింది. పార్టీ జాతీయ కార్యదర్శివర్గం బుధవారంనాడు ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

''ఛత్తీస్‌గఢ్‌లో సీనియర్ మావోయిస్టు నాయకుణ్ణి, ఆయనతోపాటు ఆదివాసీ ప్రజలను నిర్దాక్షిణ్యంగా చంపడాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. దేశంలో తీవ్రవాద నిర్మూలన కార్యకలాపాల ముసుగులో పాల్పడిన చట్టవిరుద్ధమైన హత్యాకాండకు ఇది మరో ఉదాహరణ. చట్టాలకు కట్టుబడి అరెస్టులు చేయకుండా పదే పదే ప్రాణాంతకమైన ఆయుధాలను, బలగాలను ఉపయోగించి చట్టవిరుద్ధమైన హత్యలకు పాల్పడటం తీవ్ర ఆందోళనకరం. ప్రభుత్వం దేశీయ ప్రజాస్వామ్య నిబంధనలకు, చట్టాలకు కట్టుబడి వ్యవహరించాలి. సంబంధిత మావోయిస్టు నాయకుడి గురించి అధికారులవద్ద గనుక విశ్వసనీయమైన గూఢచారి సమాచారం ఉంటే న్యాయబద్ధంగా వారిని ఎందుకు అరెస్టు చేసి శిక్షించడం లేదు? రాజ్యాంగం నిర్దేశించిన విధంగా చట్టపరమైన ప్రక్రియకు భరోసా ఇవ్వకుండా దానిని ఎందుకు నిర్లక్ష్యం చేసి చట్టవిరుద్ధమైన హత్యలకు పాల్పడుతున్నారు? ఈ విధమైన హత్యలు అత్యంత ప్రమాదకరమైన ప్రభుత్వ తరహా హింస మాత్రమే కాదు, ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ ప్రజల బాగోగులు పట్టించుకోకుండా వారిపై ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యాన్ని కూడా ప్రస్ఫుటంగా ఈ చర్యలు కళ్ళకు కడుతున్నాయి. భద్రతా దళాలకు, నక్సలైట్లకు మధ్య జరుగుతున్న కాల్పుల వివాదంలో పదే పదే ఈ ఆదివాసీ ప్రజలను పట్టుకుంటున్నారు. కానీ వారిని నక్సలైట్లకు సహాయం చేస్తున్నవారిగా పరిగణిస్తున్నారు. ఎలాంటి శిక్షార్హతాలేని అమాయకులైన ఆదివాసీ ప్రజలు చిక్కుల్లో పడేస్తున్నారు. అందువల్ల ఈ కాల్పుల ఘటనపైన, ఈ మొత్తం కగార్ ఆపరేషన్ వ్యవహారంపైనా ఒక స్వతంత్ర న్యాయ విచారణ జరపాలని సిపిఐ డిమాండ్ చేస్తోంది. దీనికి సంబంధించిన పూర్తి వాస్తవాలు తెలుసుకునే అర్హత యావత్ భారతదేశ ప్రజలు, ఛత్తీస్‌గఢ్‌లోని ప్రజలకు ఉంది. పాలకులే న్యాయనిర్ణేతలుగా మారి, తీర్పులు చెప్పడాన్ని, తీర్పులను అమలు చేయడాన్ని ప్రజాస్వామ్య సమాజం ఎన్నటికీ అనుమతించదు, న్యాయస్థానంలో న్యాయం జరగాల్సిందే. ఆదివాసీ ప్రజల జీవితాలను, వారి హక్కులు, గౌరవ మర్యాదలను సమున్నతంగా నిలబెట్టాల్సిందే'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ప్రకటనలో పేర్కొంది.

**ఇద్దరు ప్రముఖ శాస్త్రవేత్తల మృతికి సిపిఐ సంతాపం**

దేశంలో ఇటీవల మరణించిన ఇద్దరు ప్రముఖ శాస్త్రవేత్తలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్ర సంతాపం ప్రకటించింది. ఈమేరకు పార్టీ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటన చేసింది. ప్రముఖ అణుశాస్త్రవేత్త ఎంఆర్.శ్రీనివాసన్(95) ఉదకమండలంలో, ప్రముఖ ఖగోళశాస్త్రవేత్త డా.నార్లికర్(87) పుణెలో మంగళవారంనాడు కన్నుమూశారు. వీరి మరణం వైజ్ఞానికరంగానికి, యావత్ ప్రపంచానికీ తీరని లోటు అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం పేర్కొంది. దేశంలో వైజ్ఞానిక ఉద్యమం ఎప్పటికీ ఈ ఇద్దరు శాస్త్రవేత్తలను గుర్తుంచుకుంటుందని, భౌతికంగా వారు లేకపోయినా ఆ ఇద్దరూ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంది. డా.నార్లికర్ తన గురువు ఫ్రెడ్ హోయిల్‌తో కలిసి ఒక విశ్వాంతరాళానికి ఒక ప్రత్యామ్నాయ నమూనాను అభివృద్ధి చేసేందుకు ఎంతోకృషి చేశారని కొనియాడింది.



### మావోయిస్టుల ఏకపక్షంగా ఎన్‌కౌంటర్ చేయడం అప్రజాస్వామికం : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఛత్తీస్‌గఢ్‌లో సిపిఐ మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. శాంతి చర్చలకు సిద్ధమేనని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏకపక్షంగా ఎన్‌కౌంటర్లు చేయడం అప్రజాస్వామికమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమాజంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు, మేధావులు రచయితలు తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరుతున్నప్పటికీ కేంద్రం మొండివైఖరి ప్రదర్శించడాన్ని కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. ఎలాంటి సమస్యకైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని చెప్పడానికి చరిత్రే సాక్ష్యమన్నారు. తక్షణమే 'ఆపరేషన్ కగార్' నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు.



### సుకుమారన్ మరణం
## శాంతి ఉద్యమాలకు తీరని లోటు

### సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దోపిడీ, వివక్షకు గురైన ప్రజల స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఎనలేని కృషి చేసిన గొప్ప అభ్యుదయవాది టి.ఎస్.సుకుమారన్ అని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా కొనియాడారు. భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ కార్యదర్శి సుకుమారన్ విశాఖపట్నంలోని తన స్వగృహంలో ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, ఆయన మరణం శాంతి ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో బుధవారం భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్), తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బుధవారం టిఎస్.సుకుమారన్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్‌పాషా, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రేఖల గోపాల్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, రాష్ట్ర నాయకుడు ఎండి.మహబూబ్ తదితరులు సుకుమారన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అజీజ్‌పాషా మాట్లాడుతూ దేశంలో సాంస్కృతిక సహకారం ద్వారా శాంతిని పెంపొందించడానికి విశేష కృషి చేసిన ప్రగతిశీల నేత టిఎస్.సుకుమారన్ అని అన్నారు. గోపాల్ మాట్లాడుతూ స్నేహ, సాంస్కృతిక విలువల రక్షణ కోసం పాటుపడుతూ, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు మధ్య సంబంధాలను ప్రోత్సహించడానికి సుకుమారన్ చేసిన కృషి మరువలేదని తెలిపారు.

కెవిఎల్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సమానత్వవాద సమాజం కోసం అనేక ఉద్యమాలలో టిఎస్.సుకుమారన్ క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రజల నుండి ప్రజలకు సాంస్కృతిక అవగాహన, స్నేహాన్ని ప్రోత్సహించేందుకు అయన కృషి శ్లాఘనీయమని కొనియాడారు.

## అవి చట్టవిరుద్ధ హత్యలు

### సిపిఐ(ఎంఎల్)లిబరేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కేశవరావు, ఇతర మావోయిస్టులు, ఆదివాసుల దారుణమైన చట్టవిరుద్ధ హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ (ఎంఎల్ ) లిబరేషన్ కేంద్ర కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజయోత్సవంతో చేసిన వ్యాఖ్య (పోస్టు) ద్వారా రాజ్యమే చట్టవిరుద్ధ నిర్మూలన కార్యక్రమానికి నేతృత్వం వహిస్తూ, పౌరులను చంపిన ఘనతను తీసుకుంటూ, కార్పొరేట్ల దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసుల నిరసనను అణిచివేస్తున్నట్లు స్పష్టమవుతుందని విమర్శించింది. ఈ నరమేధంపై న్యాయ విచారణ జరిపించాలని, మావోయిస్టులు ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటనతో మిలిటరీ ఆపరేషన్ నిలిపివేయాలని న్యాయకాముకులైన భారతీయులంతా డిమాండ్ చేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రకట నను సిపిఐ (ఎంఎల్ ) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న త్రివేణి సంగమం

### 7వ రోజుకు చేరుకున్న సరస్వతి పుష్కరాలు
### స్నానాలు ఆచరించిన భక్తులు



అంతర్ధానం అయిన సరస్వతి నది

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం :** చారిత్రాత్మక నేపథ్యాన్ని, ప్రకృతి ఆహ్లాదాన్ని, ఆధ్యాత్మికత శోభను సంతరించుకున్న త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఏడో రోజుకు చేరుకున్నాయి. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులు తమ శక్తి కొద్దీ దానాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. గోదావరి, ప్రాణహిత నదుల సంగమించిన కాళేశ్వరంలో ప్రవహిస్తున్న అంతర్వాహిని సరస్వతి నది బ్రహ్మపత్ని పేరిట వెలియడం విశేషం. త్రిలింగ క్షేత్రంలో లింగాకారంలో యముడు, శివుడు ఒకే పానవట్టంపై సాక్షాత్కరించడమే కాకుండా, ఈ ఆలయంలో అత్యంత ప్రాశస్త్యం ఉన్న చరిత లిఖించి ఉంది. భక్తులకు మోక్షాన్ని ఇచ్చే శివుడు, పాపాత్ములను శిక్షించే యముడు ఒకే చోట వెలిసిన చరిత్ర కాళేశ్వరం సొంతమనే చెప్పాలి. మరో వైపున ఉత్తరాదిన దేవదారుకారుణ్యం విస్తరించిన కశ్మీర్‌లో బాలసరస్వతిగా ఉద్భవించిన అమ్మవారు దండకారణ్యంలోనే మరో రెండు రూపాలలో సాక్షాత్కరించడం తెలంగాణాకే తలమానికంగా నిలుస్తోంది. నిర్మల్ జిల్లా బాసరలో జ్ఞాన సరస్వతిగా భక్తులకు దర్శనం ఇస్తుండగా, కాళేశ్వరంలో మహా (పౌడ) సరస్వతిగా ఆశీస్సులను అందిస్తోంది. హిమాలయాల్లో పుట్టిన సరస్వతి నది అంతర్థానం అవుతూ అక్కడక్కడ తన ఉనికిని బయటపెడుతూనే ఉంది. శతాబ్దాల క్రితమే భౌగోళికంగా వచ్చిన మార్పుల వల్ల రెండు నదులు సంగమించే కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహిస్తోందని పురాణ ఇతిహాసాలు చెప్తున్నాయి. దేశంలో అత్యంత అరుదైన సరస్వతీ నదికి దక్షిణాది రాష్ట్రాల్లోనే ఒకే ఒకచోట పుష్కరాలు జరుగుతున్నాయి. అది జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం కావడం విశేషం. అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి నది కూడా మహాసరస్వతిగా అవతరించిన కాళేశ్వరంలోనే ఉండడం ఇక్కడ మరో ప్రత్యేకత. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న కాళేశ్వరం తెలంగాణ, మహారాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్నది.

**అక్కడ అలా.. ఇక్కడ ఇలా :** త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు పుష్కర స్నానాలతో తన్మయత్వం చెందుతున్నారు. చిన్నా, పెద్దలంతా త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు చేస్తూ సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోతున్నారు.

**ఏడో రోజున..? :** పుష్కర నదిలో పుణ్య స్నానం ఆచరించిన తరువాత దానధర్మాలు చేయడం కూడా ముఖ్యమని పూర్వీకులు చెప్పేవారు. ఇందులో భాగంగా నేటికీ కూడా పుష్కర నదీ తీరంలో దానాలు చేసే సాంప్రదాయం కొనసాగుతోంది. ఏడో రోజున గృహదానం, పీటల దానం, శయ్య దానం చేయడం వల్ల శుభం కలుగుతోందని చరిత్ర చెబుతోంది.

## ఉగ్రవాద నిర్మూలనే మోదీ సర్కార్ లక్ష్యం

### పెహల్గాం ఘటన తర్వాత దేశ ప్రజల్లో మార్పు
### యుద్ధంలో పాల్గొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు
### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడమే నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ తెలిపారు. పెహల్గాం ఘటన తరువాత దేశ ప్రజల్లో చాలా మార్పు వచ్చిందన్నారు. ఉగ్రవాద నిర్మూలన కోసం జరిగే యుద్ధంలో అవసరమైతే సామాన్య ప్రజలు సైతం పాల్గొనేందుకు సిద్ధమయ్యారన్నారు. పాకిస్తాన్ భూభాగంలోకి వెళ్లి అక్కడి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంతోపాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన ఘనత భారత సైన్యానిదేనన్నారు. ఉగ్రవాద వ్యతిరేక దినం సందర్భంగా కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కరీంనగర్‌లో ర్యాలీని నిర్వహించారు. కేంద్ర మంత్రి బండిసంజయ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడంతో పాటు విద్యార్థులతో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బండిసంజయ్ మాట్లాడుతూ ప్రపంచంలో టెర్రరిజాన్ని అణిచివేసే శక్తి సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయనే విషయాన్ని ప్రపంచమంతా గుర్తించిందన్నారు. పెహల్గాం ఘటన అనంతరం భారత సైన్యం టెర్రరిస్టుల స్థావరాలను గుర్తించి ధ్వంసం చేయడంతో పాటు ఉగ్రవాదులను మట్టుబెట్టిన మన సైన్యం ధైర్యసాహసాలను చూశామన్నారు. పాకిస్తాన్ టెర్రరిస్టులకు అడ్డాగా మారిందని, టెర్రరిస్టులను ప్రోత్సహిస్తూ ఆ దేశం ఆర్థిక సాయం చేస్తోందన్నారు.

నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి ఆ దేశంలోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం జరిగిందని, ముంబయి పేలుళ్లు, లుంబినీ పార్క్, గోకుల్‌చాట్ పేలుళ్లు, మక్కా మసీదు పేలుళ్ల తర్వాత దేశ ప్రజల్లో మార్పులు వచ్చాయన్నారు. అవసరమైతే దేశం పక్షాన టెర్రరిజంపై యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉండడం సంతోషకరమన్నారు. పాకిస్తాన్ భారత సరిహద్దు ప్రాంతాల్లో సామాన్య ప్రజలను, వారి ఆవాసాలను టార్గెట్ చేసి ధ్వంసం చేయాలనుకుందన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని వాటిని తిప్పికొట్టిన ఘనత మన సైన్యానిదేన్నారు. యాంటీ టెర్రరిజం డే సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం ముందుకొచ్చి ర్యాలీ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

## అసమానతలు తొలగిపోవాలంటే అందరూ విద్యావేత్తలు కావాలి

### మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి టీచర్లకు ప్రతి ఏడాదికి రెండుసార్లు శిక్షణ ఇవ్వనున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయంలో, దసరా సంక్రాంతి మధ్యలో రెండుసార్లు శిక్షణ ఇస్తామన్నారు. సమాజంలో అంతరాలు, అసమానతలు తొలగిపోవాలంటే అందరూ విద్యావేత్తలు కావాలని సూచించారు. గిరిజన విద్యాసంస్థల్లో బోధిస్తున్న ఇతర వర్గాల టీచర్లు తమ సంస్కృతి, సాంప్రదాయాలను గిరిజన విద్యార్థులపైన రుద్దవద్దని తెలిపారు. హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని కొమరం భీం ఆదివాసి భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ''ఎకాడమి సక్సెస్ మీట్ 2025'' కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కె.తిరుపతి, ఎంఎల్‌ఎ బొజ్జు పటేల్, గిరిజన శాఖ కార్యదర్శి శరత్, గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పది, ఇంటర్, ఎంసెట్, జెఇఇ మెయిన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గిరిజన గురుకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో చదువు ఎంతో కీలకమని, గిరిజన ప్రాంతాల్లో చదువు లేకపోవడంతో తమను చిన్న చూపు చూశారని, తమను అక్షరానికి దూరం చేసి అనాగరికలనే ముద్ర వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు నిరక్షరాస్యత దశ నుంచి అక్షరాస్యత దశ దాటుకొని ,ఇప్పుడు రాష్ట్రానికి టాపర్స్‌గా మారే దశకు చేరుకున్నారన్నారు. ఆదివాసీ, గిరిజనులు తమ అస్తిత్వాన్ని పరిరక్షించుకోవాలని, సంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని, విద్యా సంస్థలల్లో ఎస్‌టిల ప్రత్యేక సంస్కృతిని కాపాడాలని సూచించారు. విద్యకు సిఎం రేవంత్ రెడ్డి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రతిభా పురస్కారాలు అందుకోలేక పోయిన విద్యార్థులు మరింత పట్టుదలతో చదవాలి దేశ భవిష్యత్తు నేటి విద్యార్థుల చేతుల్లో ఉంటే, ఆ విద్యార్థుల భవిష్యత్తు టీచర్ల చేతిలో ఉన్నదని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ఆదివాసి, గిరిజన బిడ్డలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఉన్నత స్థానాలకు చేరుకునే గిరిజన విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, తిరిగి సమాజానికి వారి వారి సేవలను అందించాలని, 'పే బ్యాక్ టు సొసైటీ' అన్న సిద్ధాంతాన్ని ఆచరణలో చేసి చూపించాలని సూచించారు. గురుకులాలు, గిరిజన విద్యా సంస్థల గౌరవాన్ని నిలబెట్టేలా విద్యార్థులు కష్టపడాలన్నారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు.బిఆర్‌ఎస్ పాలనలో ఐటిడిఎలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. ఐటిడిను తిరిగి బలోపేతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించినట్టు తెలిపారు.

## రాష్ట్రంలో కమీషన్ల పాలన

### కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్ని నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేదు : మాజీ మంత్రి కెటిఆర్



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల పాలన కొనసాగిస్తుందని మాజీ మంత్రి బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు(కెటిఆర్)ఆరోపించారు. నల్లగొండ పట్టణంలో బుధవారం జరిగిన ఓవివాహ వేడుకకు మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డితో హాజరై అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో గల్లంతయిన కార్మికుల మృతదేహాలను మూడు నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం బయటకు తీసుకు రాలేకపోయిందని కమిషన్లు లేనిదే రాష్ట్రంలో ముఖ్యమంత్రి, క్యాబినెట్ మంత్రులు ఏ పనులు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్ని నోటీసులు ఇచ్చినా ప్రయోజనం లేదని కాంగ్రెస్‌వి చిల్లర ప్రయత్నాలు అన్నారు. కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు. కమీషన్లు ఇస్తేనే ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లించే హీన స్థితికి చేరుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీందర్ నాయక్, కంచర్ల భూపాల్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య, బూడిద బిక్షమయ్య గౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ప్రధానమంత్రి భారతరత్న రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళ్లు అర్పించారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, అన్నదానం, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సచివాలయం వద్ద గల రాజీవ్ గాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పూలమాలాలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సిఎం కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. గాంధీభవన్‌లో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్ గౌడ్ రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరాన్ని మహేష్‌కుమార్ గౌడ్ ప్రారంభించారు. అదే విధంగా పంజాగుట్ట చౌరస్తాలో రాజీవ్ విగ్రహం వద్ద పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు జానారెడ్డి వి.హనుమంతరావు మంత్రిజూపల్లి కృష్ణారావు ఎంఎల్‌ఎలుదానం నాగేందర్, బిర్లా ఐలయ, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్ చైర్మన్లు శివసేనారెడ్డి సాయికుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ రెడ్డి శ్రీలతశ్రీనివాస్ యాదవ్ మహాలక్ష్మి రామన్ గౌడ్ లక్ష్మణ్ యాదవ.బొల్లు కిషన్, జగదీశ్వర్ రావు, లఘు పతి యాదగిరి గౌడ్, అప్సర్, యూసుఫ్, ఆది అవినాష్ శంభుల శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

## రాష్ట్ర పోలీసు శాఖ పనితీరు భేష్

### 52 మంది పోలీసులను సత్కరించిన డిజిపి డాక్టర్ జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పోలీసు శాఖలో విధినిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 52 మంది పోలీసులకు డిజిపి డాక్టర్ జితేందర్ ప్రశంసా పత్రం, నగదు బహుమతులతో బుధవారం సత్కరించారు. డిజిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిజిపి జితేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్నదని జాతీయ స్థాయిలో నిరూపితమైందన్నారు. వరుస జాతీయ అవార్డులతో తెలంగాణ పోలీసు శాఖ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని అన్నారు. నేర పరిశోధన, గుర్తింపు, ఇతర సంబంధిత విభాగాల్లో ఉత్తమ పనితీరును ప్రదర్శించిన 52 పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా డిజిపి అభినందించారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 ప్రకారం.. తెలంగాణ పోలీసులు జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సెల్ ఫోన్ రికవరీలో ఈ విభాగం దేశంలోనే ముందుందని కూడా ఆయన పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది అసాధారణ పనితీరు ఈ శాఖ విజయానికి గణనీయంగా దోహదపడిందరి పేర్కొన్నారు. ఉత్కృష్టతను కొనసాగించాలని, మరింత మెరుగుపరచాలని ఆయన అధికారులకు గుర్తు చేశారు. నిరంతర అభివృద్ధి కోసం కృషి చేయాలని, విజయ వేగాన్ని కొనసాగించాలని సిబ్బందిని డాక్టర్ జితేందర్ కోరారు. అధికారులు నిజాయితీ, సమగ్రతతో పాటు ప్రజా నిబద్ధతతో పని చేసి జాతీయ గుర్తింపును మరింత పొందాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐడి డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ మాట్లాడుతూ.. ఉత్తమ సమాధి నేర గుర్తింపు, ఉత్తమ నేరారోపణ, గరిష్ట సంఖ్యలో యుఐల లిక్విడేషన్ కేసులు, గరిష్ట సంఖ్యలో ఎన్‌బిడబ్ల్యూల అమలు, నిర్ణీత వ్యవధిలోపు పోస్కో కేసులను గరిష్టంగా పరిష్కరించడం (60 రోజులు), జాతీయ లోక్ అదాలత్‌లో గరిష్టంగా పరిష్కరించడం, సైబర్ నేరాల కేసుల్లో గరిష్టంగా బాధితులకు తిరిగి చెల్లింపు, ఆస్తి నేరాల గుర్తింపులో అత్యుత్తమ పనితీరు ఇలాంటి అంశాలను పరిగణలోకి తీసుకుని సిబ్బంది పనితీరును బేరీజు వేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్, ఇంటెలిజెన్స్, శ్రీ బి. శివధర్ రెడ్డి, అదనపు డిజిపిలు మహేష్ ఎం.భగవత్, అనిల్ కుమార్, ఐజిపిలు ఎం. రమేష్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీ రమేష్ నాయుడు, శ్రీనివాస్, సిఐడి డిఐజి నారాయణ నాయక్, సిఐడి ఎస్‌పి శ్రీనివాస్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

### వరుస ఎన్‌కౌంటర్లతో
## అప్రమత్తమైన తెలంగాణ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణఛత్తీస్‌ఘఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలులో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లతో రాష్ట్ర భద్రతా వ్యవస్థ అప్రమత్తమైంది. నెల రోజుల నుంచి కర్రెగుట్టలో జరుగుతున్న భారీ కూంబింగ్, ఎన్‌కౌంటర్లతో సుమారు 65 మందికిపైగా మావోయిస్టులు మరణించారు. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 27 మందిలో మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ అలియాస్ గంగన్న మృతి చెందాడని కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటించడం మావోయిస్టులకు కోలుకోని దెబ్బ. అయితే అతని మృతిపై ఎపి పౌర హక్కుల సంఘం నేతలు పలు అనుమానాలు వ్యక్తం చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో మావోయిస్టులు రెచ్చిపోయే అవకాశాలు ఉన్నందునా తెలంగాణ పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, వరంగల్ ప్రాంతాలలో గ్రేహౌండ్స్ పోలీసు బలగాలను రంగంలోకి దింపారు. దీంతో పాటు అదనపు శాంతి భద్రతల పోలీసు దళాలను కూడా ఈ జిల్లాలకు పంపించారు. రాత్రి వేళ్లలో పెట్రోలింగ్‌ను పెంచారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాలను తనిఖీ చేయడం, అనుమానితులను ప్రశ్నించడంతో పాటు అదుపులోకి తీసుకుంటున్నారు. ఎన్‌కౌంటర్లు, తనిఖీలు, కూంబింగ్‌లు పెరగడంతో చాలా మంది మావోయిస్టులు తెలంగాణ వైపు వచ్చి లొంగిపోతున్నారు. ఇలా లొంగిపోయిన వారి సంఖ్య గత నెల రోజులలో వందకుపైగా ఉంది.

**అప్రమత్తంగా ఉన్నాము..డిజిపి డాక్టర్ జితేందర్**

కర్రెగుట్టలో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లపై పోలీసు శాఖ దృష్టి సారించింది. కర్రెగుట్టలు తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉండడంతో తాము అప్రమత్తంగా ఉన్నాము. ఛత్తీస్‌ఘడ్ పోలీసులతో ఎప్పటికప్పుడు సమాచార సేకరణ తీసుకుంటున్నాము. ఈ మధ్య రోజుల్లో తెలంగాణ పోలీసులకు వందకుపైగా మావోయిస్టులు లొంగిపోయారు. ఆయుధాలు వదిలి పోలీసులకు లొంగిపోవాలని కూడా తాము పిలుపునిస్తున్నాము.


**తెలంగాణ ప్రభుత్వం సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం**
మిషన్ భగీరథ సర్కిల్-ఖమ్మం (ఎస్.సి. బాలుర హాస్టల్ పక్కన, రామాలయం వీధి, ఎన్.ఎస్.పి. క్యాంపు, ఖమ్మం)

షార్టు టెండర్ నోటీసు నం. 3,4 మరియు 7/2025-26, Dt. 21.05.2025
"గోదావరి సెగ్మెంట్‌లో వివిధ పనుల కోసం అర్హత కలిగిన సివిల్ కాంట్రాక్టర్ల నుండి ఇప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫాంలో బిడ్లు ఆహ్వానించబడ్డాయి 3) పర్ణశాల ఇంటెక్ వెల్ వద్ద కొత్త VT పంపుసెట్ అందించడం. అంచనా వ్యయం రూ. 35 లక్షలు, 4) భద్రాచలం పట్టణంలోని ఇంటెక్ వెల్ వద్ద కొత్త VT పంపుసెట్లను అందించడం. అంచనా వ్యయం రూ. 45 లక్షలు. 7) చెర్ల మండలంలోని ఉప్పరిగూడెం నివాస స్థలంలో 90KL సంప్ కమ్ పంప్ హౌస్ నిర్మాణం. అంచనా వ్యయం రూ. 17 లక్షలు, (15% ఎస్.సి రిజర్వుడ్)." షెడ్యూల్లు https://tender.Telangana.gov.in వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటాయి, 23.05.2025 నుండి 30.05.2025 వరకు మధ్యాహ్నం 3 గంటల వరకు బిడ్ తేది 30.05.2025న సాయంత్రం 4 గం.లకు తెరవబడును.
Sd/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ సర్కిల్, ఖమ్మం.
DIPR R.O.No: 2263-PP/CL/ADVT/1/2025-26 Date: 21-05-2025

GHMC
**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సరూర్ నగర్ సర్కిల్ -5

NIT No.02/EE5/SRNR/GHMC/2025–26 తేదీ: 21.05.2025, 1. పని పేరు: (09) పని సంఖ్యల కోసం క్యాచ్ పిట్ నిర్వహణ, జిమ్ సంస్థాపన, భవన మరమ్మతులు మరియు వర్షాకాల పనులు. 2. అంచనా మొత్తం: రూ. 86.28 లక్షలు, 3. బిడ్ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం: 28.05.2025@ మధ్యాహ్నం 3 గం.లకు 4. పేరు మరియు చిరునామా అధికారి సెల్ నెం: శ్రీ కె శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్ – 5, జిహెచ్‌ఎంసి, (ఫోన్): 9989930602.
Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్ నగర్ సర్కిల్–5, జిహెచ్‌ఎంసి
DIPR R.O.No: 2251-PP/CL/ADVT/1/2025-26 Date: 21-05-2025

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
గురువారం, మే 22

# నరమేధం ఆపండి!

మావోయిస్టులను నిర్మూలించే నరేంద్రమోదీ ప్రభుత్వ ఎజండా బుధవారం ఉదయం చత్తీస్‌ఘడ్ లో 27మంది మావోయిస్టుల ప్రాణాలు బలిగొన్నది. సిపిఐ(మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ ఈ 'ఎన్‌కౌంటర్' మృతుల్లో ఉన్నట్లు హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ స్థాయి నాయకుడు గత ముప్పదేళ్ల నక్సల్ వ్యతిరేక పోరాటంలో మరణించటం ఇదే మొదటిసారి అని సంతోషం వ్యక్తం చేశారు. 2026 మార్చి 31నాటికి నక్సలిజాన్ని రూపుమాపాలన్న మోదీప్రభుత్వ సంకల్పాన్ని షా పునరుద్ఘాటించారు. ఈ గొప్ప విజయం సాధించినందుకు భద్రతాదళాలను అమిత్ షా అభినందించారు. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్' పూర్తయిన తదుపరి చత్తీస్‌ఘడ్, తెలంగాణ, మహారాష్ట్రల్లో 54మంది నక్సలైట్లు అరెస్టు అయినారని, 84మంది లొంగిపోయారని ఆయన వెల్లడించారు. బుధవారం ఎన్‌కౌంటర్ ఫలితాన్ని ప్రధాని నరేంద్రమోదీ గొప్ప విజయంగా అభివర్ణించారు. మన ప్రజలకు శాంతి, పురోభివృద్ధి జీవితాన్ని అందించటానికి మావోయిజం బెడదను నిర్మూలిస్తామన్నారు. ఈ సంవత్సరంలో ఇంతవరకు 200మంది నక్సలైట్లను ఖతం చేసినట్లు చత్తీస్‌ఘడ్ ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి విజయ్‌శర్మ చెప్పారు. వారిలో 183మందిని బిజాపూర్, నారాయణ్‌పూర్, దంతెవాడ, కొండగాం జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో అంతమొందించారు. చుట్టుముట్టి సరెండర్ సాధించే అవకాశాన్ని అన్వేషించకుండా తుపాకీ కాల్పుల్లో ఉత్సాహం చూపటం, దాన్ని ఘనవిజయంగా చెప్పుకోవటం ప్రభుత్వ అమానుషత్వానికి నిదర్శనం. ఎన్‌కౌంటర్ అంటేనే ప్రభుత్వ హత్యలనే అర్థం ఏనాడో స్థిరపడింది.

తెలంగాణ నుంచి చత్తీస్‌ఘడ్‌వరకు కర్రెగుట్టలుగా పిలువబడే విశాలమైన, దుర్భేధ్యమైన అటవీ ప్రాంతంలో రెండు,మూడు వేలమంది మావోయిస్టులున్నారన్న సమాచారంతో వారిని మట్టుపెట్టటం ధ్యేయంగా మోదీ ప్రభుత్వం ఏప్రిల్‌లో వివిధ భద్రతా దళాల విభాగాలనుంచి 10వేలమందికి పైగా జవాన్‌లను మోహరించింది. వారెంత శ్రమించినా ఒక ట్రెండు చిన్నపాటి ఎన్‌కౌంటర్లు మినహా చెప్పుకోదగ్గ విజయాలు దక్కలేదు. పైగా వేసవి ఎండదెబ్బకు వారు అలిసిపోవటంతో ప్రభుత్వం ఆ ఆపరేషన్‌ను పహల్గాం అలజడి మధ్యలో ఉపసంహరించుకుంది. అంతకుముందే మావోయిస్టులు ప్రభుత్వంతో శాంతి చర్చలు ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి స్పందనలేకపోవటంతో తాము 6 మాసాలు ఆయుధాలు పక్కనపెడతామని, ఈ సమయంలో శాంతి చర్చలకు సిద్ధమని వారు మరో ప్రతిపాదన చేశారు. అయితే మావోయిస్టుల నిర్మూలనకు గడువు నిర్ణయించుకున్న మోదీ ప్రభుత్వం నుండి స్పందన లేదు. రష్యా–ఉక్రేన్, గాజా–ఇజ్రాయిల్ వంటి అంతర్జాతీయ సంఘర్షణల్లో ముఖాముఖీ చర్చలు ప్రతిపాదించే ప్రధాని మోదీ స్వదేశీ పౌరులైన మావోయిస్టులతో చర్చలకు సిద్ధపడలేదు. ప్రజాస్వామ్య దేశంలో పెట్టుబడిదారీవర్గ పాలనలో భిన్న తరగతుల ఆశలు–ఆకాంక్షల సాధనకు భిన్న భావజాలాలు గలవారు భిన్న రూపాల్లో ఉద్యమాలు చేస్తుంటారు. అయితే నక్సలైట్లుగా ప్రారంభమై మావోయిస్టు పార్టీగా చలామణీ అవుతున్న ఈ వామపక్ష అతివాద గ్రూపు 'సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారం' నినాదంతో రాజ్యాంగంద్వారా వ్యవస్థాపితమైన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తుపాకులు పట్టింది. ఎందరో భూస్వాములు, ఇతర పీడకులను హతమార్చింది, తమ పక్షంనుంచి ఎన్నో విలువైన ప్రాణాలను భద్రతాదళాల తూటాలకు త్యాగం చేసింది. అయినా సిద్ధాంతం నమ్మిన కార్యకర్తలేగాక, దళితులు, ముఖ్యంగా ఆదివాసీలనుంచి వారికి అండదండలు ఇప్పటికీ అందుతున్నాయంటే, భూస్వామి–గుత్తేదారు–ప్రభుత్వోద్యోగి–రాజకీయుల కుమ్మక్కుతో కూడిన పాలక వ్యవస్థ దోపిడీ ఎంత దారుణంగా, పచ్చిగా జరుగుతుందో ఆలోచించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? మావోయిస్టుల మార్గంతో మనం ఏకీభవించకపోవచ్చు, కాని వారు ఏ తరగతులకోసమైతే పోరాడుతున్నారో ఆ అణగారిన ప్రజల బతుకుల గూర్చి ఆలోచించాల్సిన పనిలేదా? ఉద్యమం కొంత బలహీనపడినా, మావోయిస్టులు మనుగడ సాగించగలుగుతున్నారంటే అదే వారి బలం.

పెచ్చుపెరిగిన రాజ్యహింస, తరిగిపోతున్న క్యాడర్స్, సానుభూతిపరుల కారణంగా మావోయిస్టుల ఉద్యమం బలహీనపడింది. వారు సాయుధ పోరాటమార్గం వీడి ప్రధాన జనజీవన స్రవంతిలోకి రావాలని వామపక్ష పార్టీలు ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న విజ్ఞప్తులు వారు చెవికెక్కించుకోలేదు. ఉపఖండంలో వామపక్ష ఉద్యమంలో (నేపాల్, శ్రీలంక) వచ్చిన మార్పులను వారు అధ్యయనం చేస్తున్నారో లేదో చెప్పలేము. అయితే శాంతి చర్చలకై ప్రభుత్వానికి ప్రతిపాదన వారంతటవారుగా చేయటం వారిలో ఏదో పునరాలోచనను విజ్ఞులు ఊహించవచ్చు. కాని ప్రభుత్వం మూర్ఖంగా తిరస్కరించింది. భద్రతాదళాల బలాధిక్యతతో ప్రభుత్వం మరికొన్ని వందల ప్రాణాలు తీయవచ్చు. కాని వారు ఏ జనాలకోసం ప్రాణార్పణ చేస్తున్నారో ఆ జనాల సామాజిక, ఆర్థిక, జీవన పరిస్థితులు మెరుగుపరిచే కార్యక్రమం ప్రభుత్వానికి లేనప్పుడు వారు మరో రూపంలో తిరుగుబాటు చేయరా! అందువల్ల మోదీ ప్రభుత్వం హింసామార్గాన్ని నిలుపుదలలో ఉంచి శాంతి చర్చలకు ఇప్పటికైనా ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## ప్రపంచీకరణ నేపథ్యంలో

# గ్రామీణ సామాజిక ఆర్థిక జీవనంలో మార్పు!



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

ప్రపంచీకరణ గ్రామీణ మౌలిక సదుపాయాలలో పెట్టుబడులను ప్రోత్సహించింది, ఉదాహరణకు రోడ్లు, రవాణా నెట్‌వర్క్‌లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు. మెరుగైన మౌలిక సదుపాయాలు గ్రామీ ణ ప్రాంతాలను పట్టణ కేంద్రాలు, ప్రపంచ మార్కెట్‌లకు అనుసంధానించడానికి, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి సహాయపడ్డాయి. అయితే గ్రామీణ సాంప్రదాయక జీవన వ్యవస్థపై ప్రపంచీకరణ ప్రభావం తీవ్రంగా ఉంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంతో ముడిపడి ఉన్న సాంప్రదాయక కుటుంబ జీవనవృత్తి విధానం పూర్తిగా దెబ్బతిన్నదనే చెప్పాలి. గ్రామీణ ప్రజలు యంత్రాల ఉత్పత్తిపై ఆసక్తి చూపడం యంత్రాలపై తయారైన వస్తువులను కొనుగోలు చేయడం వల్ల తరతరాలుగా సాంప్రదాయకంగా వస్తున్న గ్రామీణ జీవన వ్యవస్థను నాశనం చేసిందని చెప్పాలి. 'పల్లె కన్నీరు పెడుతుంది కనిపించని కుట్రలో' అనే పాటలాగా మనకు తెలువకుండానే ప్రపంచీకరణ నేపథ్యం గ్రామాలలోని మూల మూలన చేరింది. ముఖ్యంగా గ్రామాలలో దొరికే పాలు పెరుగు ఇతర ఆహార సాంప్రదాయక వస్తువులు గ్రామాలలో దొరకడం లేదు కానీ సప్త సముద్రాల అవతల ఉత్పత్తి అయిన కోకోకోలా, తంసప్, ఇతర శీతల పానీయాలు గ్రామాలకు చేరుతున్నాయి. అయితే ఒక్క విషయం ఇక్కడ గమనించాల్సిందేమిటంటే పట్టణాలతో గ్రామాలకు అనుసంధానంగా రోడ్లు, రవాణా సౌకర్యం సులభతరమైంది. దీనికి తోడుగా గ్రామీణ ప్రజలు కూడా ఆధునిక ఆహారపు అలవాట్లకు అలవాటు పడిన విషయాన్ని మనం గమనించాలి. ముఖ్యంగా గ్రామీణ యువత ప్రపంచీకరణలో భాగంగా ఆధునిక అభ్యాస విధానం, ఆహారం, ఉద్యోగం రీత్యా ఆలోచిస్తున్నారు. గ్రామాలలో నివసించే ప్రజలు తరతరాలుగా తమ జీవితంలో ముడిపడి ఉన్న సాంప్రదాయక వ్యవసాయ విధానం పూర్తిగా విడనాడిన్రు. పల్లెలను వదిలి పట్టణాలకు పయనమవుతున్నారు.

అభివృద్ధి చెందిన ప్రపంచంలో వ్యవసాయం ఆర్థికపరంగా క్షీణిస్తున్న ప్రాముఖ్యతను కలిగి ఉంది. సాధారణంగా ఆధునికీకరణ ప్రక్రియలు అని పిలువబడేవి సగటు వ్యవసాయ పరిమాణంలో విస్తరణకు, యాంత్రీకరణ పెరుగుదలకు, వ్యవసాయంలో పనిచేసే వారి సంఖ్యలో సారూప్య తగ్గుదలకు దోహదపడ్డాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయం ఎక్కువ ప్రాముఖ్యతను కలిగి ఉన్నప్పటికీ, ఇక్కడ కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వైవిధ్యపరచడం, పర్యాటకరంగంపై పెరిగిన ప్రాధాన్యత, స్థిరత్వంపై కొనసాగుతున్న ఆందోళనలు పెరుగుతున్నాయి.

గ్లోబల్ నార్త్‌లో వ్యవసాయ ఉపాధి తగ్గుదలకు సమాంతరంగా అనేక గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి వైవిధ్యం పెరుగుతోంది, ఇది గ్రామీణ ప్రాంతాలలోని ఇతర ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలను ప్రతిబింబిస్తుంది. గ్రామీణ ప్రాంతాలు ఇప్పుడు (వ్యవసాయేతర) పరిశ్రమల పెరుగుదలతో, ముఖ్యంగా సేవలతో మరింత వైవిధ్యమైన ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా సేవారంగం యొక్క పెరుగుతున్న పాత్ర ఒక ముఖ్యమైన అంశం. ముఖ్యంగా, పర్యాటకం ప్రధాన ప్రాముఖ్యత కలిగి ఉంది, ఎందుకంటే గ్రామీణ ప్రాంతాలు పర్యాటక మార్కెట్‌లోకి ప్రవేశించడానికి తమను తాము తిరిగి ప్యాక్ చేయడానికి ఎక్కువగా ప్రయత్నిస్తున్నాయి. గ్లోబల్ సౌత్‌లోని అనేక ప్రాంతాలు సహజ, సాంస్కృతిక వాతావరణాల అంశాలను ఉపయోగించి పర్యాటకులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తాయి.

పైన పేర్కొన్న నిర్మాణాత్మక మార్పుల యొక్క స్పష్టమైన పరిణామం ఏమిటంటే గ్రామీణ ప్రాంతాల మారుతున్న సామాజిక కూర్పు. గ్లోబల్ సౌత్‌లో ఎక్కువ భాగం ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల నుండి గణనీయమైన వలసలను చూస్తున్నప్పటికీ, అభివృద్ధి చెందిన ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో వలసలు ఒక లక్షణంగా మారాయి. పట్టణ కేంద్రాల నుండి అనేక గ్రామీణ ప్రాంతాలకు గణనీయమైన కదలికలు జరిగాయి, ఈ దృగ్విషయాన్ని సాధారణంగా ప్రతిపట్టణీకరణ అని పిలుస్తారు. ఉదాహరణకు, ఇంగ్లాండ్‌లో, 20వ శతాబ్దం చివరిభాగంలో గ్రామీణ ప్రాంతాల జనాభా గణనీయంగా పెరిగింది. ఈ మార్పులు ప్రాదేశికంగా, తాత్కాలికంగా అసమానం గా ఉన్నప్పటికీ, అనేక గ్రామీణ ప్రాంతాల యొక్క పెరుగుతున్న ఆర్థిక, సామాజిక వైవిధ్యం అంటే గ్రామీణ, వ్యవసాయం ఇకపై పర్యాయపదాలు కావు, ఇది అనేక ప్రభుత్వాలు విస్తృత శ్రేణి ఆర్థిక కార్యకలాపాలను, మరింత సామాజికంగా భిన్నమైన జనాభాను స్వీకరించే గ్రామీణ అభివృద్ధి విధానాలను రూపొందించాల్సిన అవసరాన్ని గుర్తించడానికి దారితీసింది. అభివృద్ధి, ప్రణాళికకు సాంప్రదాయ విధానం ప్రణాళికదారులు, అభివృద్ధి నిపుణులపై కేంద్రీకృత మై ఉంది ఒక ప్రొఫెషనల్ ఉన్నత వర్గం నగరాలు లేదా గ్రామీణ ప్రాంతాల కోసం నిర్దిష్ట అభివృద్ధి మార్గాలను సమర్థిస్తుంది. ఈ విధానం 'గ్లోబల్' ను 'లోకల్' లోకి తీసుకురావాలనే ఆలోచనపై ఆధారపడి ఉంది.

2. మారుతున్న ఆర్థిక, సామాజిక సంబంధాలు గ్రామీణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి మరింత ఊహాత్మకమైన, సమగ్రమైన విధానాల అవసరానికి అదనపు ఆవశ్యకతను ఇచ్చాయి. గతంలో, ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో గ్రామీణాభివృద్ధికి సంబంధించిన విధానాలు ఆధునికీకరణ నమూనా ద్వారా రూపొందించబడ్డాయి, ఇది 'వెనుకబడిన' ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందిన ప్రదేశాలతో చేరుకోవడానికి దారితీసే సాంకేతిక పరిష్కారాలను నొక్కి చెప్పింది. ఒక కోణంలో, ఈ విధానం



'ఒకే పరిమాణం అందరికీ సరిపోతుంది' అనే ఆలోచన ద్వారా వర్గీకరించబడింది, దీనిలో అభివృద్ధి క్రిందికి మరియు బాహ్యంగా విస్తరించినప్పుడు అన్ని ప్రదేశాలు 'పురోగతి' వైపు ఒకే మార్గాన్ని అనుసరించవచ్చని భావించబడింది. ఆధునికీకరణ విధానాల ఫలితంగా యాంత్రిక వ్యవసాయం, గ్రామీణ పారిశ్రామికీకరణ ప్రోత్సాహం మరియు గ్లోబల్ నార్త్, సౌత్ సందర్భాలలో గ్రామీణ ప్రాంతాలకు ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సూచించబడ్డాయి. ఈ విధానం యొక్క అంతర్లీన అంచనాలు తప్పుగా ఉన్నాయని ఇటువంటి అభివృద్ధి అనేక విమర్శలకు గురైంది; ఇది తగని పరిణామాలకు, పర్యావరణ నష్టానికి దారితీసింది, గ్రామీణ ప్రాంతాలను బాహ్య ఆర్థిక మార్పులకు గురిచేసింది. మరింత ముఖ్యంగా, ఇటువంటి విధానాలు పరిమిత విజయాన్ని సాధించినట్లు కనిపించింది. 1950లలో టాంగన్యికాలో తూర్పు ఆఫ్రికా వేరుశనగ పథకం ఒక ఉదాహరణ, ఇది ఎగుమతి కోసం విస్తారమైన మొత్తంలో కూరగాయల నూనెను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. అనుచిత వాతావరణంలో అనుచిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటానికి ఇది ఒక క్లాసిక్ ఉదాహరణగా పరిగణించబడుతుంది. గ్లోబల్ నార్త్ సందర్భంలో, స్కాటిష్ హైలాండ్స్ లేదా ఐర్లాండ్ యొక్క పశ్చిమ ప్రాంతాలు వంటి ప్రదేశాలలో పారిశ్రామికీకరణను ప్రోత్సహించాలనే ప్రతిష్టాత్మక ప్రణాళికలు పరిమిత విజయాన్ని సాధించాయి. ఈ ఉదాహరణలు గ్రామీణ ప్రాంతాలను ఎవరి కోసం అభివృద్ధి చేస్తున్నారనే విస్తృత సమస్యను కూడా లేవనెత్తుతున్నాయి. అవి విలువను సేకరించగల ప్రదేశాలా లేదా సమాజాలు స్థిరత్వం, తగినంతగా జీవించగల ప్రదేశాలా? గ్లోబల్ సౌత్ సందర్భంలో, స్థానిక అవసరాల కోసం జీవనాధార పంటలకు బదులుగా ఎగుమతి కోసం వాణిజ్య పంటలను పండించడంపై చర్చ ఈ ఉద్రిక్తతను హైలైట్ చేస్తుంది.

ప్రస్తుత అభివృద్ధి తత్వశాస్త్రం భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది, అంతర్జాత అభివృద్ధిపై కీలక దృష్టితో సమాజ ప్రమేయం, సాధికారత మరియు సామర్థ్య నిర్మాణం యొక్క కేంద్రీకరణ ద్వారా ఇది ఆధారమవుతుంది. ఈ వ్యూహాన్ని ప్రోత్సహించడానికి నాలుగు విస్తృత కారణాలను సూచించవచ్చు. మొదట, దిగువ నుండి పైకి వచ్చే విధానం అభివృద్ధి ప్రక్రియ యొక్క ప్రజాస్వామ్యీకరణను ప్రతిబింబిస్తుందని చెప్పవచ్చు. రెండవది, ఈ వ్యూహం సాధారణ బ్లూప్రింట్‌ల కంటే స్థానికంగా మరింత అనుకూలీకరించబడిన విధానాల అవసరం ఉన్న పెరుగుతున్న వైవిధ్యభరితమైన గ్రామీణ ప్రాంతాలకు ఆర్థిక ప్రయోజనాలను అందించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. మూడవదిగా, స్థానికులను బయటి పోటీకి తెరవడానికి కారణమైన ప్రపంచ ప్రక్రియలకు స్థానిక ప్రతిస్పందనల అవసరం ఉందని గ్రహించబడింది. చివరగా, స్థానిక వ్యక్తులు, ఏజెంట్ల ప్రమేయం తార్కికంగా కనిపిస్తుంది, ఎందుకంటే ఇది స్థానిక జ్ఞానం, నైపుణ్యాలను ఉపయోగిస్తుంది, అటువంటి ప్రతిస్పందనలు కొంతవరకు స్థానిక మద్దతును పొందుతాయి కాబట్టి ఇది మరింత విజయాన్ని నిర్ధారిస్తుంది. ఈ విధానం సామాజికంగా, రాజకీయంగా కావాల్సినదిగా మాత్రమే కాకుండా మరింత ప్రభావవంతంగా, ఆర్థికంగా ప్రయోజనకరంగా కూడా కనిపిస్తుంది. ఇవన్నీ బయటి నుండి విధించబడిన క్రాస్ స్పేషియల్ పరిష్కారాల నుండి దూరంగా ఉంటా యి; స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవడానికి గ్రామీణ అభివృద్ధికి తీసుకున్న విధానాలలో సరళంగా ఉండవలసిన అవసరాన్ని సూచిస్తాయి. ఈ మరింత సరళమైన విధానాన్ని ప్రజలు స్థానికత , సమాజంతో గుర్తించే స్వభావాన్ని ఉపయోగించుకునేలా చూడవచ్చు దీనిని విస్తృతంగా వారి స్థల భావనగా చూడవచ్చు.

అభివృద్ధి చెందిన ప్రపంచ సందర్భంలో, గ్రామీణాభివృద్ధి యొక్క ఈ వెర్షన్ సంబంధిత సంస్థల ప్రతినిధులు అలాగే స్థానికుల పాత్రతో సహా చట్టబద్ధమైన, స్వచ్ఛంద రంగాల నుండి ఆసక్తి గల సమూహాలు , వ్యక్తులను ఒకచోట చేర్చే భాగస్వామ్య ఏర్పాట్ల ద్వారా అందించబడుతుంది. భాగస్వామ్యాలు దిగువ నుండి పైకి వచ్చే విధానం యొక్క తార్కిక పొడిగింపుగా కనిపిస్తాయి. యూరోపియన్ యూనియన్ (ఇయు)లో, 1996లో కార్క్ డిక్లరేషన్ భాగస్వామ్య నీతికి మరింత సారాన్ని ఇచ్చింది, అప్పటి నుండి ఐరోపాలోని చాలా ప్రాంతాలలో సమకాలీన అభివృద్ధి చర్చలో ఏకీకరణ, భాగస్వా మ్యం, సాధికారత అనేవి సంచలనాత్మక పదాలుగా మారాయి. స్థానిక సమస్యలకు అభివృద్ధి పరిష్కారాలను స్థానిక అధికారులు, ప్రైవేట్ రంగం, స్వచ్ఛంద, సమాజ సమూహాల ప్రతినిధులను ఒకచోట చేర్చే యంత్రాంగాల ద్వారా పరిష్కరించవచ్చనే ఆలోచన ఇప్పుడు దేశాలలో ఆమోదించబడిన సంప్రదాయం.

ఏది ఏమైనా ప్రపంచీకరణలో వ్యాపారరంగం బాగా విస్తరించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో భారతదేశం కూడా ఒకటి కావడం ప్రపంచంలోనే పెద్ద మార్కెట్ వ్యవస్థగా కనబడుతున్నది. భారతీయ గ్రామీణ జీవన వ్యవస్థలో తీవ్రమైన మార్పులు తీసుకురావడానికి ప్రపంచీకరణ ఆధునిక జీవన అలవాట్లు ప్రధానమైనవి అని చెప్పవచ్చు. అయితే ఆర్థికంగా గ్రామీణ జీవన వ్యవస్థ మెరుగుపడిందని చెప్పుకుంటున్నాము. కానీ సాంప్రదాయక వృత్తి విధానాన్ని విడనాడటం వల్ల కొద్ది రోజుల్లోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా పతనమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగం కుంటుపడింది. దీనితో గ్రామాలలో వ్యవసాయ విధానం అనేది మర్చిపోతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ భూమిలో రియల్ ఎస్టేట్ జెండా ఎగరడం వల్ల సాంప్రదాయక వ్యవస్థ పై ప్రభావం పడిందనే చెప్పాలి.


# ఎఫ్.పి.ఒ. లను బలోపేతం చేయాలి

భారతదేశ వ్యవసాయరంగంలో రెండు హెక్టార్లు కంటే తక్కువ భూమిని కలిగి ఉన్న చిన్న, సన్న కారు రైతులు ఎక్కువగా ఉన్నారు. భారతదేశంలోని 138 మిలియన్ల రైతులు అంటే 85శాతం చిన్న, సన్న కారు వర్గాలవారు తక్కువ వ్యవసాయ కమతాలు కలిగి ఉన్నారు. వాళ్ళు ఎదుర్కొంటున్న సవాళ్లు అపారమైనవి, ముఖ్యంగా క్రెడిట్, మార్కెట్, సాంకేతికత, ఆర్థిక వ్యవస్థలకు పరిమితప్రాప్యత. ప్రతిస్పందనగా, ఈ వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థలు అనే భావన కీలకమైన వ్యూహంగా ఉద్భవించింది. ముఖ్యంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా నమోదు చేయబడినవి, చిన్న రైతులకు సమిష్టి బలాన్ని అందించడానికి రూపొందించబడ్డాయి. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మాదిరిగానే ఉంటాయి కానీ రైతులచే ఏర్పాటు చేయబడి నిర్వహించబడుతున్న ఎఫ్‌పిఓలు, విచ్ఛిన్నమైన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక వ్యవసాయ పద్ధతు లు, మార్కెట్‌లింక్డ్ వ్యవసాయ వ్యాపార నమూనాలు మధ్య అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు రైతులకు సాంకేతిక మద్దతు పొందేందుకు, మార్కెట్ లింకేజీ పెంపొందించుకునేందుకు, డిమాండ్ సరఫరాను సమీకరించడం ద్వారా వారి ఉత్పత్తులకు మెరుగైన ధరల పొందేందుకు వీలు కల్పిస్తాయి. భారత ప్రభుత్వం ఈ సామర్థ్యాన్ని గుర్తించింది. 2021లో, వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ '10,000 ఎఫ్‌పిఒ ఏర్పాటు కు పథకాన్ని ప్రారంభించింది, దీనిని ₹6,865 కోట్ల బడ్జెట్‌తో 2027–28 నాటికి అమలు చేయనున్నారు. ఈ చొర వ ప్రత్యేకత, సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో క్లస్టర్ ఆధారిత, 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' విధానాన్ని అనుసరిస్తుంది. ఈ ప్రయత్నాలు ఉన్నప్పటికీ, ఎఫ్‌పిఓ ల అమలు స్థిర త్వం అస్థిరంగా ఉన్నాయి. ఏర్పడిన ఎఫ్‌పిఓ లో దాదాపు 25% మాత్రమే స్థిరమైన రీతిలో విజయవంతంగా పనిచేస్తున్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. పనితీరులో అసమానత లోతైన నిర్మాణాత్మక, నిర్వహణ సవాళ్లను ప్రతిబింబిస్తుంది, వీటిని పరిష్కరించాలి. వృత్తిపరమైన నిర్వహణ లేకపోవడం అలాగే తగినంత సంస్థాగత మద్దతు లేకపోవడం వల్ల వాస్తవ ప్రపంచ అమలు తరచుగా తడబడుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు. ఎన్జీఓలు అభివృద్ధి భాగస్వాము లు సహా అనేక ఎఫ్ పిఓ ప్రమోటింగ్ ఏజెన్సీలకు వ్యాపార ప్రణాళిక, ఆర్థిక నిర్వహణ, మార్కెట్ వ్యూహంలో నైపుణ్యం లేదు. అంతేకాకుండా, ఈ అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ వ్యాపార సంస్థల సంక్లిష్ట అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ మద్దతు, ఆర్థిక, కార్యాచరణ రెండు సరిపోదు. ఎఫ్ పిఓ లు వాటి వృద్ధికి ఆటంకం కలిగించే అడ్డంకులను ఎదుర్కొంటున్నాయి, మూలధనం, క్రెడిట్ సౌకర్యాలకు తగినంత ప్రాప్యత లేకపోవడం. వృత్తిపరమైన నాయకత్వం నిర్వహ ణ నైపుణ్యాలు లేకపోవడం మార్కెట్ సమాచారం, ధర ఆవిష్కరణ విధానాలు లేకపోవడం. పేలవమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, ఐసిటి సాధనాలు ఇకామర్స్ అవకాశాలపై పరిమిత అవగాహన, ఈ సవాళ్లకు తోడు భారతీయ వ్యవసాయం అత్యంత విచ్ఛిన్నమైన స్వభావం. ముందుకు సాగే మార్గం, వ్యూహం మరియు స్థిరత్వం ఆశాజనకంగా లేదు. ఎస్ పి ఓ మనుగడ సాధించాలంటే వ్యూహాత్మక సమగ్ర పరిశీలన అవసరం. సామర్థ్య నిర్మాణం చాలా కీలకం. ఎఫ్పిఓ ఉన్న ఆఫీస్ బేరర్‌లకు ఆర్థికం, మార్కెట్ లింకేజీలు, ఐసిటి అప్లికేషన్, విలువ జోడింపు పద్ధతుల్లో శిక్షణ ఇవ్వాలి. ఎఫ్ పిఓ లో నాయకత్వం కోసం ప్రమాణాలు వ్యాపార చతురత అలాగే సకాలంలో, సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని నొక్కి చెప్పాలి. ఎఫ్ పిఓ అభివృద్ధి రంగంలో పెద్దగా కనిపించని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యాలు చాలా అవసరమైన నైపుణ్యం, పెట్టుబడి, ఆవిష్కరణలను తీసుకురాగల వు. వ్యవసాయ విస్తరణ సేవలు ఎఫ్ పిఓ లను అట్టడుగు కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది కానీ క్షేత్ర స్థాయిలో రైతులకు ఆధునిక పద్ధతులు చేరుకోవడం, స్వీకరించడం పెద్ద సమస్యగా ఉంది. డిమాండ్‌ప్రతిస్పందించే సప్లై చైన్ వ్యవస్థ, రియల్ టైం మానిటరింగ్ నమూనాలు గ్రామీణ ఉత్పత్తిని పట్టణ మార్కెట్లతో సమర్థవంతంగా అనుసంధానించడానికి ఎఫ్ పిఓ సామర్థ్యాన్ని నొక్కి చెబుతున్నాయి.

దేశంలో వ్యవసాయ స్థిరత్వం, భవిష్య త్తు దేశం దాని చిన్న సన్న కారు రైతులకు ఎంత బాగా నిర్వహించగలదు అలాగే శక్తివంతం చేయగలదో దానిపై ఆధారపడి ఉంటుంది. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఆశాజనకమైన మార్గాన్ని అందిస్తాయి, కానీ వాటికి సరైన విధానం, ఆర్థికం, నైపుణ్యం ప్రభుత్వ మద్దతు ఇవ్వాలి. అప్పుడే ఈ సమిష్టి సమ్మిళిత వృద్ధి సాధించగలరు, రైతుల ఆదాయాన్ని పెంచగలవు. భారతదేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకత నిర్ధారించగలవు.

డా.ఎం. సురేష్ బాబు

# ఆపరేషన్ కగార్ ఎవరికోసం?
# ఆదివాసీ హక్కులకు ఎవరు బాధ్యులు!



వి.యస్.బోస్
సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు
9391356527

కేంద్రంలోని మోదీ నాయకత్వం లోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ద్వారా ఒకదాని తర్వాత మరొటి ప్రజా వ్యతిరేకమైన, కార్పొరేట్ అనుకూలమైన చర్యలు ప్రకటించి చట్టాలుగా మారుస్తున్నది. 2014లో తొలిసారి అధికారాని కి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రజ ల మనసులను ఆకర్షించటానికి ప్రత్యేకంగా యువతను లక్ష్యం గా చేసుకొని దేశంలో అవినీతిని అంతం చేస్తానని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తిరిగి తెస్తానని, ప్రతి భారతీయుని బ్యాంక్ ఖాతాల్లో 15 లక్షలు జమచేస్తానని ప్రచారం చేశాడు. ఈ వాగ్దానాలు ఏవీ నేటి వరకు అమలు కాలేదు. ప్రజలు ఈ వాగ్దానాలపై ప్రశ్నించే సమయంలో ఒకే దేశం ఒకే పన్ను అనే నినాదంతో ప్రజలను ప్రక్కదారి పట్టించాడు. కానీ ఆ పేరుతో తీసుకొచ్చిన జీఎస్టీని ఇప్పటి వరకు అనేకసార్లు మార్పులు, చేర్పులు చేయటం జరిగింది. అంటే ఒకే దేశం ఒకే పన్ను అనే విషయంలో మోదీ ప్రభుత్వానికి స్పష్టత లేదనేది అర్థమవుతుంది. నల్లధనం రద్దు, అవినీతి అంతంతో దేశంలో ఉగ్రవాదం నశిస్తుందని ప్రచారం చేశాడు. ఉగ్రవాదం దేశంలో నశించికపోగా పెరిగిన నేపథ్యం లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసి దాని వ్యతిరేకించిన కాశ్మీరీ భారతీయులను జైల్లో పెట్టారు. మెజార్టీయిజం పేరుతో సమాజంలో ఉద్రిక్తతలు సృష్టించి రామమందిరం కట్టి హిందువుల చిరకాలవాంఛ నెరవేరిందని చెప్పుకొచ్చాడు. మోదీ పాలనలో హిందువులలో పేదరికం, నిరుద్యోగం పెరుగుతుంటే మరోప్రక్క ఆదానీ, అంబానీ లాంటి హిందువులే శతకోటీశ్వర్లుగా అవతరించారు.

బ్రిటీష్ వారు తెచ్చిన పాత చట్టాలను దుమ్ముదులిపి కార్మికులకు న్యాయం చేస్తామని ప్రచారం చేస్తూ 44 కార్మిక చట్టాలలో ఉన్న హక్కులను హరించి కార్పొరేట్లకు అనుకూలమైన 4 లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మికులకు తీవ్రమైన ద్రోహం చేసింది. "పుట్టిన ప్రతీది గిట్టకమానదని" జీవ శాస్త్రా న్ని ప్రచారం చేస్తూ సామాజికంగా లాభం, న్యాయం చేస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను మూసివేసి వాటి స్థానంలో దేశ, విదే శీ కార్పొరేట్ సంస్థలను బరితెగించి ప్రోత్సహిస్తున్నది. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బిఎస్ఎన్ఎల్‌లోని 90వేల కార్మికులను అక్రమంగా తొలగించి దానిని నిర్వీర్యం చేశారు. ఆ రంగంలో ఆదానీని ప్రోత్సహించి అన్ని సౌకర్యాలు కలుగచేసింది. దేశ భక్తులమని చెప్పుకొంటున్న బిజెపి ప్రభుత్వం డిఫెన్స్ ల్యాబ్స్ ను, డిఫెన్స్ పరిశ్రమలను తాకట్టు పెట్టి కార్పొరేట్ సంస్థలకు మార్గం ఏర్పాటు చేసింది. ప్రజా సౌకర్యాల కోసం ఉన్న రైల్వేను, పోస్టల్‌ను ఇతర ప్రభుత్వరంగ సంస్థలను నీరుగార్చుతున్నారు. విద్యాచట్టం ద్వారా దేశంలోని విద్యను, విద్యుత్ చట్టం ద్వారా విద్యుత్ రంగాన్ని, వ్యవసాయ చట్టాల ద్వారా వ్యవసాయాన్ని, పోస్టల్ చట్టం ద్వారా పోస్టల్ వ్యవస్థను అలా అనేక ప్రభుత్వ రంగాలను దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పచెపుతున్నారు. అబ్దుల్ కలాం మిస్సైల్ శాస్త్రవేత్త బ్రహ్మోస్ తయారీలో డిఆర్‌డిఎల్‌లో విశిష్ట కృషిసల్పి తయారు చేసిన విషయం భారతీయులందరికి తెల్సుకోవాల్సి న అవసరం ఉన్నది. బ్రహ్మోస్‌లో పాలుపంచుకున్న బి.డి. ఎల్., మిధానీ, బి.ఇ.ఎల్., ఇ.సి.ఐ.ఎల్ మరియు బ్రహ్మోస్‌ను రవాణా కొరకు యుద్ధ విమానాన్ని తయారు చేసిన హెచ్. ఎ.ఎల్‌ల కృషిని ప్రభుత్వం ప్రశంసించకపోవటం ప్రభుత్వ రంగం యడల వారికున్న అభిప్రాయాన్ని తెలియజేస్తుంది. ఈ రకంగా ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ దేశం కోసం అంతా చేస్తున్నామని మోసపూరిత ప్రచారం చేయటాన్ని ఖండించాలి. కొత్తగా కేంద్ర ప్రభుత్వం సముద్ర గర్భంలోని ఖనిజాలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పటానికి టెండర్లు వేసి దేశ, విదేశీ సంస్థలను ఆహ్వానిస్తున్నది. పోర్టులు ఆదానీకి అప్పచెప్పటం మూలంగా సగం ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు సముద్రగర్భంలోని ఖనిజాలు కూడా కార్పొరేట్ సంస్థలకు అప్పచెపితే ఆదివాసీలను అడవుల నుంచి తరిమినట్లుగానే మత్స్యకారులను సముద్ర తీరాల నుంచి ఇతర ప్రాంతాలకు తరిమికొడతారనేది జగమెరిగిన



సత్యం. అందుకే మత్స్యకారులంతా బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడుతున్నారు.

సమాజాన్ని విచ్చిన్నం చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్న ఉగ్రవాదులను, సమాజాన్ని దోపిడీ నుంచి కాపాడాలని పనిచేస్తున్న మావోయిస్టులను ఒకే గాటకట్టటం కేంద్రం చేస్తున్న అతి పెద్ద తప్పు. ఉగ్రవాదులకు కులం, మతం, ప్రాంతం లాంటి వాటిల్లో ఏలాంటి వ్యత్యాసం ఉండదు. కానీ మావోయిస్టులకు పేదలు, కష్టజీవులు అన్యాయానికి గురవుతున్న ప్రజలు అంటే ప్రత్యేకమైన ప్రేమ, అభిమానాలు ఉన్నాయి కాబట్టే వారు వారి తరపున పోరాడుతున్నారు. కేంద్ర ప్రభు త్వం ప్రస్తుతం ప్రకటించిన ఆపరేషన్ కగార్ ధ్యేయం అడవుల్లో ఉన్న ఆదివాసీలను భయభ్రాంతులను చేసి వారు అడవులు వదిలిపెట్టి ఇతర ప్రాంతాలకు పోయేటట్లు చేయట మే. ఆదివాసీలను వారికి అండగా నిలబడిన మావోయిస్టులను వేరు చేయటానికి ఎన్‌కౌంటర్ల పేరుతో టార్గెట్ చేసి చంపటం, మావోయిస్టులకు సహకరిస్తే ఆదివాసీలకు కూడా అదే గతి పడుతుందని బెదిరిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం సీమాంతర ఉగ్రవాదంపై పాకిస్తాన్‌తో సంప్రదింపులు జరపటానికి సిద్ధపడుతుంది కానీ, భారతదేశంలో పుట్టి పెరిగిన భారతీయులైన మావోయిస్టులతో సంప్రదించేది లేదని చెప్పటం అపహాస్యం గా ఉంది. భారతదేశం తరపున మోదీ రష్యాకు ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధాన్ని, ఇజ్రాయిల్‌కు పాలీస్తానకు మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి వారి మధ్య సంప్రదింపులు జరగాలని ప్రతిపాదిస్తూ మన దేశంలో నక్సలైట్లతో ఏలాంటి సంప్రదింపులు లేవని చెప్పటంలో ఔచిత్యం లేదు.

కేంద్ర ప్రభుత్వం అటవీ సంపదను, ఆ ప్రాంతంలో ఉన్న ఖనిజాలను కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పే ఉద్దేశాన్ని మార్చుకొని ఆ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలకు ఆ సంపద, ఖనిజాలపై వారికున్న రాజ్యాంగ హక్కును గుర్తించి వారి హక్కులను కాపాడవల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నది. ఆపరేషన్ కగార్ అమలు చేసి దేశ సంపదను కాపాడటం, దేశ ప్రజలకు ప్రయోజనం చేకూర్చటం ప్రభుత్వ ఉద్దేశం కాదనేది వారి చర్యల ద్వారా అర్థమవుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి ఆదివాసి మరియు మావోయిస్టు నాయకులతో సంప్రదింపులు జరపాలి.

మావోయిస్టులు తాము ఆయుధాలు 6 నెలల పాటు ఉపయోగించమని, శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం ముందుకు రాకుండా ఎన్‌కౌంటర్లు చేయటం ప్రజాస్వామిక విధానం కాదు. కావున వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాలి. మావోయిస్టులతో వెంట నే చర్చలు జరిగితే అటవీ ప్రాంతంలో శాంతినెలకొంటుందని భావిస్తున్నాను. దేశంలో నిరుద్యోగం, అసమానతలు, దోపిడీ లు ఉన్నంతకాలం ఏదో ఒక రకంగా, ఏదో ఒక పేరుతో తిరుగుబాట్లు తప్పవని ప్రపంచగమనం తెలియజేస్తున్నది.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సెలవుల్లో పనిచేసేందుకు న్యాయవాదులు ఇష్టపడడం లేదు

### సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** కోర్టుల్లో కేసులు పేరుకుపోతున్న అంశంపై భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. లాయర్లు సెలవు దినాల్లో పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. వేసవి సెలవుల అనంతరం తన కేసును విచారించాలని ఓ న్యాయవాది కోరారు. సిజెఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనానికి ఆ అభ్యర్థన ఆగ్రహం తెప్పించింది. న్యాయమూర్తులు సెలవుల్లో పనిచేస్తున్నారు. అయినా సరే పెండింగ్ కేసుల విషయంలో మమ్మల్ని నిందిస్తున్నారు. కానీ, సెలవుల్లో పనిచేయడానికి ఇష్టపడనిది న్యాయవాదులే అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో పనిచేసే ధర్మాసనాలకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. భారత 52వ ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ గతవారం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

# ‘నరేగా’ అమలులో భారీ లోపాలు


### లిబిటెక్ లోపాలను ఉటంకిస్తూ కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ధ్వజం



**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో భారీ లోపాలు ఉన్నట్లు తాజా నివేదికను ఉటంకిస్తూ కాంగ్రెస్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడి చేసింది. లిబ్‌టెక్ నివేదిక వెల్లడించిన కఠోర వాస్తవాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ స్పందించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) కింద వాగ్దనం చేసిన మేరకు 100 రోజుల పని కేవలం ఏడు శాతం కుటుంబాలకు మాత్రమే లభిస్తుందన్నారు. ఈ పథకానికి విస్తృత ప్రచారం వస్తున్నప్పటికీ బహుశా కొనసాగుతున్న ఆర్థిక మాంద్యం కారణంగా ఎక్కువ కుటుంబాలు నరేగా ఉపాధిని కోరుకోవడం వల్ల 2023–2024, 2024–2025 ఆర్థిక సంవత్సరం మధ్య ప్రతి కుటుంబానికి సగటు ఉపాధి రోజులు తగ్గాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక మాంద్యం తీవ్రతరం కావడంతో నరేగా కింద దార్శనికతను సాకారం చేసుకోవడానికి బడ్జెట్‌లో తగిన ఆర్థిక కేటాయింపులు చేయాలని రమేష్ అన్నారు. నరేగా వేతనాలను ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించవద్దని, వేతన రేటులో మార్పుల అవసరాన్ని అంచనా వేయడానికి ఒక స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని రమేశ్ డిమాండ్ చేశారు. ఈ పథకం కింద నమోదైన కుటుంబాల సంఖ్య 8.6 శాతం పెరిగినప్పటికీ, 2024–25లో ఉపాధి 7.1 శాతం తగ్గిందని లిబ్‌టెక్ నివేదిక ఎత్తి చూపింది. సగటు పనిదినాలు 4.3 శాతం తగ్గాయని, 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాలు 11.9 శాతం తగ్గాయని కూడా వెల్లడించింది. నరేగా పథకం అమలులో అనేక లోపాలు ఉన్నటుల లిబ్‌టెక్ నివేదిక బయట పెట్టిందన్నారు. కొవిడ్ మహమ్మారి సమయంలో ప్రభుత్వం అమలు చేయగల కొన్ని సామాజిక భద్రతా జోక్యాలలో ఒకటిగా నరేగే ప్రయోజనాలు తెలిసివచ్చాయన్నారు. 2019–20లో మహమ్మారి రాకముందు ఈ పథకం కింద పనిని అభ్యర్థిస్తున్న కుటుంబాలు 6.16 కోట్ల ఉండగా, 2020–2021 నాటికి ఈ సంఖ్య దాదాపు 33 శాతం పెరిగి 8.55 కోట్లకు చేరుకుందని, ఈ కోట్లాది కుటుంబాలకు ప్రభుత్వం ప్రణాళిక లేని లాక్‌డౌన్‌ల గందరగోళం మధ్య నరేగా పథకమే ఏకైక జీవనాధారగా మారిందని రమేశ్ పేర్కొన్నారు. లిబ్‌టెక్ నివేదిక నరేగా స్థితి గురించి కొన్ని సంబంధిత డేటా పాయింట్లను వెల్లడిస్తుందని ఆయన అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నరేగాకు కేటాయించిన రూ. 86,000 కోట్ల బడ్జెట్ ఏ మాత్రం సరిపోదని అందరూ అభిప్రాయపడ్డారని, పీపుల్స్ యాక్షన్ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ (పిఎఇజి) 2022–23 ఆర్థిక సంవత్సరానికి నరేగా కోసం రూ. 2.64 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయింపును సిఫార్సు చేసిందన్నారు. ప్రపంచ బ్యాంకు జిడిపిలో కనీసం 1.7 శాతం ఈ కార్యక్రమానికి కేటాయించాలని సిఫార్సు చేసిందని, ప్రస్తుత కేటాయింపులు 2024–25 నాటికి జిడిపిలో 0.26 శాతం అని ఆయన అన్నారు. నరేగా కార్మికులను అనేక సంవత్సరాలుగా ఏకపక్షంగా తొలగించిన తర్వాత, పౌర సమాజం, ప్రతిపక్ష పార్టీల నుండి నిరంతర ఒత్తిడి రాగా, చివరకు మోడీ ప్రభుత్వం తొలగించిన జాబ్ కార్డులను తిరిగి ఇవ్వాల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా లబ్ధిదారులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా, ఫిబ్రవరి 14, 2024న జార్ఖండ్‌లోని రాంకాలో జరిగిన జన్ సున్వైలో దేశ వ్యాప్తంగా ఉన్న నరేగా కార్మికులు ఈ సమస్యలను లేవనెత్తారని రమేష్ అన్నారు. ఎనిమిది నెలల తర్వాత కూడా ఈ సమస్యలు కొనసాగుతున్నాయి. ఇది ప్రభుత్వం సృష్టించిన మానవ, ఆర్థిక, సంస్థాగత విషాదం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నరేగా పథకం అమలులో అనేక కీలక మార్పులను చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుందన్నారు.

# అదేదో అటు చూపండి !

### బిజెపికి జైరామ్ రమేష్ హితవు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ దాడి అనంతరం బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ బుధవారం విమర్శనాస్త్రాలు సంధించింది. 26/11 దాడి తర్వాత భారతదేశం దేశాల మద్దతు పొందిందని, ఆ దాడికి పాల్పడిన నిందితులు మరణించారని, ఒకరిని అరెస్ట్ చేశారని, అయితే పహల్గామ్ దాడి అనంతరం భారత ప్రభుత్వం విదేశాలకు దౌత్య ప్రతినిధులను పంపి, పహల్గామ్ దాడి ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలోనే ఉన్నప్పటికీ భారత ప్రభుత్వం ఒక పత్రాన్ని సిద్ధం చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది.కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేష్ కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీపై బిజెపి విమర్శలు చేయడంపై స్పందిస్తూ రాహుల్ గాంధీపై విమర్శలదాడికి శక్తిని ఉపయోగించడానికి బదులు పాకిస్థాన్, చైనాపై ఆ శక్తిని వినియోగిస్తే బాగుంటుందని తిప్పి కొట్టారు. మహ్మద్ అలీ జిన్నాకు క్లీన్ చిట్ ఇచ్చింది ఎవరు? ఆయనను ప్రస్తుతించింది ఎవరు? జస్వంత్ సింగ్, ఎల్‌కె.అద్వానీ అతడిని ప్రశంసించారని, ఆయనొక గొప్ప నాయకుడని పొగిడారని గుర్తుచేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయ్ లాహోర్‌కు బస్సు యాత్ర చేశారని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ లాహోర్‌కు వెళ్లి ఆ దేశ ప్రధానమంత్రి నవాజ్‌షరీఫ్‌తో రొట్టెలు విరిచింది ఆయన కాదా అని జైరామ్ రమేష్ ఇక్కడ ‘పిటిఐ’తో మాట్లాడారు. పాకిస్థాన్ దేశానికి చెందిన అత్యున్నత పౌర పురస్కారం ‘నిషాన్‌ఇపాకిస్థాన్’ను భారత మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ పొందారు కదా అని ఆయన గుర్తుచేశారు. మొరార్జీ దేశాయ్ కేబినెట్‌లో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నది అటల్ బిహారీ వాజ్‌పేయే అన్నది బిజెపి ఒకసారి గుర్తుతెచ్చుకుంటే మంచిదని ఆయన చురకలంటించారు. కేంద్ర ప్రభుత్వాన్ని జైరామ్ రమేష్ తూర్పారపడుతూ ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి వెనక ఉన్న ఉగ్రవాదులను సంఘటన జరిగి నెలరోజులు గడుస్తున్నా ఎందుకు అరెస్ట్ చేయలేదని జైరామ్ రమేష్ ప్రశ్నించారు. 2008 ముంబాయి ఉగ్రదాడికి పాల్పడ్డ నిందితులు అందరూ మరణించారని, ఒకరిని అరెస్ట్ చేశారని, ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల మద్దతు భారత్‌కు లభించిన కారణంగానే అలా జరిగిందన్నారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలో ఉండగానే విదేశాలకు మన దౌత్య ప్రతినిధులను పంపిస్తున్నారని, దీనిపై ఒక పత్రాన్ని రూపొందిస్తున్నారని, వారందరినీ అరెస్ట్ చేసి తప్పకుండా విచారణ జరపడం అనేది మన ముందున్న ఒక వాస్తవిక సమస్య అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు భారత్‌పాక్ సంఘర్షణపై పెద్ద మాటల యుద్ధం చేస్తున్న తరుణంలో జైరామ్ రమేష్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీని ఇటీవల బిజెపి ఆధునిక యుగం మీర్‌జాఫర్ అని వ్యాఖ్యానించగా ప్రతిపక్షపార్టీ ఆ విమర్శను తిప్పి కొట్టింది. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌ను నూతన యుగం జైచంద్ అని అభివర్ణించింది. ఆపరేషన్ సిందూర్‌పై బిజెపికాంగ్రెస్ విమర్శలతో దుమ్మెత్తి పోసుకోవడం సోషల్ మీడియాలో పోస్ట్ చేసి మీమ్స్ కూడా చేశారు. మంత్రి జైశంకర్ మీద కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విమర్శల దాడి కొనసాగిస్తూ మంత్రి హెచ్చరికల ఫలితంగా భారతదేశం ఎన్ని విమానాలను కోల్పోయింది? మంత్రి హెచ్చరికల కారణంగా ఎంతమంది పాకిస్థాన్‌లోని శిబిరాల నుంచి ఉగ్రవాదులు పారిపోయారో చెప్పాలని ప్ర శ్నించారు. పహల్గామ్ ఉగ్రదాడిలో 26మంది ప్రా ణాలను కోల్పోవడంతో భారతదేశంపాకిస్థాన్ మ ధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

## పూజా ఖేడ్కర్ ఉగ్రవాదా?

### ఆమె చేసిన తీవ్రమైన నేరం ఏమిటి? : సుప్రీంకోర్టు

### ఐఎఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణికి బెయిల్ మంజూరు



**న్యూఢిల్లీ :** అధికార దుర్వినియోగం, తప్పుడు ధ్రువపత్రాల సమర్పణ వ్యవహారంలో ఐఎఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. బుధవారం అత్యున్నత న్యాయస్థానం ఆమెకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆమె చేసిన తీవ్రమైన నేరం ఏమిటని పోలీసులను ప్రశ్నించింది. ‘ఆమె డ్రగ్ లార్డ్. ఉగ్రవాది కాదు. ఎటువంటి హత్యా చేయలేదు. కేసు తీవ్రతను పరిశీలిస్తే కేసు వాస్తవాలను, పరిస్థితులను దృష్టిలోపెట్టుకొని..పిటిషనర్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరుచేసి ఉండాల్సింది. ఎందుకంటే ఇప్పుడు ఆమె అన్నీ కోల్పోయింది. ఎక్కడా ఆమెకు ఉద్యోగం దొరికే అవకాశం లేదు. ఈ కేసుపై దర్యాప్తును త్వరగా పూర్తిచేయండి. విచారణకు సహకరించేలా ఆమెను ఆదేశిస్తాం’ అని పేర్కొంది. కాగా అత్యున్నత న్యాయస్థానం ఖేడ్కర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయడాన్ని ఢిల్లీ పోలీసుల తరపు న్యాయవాది తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమెపై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవి.. దర్యాప్తునకు కూడా ఖేడ్కర్ సహకరించట్లేదని కోర్టుకు విన్నవించారు. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేడ్కర్‌పై అధికార దుర్వినియోగంతో పాటు యుపిఎస్‌సిలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యుపిఎస్‌సి ఆమెను ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది. నకిలీ పత్రాలతో పరీక్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యుపిఎస్‌సి దానిపై వివరణ ఇవ్వాలని ఆమెకు షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయడంతో పాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు. యుపిఎస్‌సికి తనపై అనర్హత వేటు వేసే అధికారం లేదని వాదించినప్పటికీ.. ఆమెకు నిరాశే ఎదురైంది. గతేడాది ఆగస్టులో ఆమె ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం ఆమెకు మధ్యంతర రక్షణ కల్పిస్తూ వచ్చింది. తాజాగా ఈ కేసుపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

## రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ ఘన నివాళి



**న్యూఢిల్లీ :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఘనంగా నివాళులు అర్పించింది. పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ 21వ శతాబ్దపు సవాళ్లు, అవకాశాలకు భారతదేశాన్ని సిద్ధం చేయడంలో ఆయన దార్శనికత, సాహసోపేతమైన జోక్యాలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. ఖర్గే, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఢిల్లీ వీర్ భూమిలోని రాజీవ్ గాంధీ స్మారక చిహ్నం వద్ద ఆయనకు పుష్ప గుచ్ఛాలు అర్పించారు. అనంతరం రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ ‘నాన్నా, మీ జ్ఞాపకాలు నన్ను ప్రతి అడుగులోనూ నడిపిస్తాయి. మీ నెరవేరని కలలను నిజం చేయడమే నా సంకల్పం, నేను అలాగే చేస్తాను‘ అని అన్నారు. రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తూ భారత దేశ గొప్ప పుత్రుడని, లక్షలాది మంది భారతీయులలో ఆశను ప్రేరేపించారని ఖర్గే అన్నారు. 21వ శతాబ్దపు సవాళ్లు, అవకాశాలకు భారతదేశాన్ని సిద్ధం చేయడంలో ఆయన దార్శనికత, సాహసోపేతమైన జోక్యం కీలక పాత్ర పోషించిందని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. ఓటింగ్ వయస్సును 18 సంవత్సరాలకు తగ్గించడం, పంచాయతీ రాజ్‌ను బలోపేతం చేయడం, టెలికాం, ఐటి విప్లవానికి నాయకత్వం వహించడం, కంప్యూటరైజేషన్ కార్యక్రమాన్ని అమలు చేయడం, స్థిరమైన శాంతి ఒప్పందాలను సాధించడం, సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమాన్ని ప్రారంభించడం, సమ్మిళిత అభ్యాసంపై దృష్టి సారించిన కొత్త విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం వంటివి ఉన్నాయన్నారు. 1950 దశకం నుండి వివిధ రాజకీయ పార్టీల ఎంపిలను ప్రతి అక్టోబర్–నవంబర్‌లో న్యూయార్క్‌లోని యుఎన్‌కు ప్రతినిధి బృందాలుగా పంపుతామని కాంగ్రెస్ ప్రధాన కా ర్యదర్శి జైరాం రమేష్ అన్నారు అయితే నరేంద్ర మోదీ 2014 నుండి ఈ సంప్రదాయాన్ని నిలిపివేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ కూడా రాజీవ్ గాంధీకి నివాళులర్పించారు. ‘మన ప్రియమైన మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా తీవ్ర దుఃఖం తో ఆయనను స్మరించుకుంటున్నాము. ఉగ్రవాదులు ఆయన శరీరాన్ని తుడిచిపెట్టారు, చాలా త్వరగా ఆయనను మన నుండి దూరం చేశారు. నేటికీ, ఆయన మన మధ్య లేరని మనం భావించని రోజు లేదు’ అని అన్నారు.

# పాక్ బండారంపై ప్రచారం

### జపాన్,యుఎఇలకు

### రెండు బహుళపక్ష ఎంపిల బృందాలు



**న్యూఢిల్లీ :** ‘ఆపరేషన్ సిందూర్’ తదనంతర పరిణామాల పూర్వరంగంలో పాకిస్థాన్‌కున్న ఉగ్రవాద అనుబంధాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు రెండు బృందాలు బుధవారంనాడు చెరోవైపూ విదేశీ పర్యటనలకు వెళ్ళాయి. జెడి(యు) ఎంపి సంజయ్ ఝా నాయకత్వానగల బహుళపక్ష ప్రతినిధిబృందం మొదట బయలుదేరింది. జపాన్‌తోపాటు దక్షిణ కొరియా, మలేసియా, సింగపూర్, ఇండోనేసియా దేశాలలో పర్యటిస్తుంది. శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే నాయకత్వాన తర్వాత బయలుదేరిన మరోబృందం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, లైబీరియా, కాంగో, సియర్రా లియోన్ దేశాలకు వెళ్ళింది. ఈ బృందాలు ఆయా దేశాల ప్రభుత్వాధినేతలు, ఉన్నత స్థాయి అధికారులతో సమావేశమై ‘ఆపరేషన్ సిందూర్’ అనంతరం భారత్–పాకిస్థాన్ మధ్య సైనిక చర్య, సరిహద్దుల నుండి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ సుదీర్ఘ చరిత్ర, ఆ దేశంలో ఉన్న ఉగ్రవాదస్థావరాలు వంటి అనేక విషయాలను, శాంతికి భారత్ కట్టుబడి ఉందన్న వైఖరిని తెలియజేస్తారు. అదేవిధంగా బిజెపి ఎంపి అపరాజిత సారంగి, బ్రిజ్‌లాల్, ప్రధాన్ బారువా, హేమంగ్ జోషి, కాంగ్రెస్ నాయకుడు, మాజీవిదేశాంగమంత్రి సల్మాన్ ఖుర్షీద్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపి అభిషేక్ బెనర్జీ, సిపిఐ(ఎం) ఎంపి జాన్ బ్రిట్టస్, మాజీ దౌత్యవేత్త మోహన్ కుమార్ తదితరులు సంజయ్ ఝా నాయకత్వానగల బహుళపక్షబృందంలో సభ్యులుగా ఉన్నారు. మొత్తం ఏడు బృందాలను కేంద్ర ప్రభుత్వం 32 దేశాలకు పంపుతున్నది. మే ఏడో తేదీన జరిగిన ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భూభాగంలో ఉన్న తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను భారత వైమానికదళం సమన్వయపూర్వక చర్యల ద్వారా ధ్వంసం చేసింది. పహల్గామ్‌లో ఏప్రిల్ 22వ తేదీన నిషేధిత లష్కరే తోయిబా ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మరణించడంతో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి. భారత విదేశాంగవిధానంలో కొత్త మార్పులు వచ్చాయి.

### జవాబు చెప్పాల్సిన ప్రశ్నలను దాటవేసేందుకే...విదేశాలకు

ప్రజల దృష్టి మరల్చడానికే అఖిలపక్ష ప్రతినిధి బృందాలను విదేశాలకు పంపుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ విమర్శించారు. జవాబు చెప్పాల్సిన ప్రశ్నలను దాటవేసేందుకే అప్పటికప్పుడు ఈ ఆలోచన చేశారని వ్యాఖ్యలు చేశారు. ‘1950 నుంచి ఐరాసలో భారత వాణి వినిపించేందుకు ప్రతి ఏడాది అక్టోబర్–నవంబర్ సమయంలో అఖిలపక్ష నేతలతో కూడిన బృందాన్ని పంపేవాళ్లం. కానీ 2014 నుంచి ఆ సంప్రదాయాన్ని నిలిపివేశారు. అయితే ప్రస్తుతం మోదీ ఇమేజ్ ప్రపంచవ్యాప్తంగా దెబ్బతినడంతో నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు. జవాబు చెప్పాల్సిన ప్రశ్నలను తప్పించుకోవడానికే అప్పటికప్పుడు ఈ అఖిలపక్షం ఆలోచన చేసి ఎంపిలను విదేశాలకు పంపిస్తున్నారు’ అని జైరాం రమేశ్ ఆరోపణలు చేశారు.సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తున్న ప్రోత్సాహాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టడానికి ఏర్పాటు చేసిన అఖిలపక్ష బృందాల్లోని పేర్లపై రాజకీయ రగడ రాజుకుంది. పేర్ల ఎంపికను పార్టీలకే వదిలేయాల్సిందని పార్టీలు అంటుండగా.. అది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయమని, ఏ పార్టీకీ సభ్యుల ఎంపికకు అవకాశం ఇవ్వలేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. రిజిజు వ్యాఖ్యలు పూర్తిగా సత్యదూరమని జైరాం రమేష్ మండిపడ్డారు. కాంగ్రెస్ సిఫార్సు చేసిన ఆనంద్‌శర్మ, గౌరవ్ గొగొయ్, సయ్యద్ నసీర్ హుసేన్, అమరీందర్ సింగ్‌లలో ఆనంద్ శర్మకే ఈ బృందాల్లో చోటు దక్కింది. ఆ పార్టీ నేతలు శశి థరూర్, మనీశ్ తివారీ, అమర్ సింగ్, సల్మాన్ ఖుర్షీద్‌లను సిఫార్సు చేయకున్నా అఖిలపక్ష బృందంలో ప్రభుత్వం చేర్చింది. ఈ అంశం పైనే కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

# అర్ధ శతాబ్ధపు అజ్ఞాతానికి తెర

- ఎన్‌కౌంటర్లో మావోయిస్టు కార్యదర్శి నంబాల కేశవరావు మృతి
- ఇంజనీరింగ్ చదివే రోజుల్లో విప్లవోద్యమాల వైపు
- 1970లో అడవుల్లోకి, 70 ఏళ్ల ప్రాయంలో తూటాలకు బలి
- తలపై కోటిన్నర రివార్డు - మృతదేహం కోసం బంధువులు







**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్ధశతాబ్ధపు అజ్ఞాత జీవితానికి తెరపడింది. 55 ఏళ్లపాటు తుపాకులు పట్టుకుని అడవుల్లో జీవితాన్ని కొనసాగించిన మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, అలియాస్ బసవరాజ్, గంగన్న పోలీసుల తూటాలకు మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా జయన్నపేటలో 1955 జనవరిలో జన్మించిన ఆయన మే 21,2005లో అబూజ్మడ్ అడవుల్లో చనిపోయారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా కొనసాగుతున్న కాల్పుల్లో 70 ఏళ్ల వయస్సు ఉన్న ఆయతో పాటు మరో 27 మంది మావోయిస్టులు హతమయ్యారు. ముప్పాళ్ల కేవరావు అలియాస్ గణపతి వయోభారంగా కారణంగా మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి పదివికి రాజీనామా చేయడంతో నంబాల కేశవరావు 2018లో ఆ బాధ్యతలు చేపట్టారు. స్వతహాగా కబడ్డీ ఆటగానికి పేరున్న ఆయన వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో (ఆర్ఇసి) బిటెక్ ఉత్తీర్ణుడయ్యాడు. చిన్ననాటి నుండే వామపక్షవిద్యార్థి రాజకీయాల్లో చురుకుగా ఉండేవారు. సిపిఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ తో చాలా దగ్గరగా సంబంధాలు నెరిపారు. 1980లో శ్రీకాకుళంలో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యు),ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగం అఖిలభారత విద్యార్థిపరిషథ్ (ఏబివిపి) అనే రెండు విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ జరిగినప్పుడు కేశవరావును పోలీసులు అరెస్టు చేశారు. 1970 చివరిలో ఆయన మావోయిస్టు భావాజాలనికి పూర్తి ఆకర్షితుడై అజ్ఞాత దళంలోనికి వెళ్లిపోయి. బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో మృత్యువాత పడ్డారు. గెరిల్లా యుద్ధతంత్రాలు ప్రయోగించడంలో ఆయన ధిట్టగా పేరుగాంచారు. మరోప్రక్క ఐటిడిఏ బాంబులు వాడటం, పేల్చడంలో ఆయన సిద్ధహస్తుడు. బలమైన దాడులను చేయడం రూపకర్తగా పేరుంది. 1980లో ఏపిలో పీపుల్స్‌వార్ పార్టీ ఏర్పాటులో కేశవరావు ప్రధాన భూమిక పోషించారు. తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో ప్రవేశించిన తొలి మావోయిస్టు కమాండర్ ఆయన. మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ, మల్లోజుల వేణుగోపాల్, మల్లా రాజిరెడ్డిలతో కలిసి 1987లో బస్తర్ అడవుల్లో ఎల్‌టిటిఇ బృంధం నుండి ఆకస్మిక దాడుల వ్యూహాలు, జిలిటెన్‌స్టిక్స్ నిర్వహణలో శిక్షణ పొందారు. 1992లో పూర్వపు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా పీపుల్స్ వార్ కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 2004లో కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా విలీనం ద్వారా కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మావోయిస్టు ఏర్పడినప్పుడు సైనిక వ్యూహాలు, పేలుడు పదార్ధాల వాడకంలో, ప్రధానం ఐఇడి వాడకంలో ఉన్న నైపుణ్యం కారణంగా కేశవరావును పార్టీ సెంట్రల్ మిలటరీ కమీష్ అధిపతిగా, పోలిట్‌బ్యూరో సభ్యునిగా నియమించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర,ఒడిస్సాల్లో దాదాపు అన్ని ప్రధాన మావోయిస్టు దాడుల్లో కేశవరావు అగ్రభూమికి పోషించారు. 2004 తిరుపతి అలిపిరిలో చంద్రబాబుపై జరిపిన దాడిలో కూడా కేశవరావు ఉన్నట్లు పోలీసుల రికార్డుల్లో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అరకు తెలుగుదేశం పార్టీ నాయకుడు కిడారి శర్వేశ్వర్ రావు హత్యకు ఆయనే కారణమని పోలీసులు వర్గాల సమాచారం. 2010లో దంతెవాడలో జరిగిన మావోయిస్టుల దాడిలో 76 మంది సిఆర్‌పిఎఫ్ సైనికులు మరణించారు. జీరామ్‌ఘాట్ దాడిలో ఛత్తీస్‌గఢ్ మాజీ రాష్ట్ర మంత్రి మహేంద్రఖర్మ, ఆ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నందకుమార్ పటేల్ సహా 27 మంది మరణించారు. ప్రకాష్ అలియాస్ కృష్ణ, అలియాస్ దారపు నర్సింహారెడ్డి రేరుతో కూడా ఆయన ప్రాచుర్యం పొందారు. 2018 ననంబర్ 10 వ తేదిన గణపతి స్థానంలో సిపిఐ మావోయిస్టు నూతన ప్రధాన కార్యదర్శిగా నంబాల కేశవరావు నియమితులయ్యారు. కేశవవరావుపై ఏపి,ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలో పలు కేసులు ఉండగా, పోలీసులు ఈయనను మోస్ట్ వాంటెండ్ మావోయిస్టుగా ప్రకటించి ఆయన తలపై రూ.1కోటి 50 లక్షల రివార్డును ప్రకటించారు. ఇదిలా ఉండడా ఈ ఘటనతో శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలు ఉలిక్కి పడగా, నంబాల కేశవరావు కుటుంబీకులు ఆయన మృతదేహాన్ని గుర్తుపట్టారని, మృతదేహాన్ని స్వాదీనం చేసుకునేందుకు వెళుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మృతదేహాన్ని స్వాదీనం చేసుకుని స్వగ్రామానికి చేరిస్తే ఆయన అంత్యక్రియలు జయన్నపేటలో జరిగే అవకాశాలు ఉన్నటు తెలుస్తోంది. మృతదేహాలు పాడవకండా ముందే కుటుంబీకులకు అప్పగించాలని బంధుమిత్రుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా ఆయన తండ్రి ఉపాధ్యాయునిగా పనిచేసే వారని, చిన్ననాటి నుండే చదువుల పట్ల ఎంతో ఆసక్తితో ఉండే నంబాల సాంకేతిక పరిజ్ఞానంలో కూడా ముందుడే వారని తెలుస్తోంది. జయన్న గ్రామంలో తన తండ్రి చదువు చెప్పిన పాఠశాల్లోనే విద్యాభ్యాసాన్ని ప్రారంభించారని, తన ఆరేళ్ల వయస్సులో తల్లిదండ్రులతో కలిసి దిగిన ఫొటో నెట్టింట చెక్కర్లు కొడుతోంది. ఏది ఏమైనప్పటికీ 55 ఏళ్లపాటు అజ్ఞాత జీవితాన్ని గడిపి ప్రభుత్వాలకు కొరకరాని కొయ్యగా మారిన ఆయన చివరకు పోలీసు తూటాలకు మృతి చెందారు. ఈ ఘటనతో అర్ధ శతాబ్ధపు అజ్ఞాతం నేలరాలిదంట్లూ విప్లవోద్యమ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

### వివాదాస్పద వ్యాఖ్యల కేసులో ప్రొఫెసర్‌కు...

## ‘సుప్రీం’ మధ్యంతర బెయిల్



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియా పోస్టుల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అత్యున్నత న్యాయస్థానం ఆయనకు మధ్యంతర బెయిల్ మంజురు చేసింది. అయితే ఆయనపై దర్యాప్తును నిలిపివేయాలనే అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్‌రావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కేసును 24గంటల్లో దర్యాప్తు చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించాలని హర్యానా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)ని ఆదేశించింది. ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఐజి ర్యాంక్ ఆఫీసర్ నేతృత్వంలో ఒక సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) ర్యాంక్ మహిళా ఆఫీసర్ సహా ముగ్గురు సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటుచేయాలని హర్యానా డిజిపికి ధర్మాసనం సూచించింది. పిటిషనర్ మహ్మూదాబాద్‌కు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేశామని, తదుపరి దర్యాప్తు కోసం ఆయన తన పాస్‌పోర్టును వెంటనే అప్పగించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సిట్‌లో నేరుగా రిక్రూట్ అయిన ఐపిఎస్ ఆఫీసర్లను ముగ్గురిని నియమించాలని, వారు హర్యానాకు చెందిన వారు కాకుండా హర్యానా రాష్ట్రంలో సేవలు అందిస్తున్నవారినే నియమించాలని ధర్మాసనం హర్యానా డిజిపికి తెలియజేసింది. ఐజి ర్యాంక్ ఆఫీసర్‌తో పాటు ఇతరులు ఇద్దరు పోలీస్ సూపరింటెండెంట్లు (ఎస్‌పిలు) లేదా అంతకు మించిన హోదాలో ఉన్నవారిని నియమించాలని డివిజన్ బెంచ్ సూచించింది. హర్యానా రాష్ట్రం సోనీపట్‌లోని అశోకా యూనివర్సిటీ రాజనీతి శాస్త్రం ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్ ఆపరేషన్ సిందూర్‌పై తన సోషల్ మీడియా పోస్టులో వివాదాస్పద వ్యాఖ్యలుచేశాడన్న కారణంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మహ్మూదాబాద్ ఆన్‌లైన్ పోస్ట్‌లను పరిశీలించిన బెంచ్ ఉద్దేశపూర్వకంగా ఇతరులను అవమానించడం, అవమానించడం లేదా అసౌకర్యానికి గురిచేయడం వంటి పదాల ఎంపికను ధర్మాసనం ప్రశ్నించింది.‘ప్రతీ ఒక్కరికీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంటుంది. కానీ ఇలాంటి సందర్భంలో మహ్మూదాబాద్ వ్యాఖ్యలు బాధ్యతాయుతంగా ఉండాలి. చట్టపరమైన పరిధులను అతిక్రమించకూడదు’ అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ దేశంలో చాలా విషయాలు జరుగుతున్నప్పుడు ఇతరులను అవమానపరిచే, అసౌకర్యానికి గురిచేసే పదాలను వాడటం ఆయనకు ఎంతవరకు సమంజసం అని అలీఖాన్ మహ్మూదాబాద్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్ర సమాచార కమిషనర్‌గా వైష్ణవి ప్రమాణం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్‌గా నియమితులైన వైష్ణవి మెర్లతో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణం చేయించారు. రాష్ట్ర చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార కమిషనర్లు బోర్రెడ్డి అయోధ్యరెడ్డి, పి.వి. శ్రీనివాస్‌రావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ జె.పద్మావతి, సాధారణ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

## భూదాన్ భూములపై ఇడి కేసులో స్టేకు 'నో'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూదాన్ భూముల కుంభకోణంలో బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ఖాదర్ ఉన్నీసా, మహమ్మద్ మునావర్ ఖాన్ పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో స్టే ఉత్తర్వులను జారీ చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈడీ కేసును కొట్టివేయాలని కోరుతూ నిందితులు ఖాదర్ ఉన్నీసా, మహమ్మద్ మునావర్ ఖాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీటిని జస్టిస్ నందికొండ నర్సింగరావు బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి ఆధారాలు లేకుండా ఈడీ కేసు నమోదు చేసిందని దీనిని కొట్టివేయాలని కోరారు. పిటిషన్ పై తుది ఉత్తర్వులు వెలువడే వరకు ఈ డి కేసుపై స్టే మంజూరు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ వాదనను ఈడీ తరఫు న్యాయవాది వ్యతిరేకించారు. వంద ఎకరాలకు పైగా భూదాన్ భూముల ఆక్రమణ జరిగిందని, కోట్ల రూపాయలతో ముడిపడిన వ్యవహారమని స్టే ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరారు. పిటిషనర్ల నివాసాల్లో ఈడీ జరిపిన సోదాలలో కీలక పత్రాలను సీజ్ చేశామన్నారు, కౌంటర్లు దాఖలు చేస్తామన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించారు. పిటిషన్లపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఈడీని ఆదేశించారు .విచారణను జూన్ 10కి వాయిదా వేశారు.

## పిజి డాక్టర్లకు సర్వీసులో చేరడానికి గడువు వద్దు : హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మెడికల్ పిజి చేసిన అభ్యర్థులు ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో తప్పనిసరిగా సేవలందించాలన్న నిబంధన అమలుకు గడువు విధించరాదంటూ హైకోర్టు బుధవారం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మెడిసిన్లో పీజీ పూర్తి చేసి రిజిస్ట్రేషన్కు ముందు ప్రభుత్వ ఆస్పత్రిల్లో తప్పనిసరిగా సేవలందించాలన్న నిబంధనను సవాలు చేస్తూ 46 మంది డాక్టర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జె శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కోర్సు పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లను విడుదల చేయడంలేదన్నారు. ప్రభుత్వ సర్వీసు తప్పనిసరిగా చేయాలంటూ అడ్మిషన్ల సమయంలోనే రూ.50 లక్షల బాండ్ తీసుకున్నారన్నారు. ఇది సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. తప్పనిసరిగా ప్రభుత్వ సర్వీసు అందించాలంటూ ప్రభుత్వం 2017లో జాగీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరారు వాదనలను విన్న న్యాయమూర్తి ప్రభుత్వ వివరణ కోరుతూ విచారణను ఈనెల 27కు వాయిదా వేశారు. ఈలోగా సర్వీసులో చేరడానికి గడువు విధించరాదని ఆదేశాలు జారీ చేశారు.

## వాణిజ్య వివాదాన్ని క్రిమినల్ కేసుగా నమోదు ఓ కుట్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాణిజ్యపరమైన వివాదాన్ని క్రిమినల్ కేసుగా నమోదు చేయడం సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధమని పేర్కొంటూ ఫోన్ టాపింగ్ కేసులో నిందితుడైన శ్రవణ్ కుమార్ రావు హైకోర్టు పిటిషన్ దాఖలు చేశారు. శ్రవణ కుమారు ఆర్థిక మోసం కేసులో ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు . ఈ కేసులో బెయిలు మంజూరు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. అఖండ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్కు, ఎకోర్ ఇండస్ట్రీస్ మధ్య జరిగిన లావాదేవీల్లో తన పాత్ర లేదని పేర్కొన్నారు. ఇర్రిథమ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ డైరెక్టర్గా ఎకోర్ ఇండస్ట్రీస్ నుంచి ఇనుప ఖనిజాన్ని కొనుగోలు చేసి విక్రయిస్తుంటామని, ఇందుకు గాను రూ. 24 కోట్లు వసూలు చేసి ఖనిజం సరఫరా లేయలేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. అఖండ ఇండస్ట్రీస్లో తన స్నేహితుడు కూడా డైరెక్టర్గా ఉన్నారని, అందులో భాగంగా ఇనుప ఖనిజం సరఫరాకు సాయం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ రెండు కంపెనీల మధ్య వాణిజ్య వివాదం పరిష్కారం అయ్యిందన్నారు. దీంతోపాటు ఈ వివాదం సివిల్ కోర్టులో ఉందని, అక్కడ దాఖలు చేసిన పిటిషన్లో ఇక్కడ చేసిన ఆరోపణలను ప్రస్తావించలేదన్నారు. ఏడేళ్లలోపే శిక్ష పడే నేరాభియోగ కేసుల్లో సుప్రీం కోర్ట్ ఆర్నేష్ కుమార్ కేసులో ఇచ్చిన తీర్పు మేరకు బెయిలు మంజూరు చేయాలన్నారు. తన న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా కింది కోర్టు పట్టించుకోకుండా 5 నిమిషాల్లో రిమాండ్ ఆదేశాలు జారీ చేశారన్నారు. మరో క్రిమినల్ కేసులో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పూచీకత్తులు సమర్పించడానికి పిలిపించి, ఈ కేసులో అరెస్ట్ చేశారన్నారు. అరెస్టుకు కారణాలను కూడా వెల్లడించలేదన్నారు. కుట్రపూరితంగా నమోదైన కేసులో బెయిలు మంజూరు చేయాలని కోరారు ఈ పిటిష్న ఈనెల 21న హైకోర్టు విచారణ చేసే అవకాశం ఉంది.

## దేవాదాయ శాఖ నోటీసు రద్దు

### బండి సంజయ్ పిటిషన్‌పై హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కరీంనగర్ చైతన్యపురిలోని మహాశక్తి ఆలయాన్ని దేవాదాయశాఖ చట్టం కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటూ దేవాదాయశాఖ సహాయ కమిషనర్ 2016లో ఇచ్చిన నోటీసును రద్దు చేస్తూ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అంతేగాకుండా దేవాదాయ శాఖ చట్టం నుంచి మినహాయింపునివ్వాలని కోరుతూ ఆలయ నిర్మాణదారు, ధర్మకర్త బండి సంజయ్‌కుమార్ పెట్టుకున్న వినతి పత్రంపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. మహాశక్తి ఆలయాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటూ కరీంనగర్ దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ మహాశక్తి ఆలయం తరఫున ధర్మకర్త, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ మహాశక్తి ఆలయాన్ని 2010లో నిర్మించి నిర్వహణ బాధ్యతలను హంపీ విద్యారణ్య పీఠం విద్యారణ్య భారతి స్వామీజీకి అప్పగించినట్లు తెలిపారు. ఆలయంలో ఎలాంటి హుండీ పెట్టలేదని, పూజలకు ఎలాంటి రుసుం వసూలు చేయడంలేదన్నారు. దేవాదాయశాఖ చట్టంలోని సెక్షన్ 154కింద మినహాయింపునివ్వాలని ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది మంగ్లీలాల్ నాయక్ వాదనలు వినిపిస్తూ దేవాదాయ చట్టంలోని సెక్షన్ 1(3)(బి) కింద ఇది ప్రజలకు చెందిన ఆలయం అని, హుండీ, కానుకలు వసూలు చేయనంత మాత్రాన ప్రైవేటు ఆలయం కాదని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి నోటీసుఇచ్చి 9ఏళ్లు కాలం గడిచినా సెక్షన్ 6 కింద ఆలయాల జాబితాను అధికారులు ప్రకటించలేదని, అందువల్ల నోటీసులు చెల్లవంటూ వాటిని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మినహాయింపు కోరుతూపెట్టుకున్న వినతిపత్రంపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేశారు.

## మొగిలి సునీతరావుకు ఎఐసిసి మహిళా కాంగ్రెస్ షోకాజ్ నోటీస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల ముఖ్యమంత్రి, టిపిసిసి అధ్యక్షునిపై తీవ్రమైన ఆరోపణలు చేసిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావుకు ఎఐసిసిసి మహిళా కాంగ్రెస్ షోకాజ్ నోటీస్ జారీచేసింది. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. సిఎం, టిపిసిసి అధ్యక్షునిపై వ్యాఖ్యలు చేసిన సునీతారావుపై కాంగ్రెస్ పార్టీ గోషామహాల్ నియోజకవర్గం నాయకులతో పాటు పలువురు సీనియర్ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణించింది.

# నేషనల్ హెరాల్డ్ కేసులో ఇడి చార్జిషీట్

### సోనియాగాంధీ తన హోదాను దుర్వినియోగం చేశారని అభియోగం

**న్యూఢిల్లీ :** 'నేషనల్ హెరాల్డ్ వార్తావేదిక (దినపత్రిక,వెబ్‌సైటు) ప్రచురణకర్త అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్)ను స్వాధీనం చేసుకునేందుకు సోనియాగాంధీ ఆనాడు (2010–11) తనకున్న హోదాను దుర్వినియోగం చేశారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కోర్టుకు తెలియజేసింది! యంగ్ ఇండియా సంస్థ (వైఐ)ను స్థాపించి దాని ద్వారా ఎజెఎల్‌ను స్వాధీనం చేసుకునేందుకు అఖిలభారత కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు పదవిని తనకోసం, తన కొడుకు వ్యక్తిగత ప్రయోజనాలకోసం దుర్వినియోగం చేశారని చార్జిషీటులో ఇడి పేర్కొన్నట్లు తెలుస్తున్నది. రాహుల్‌గాంధీ ఉద్దేశపూర్వకంగా అన్నీ తెలిసే ఈ వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారని ఇ.డి పేర్కొన్నట్లు తెలుస్తున్నది. ఎజెఎల్‌ను పునరుద్ధరించడానికి సంబంధించిన ఎలాంటి అధికారిక సాక్ష్యాధారాలను సమర్పించలేదనీ, అటు ఎజెఎల్‌గానీ, యంగ్ ఇండియా సంస్థగానీ, ఎఐసిసి కార్యవర్గ సభ్యులుగానీ సాక్ష్యాలు సమర్పించడంలో విఫలమయ్యారని ఇడి తన ఛార్జిషీటులో పేర్కొన్నట్లు తెలుస్తున్నది. ఆనాడు ఈ వ్యవహారాలు చూసిన కాంగ్రెస్ నాయకుడు మోతీలాల్ వోరా ప్రస్తుతం లేరు. ఆయన మరణించారు. ఐతే ఈ ఎజెఎల్, యంగ్ ఇండియాలకు సంబంధించి ప్రస్తుతం నిర్ణయాలు తీసుకునే అధికారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే వద్ద ఉన్నాయని కూడా ఛార్జిషీటు పేర్కొన్నట్లు తెలుస్తున్నది. యంగ్ ఇండియాను స్థాపించేందుకు విరాళాల ముసుగులో డబ్బు సమకూర్చేందుకు పార్టీలో కొందరు నాయకులు సహా అనేక మంది ప్రభావితులుగా ఉన్నారని కూడా పేర్కొంది. యంగ్ ఇండియాకు ఎఐసిసి రుణం సమకూర్చడం అనేది కేవలం ఒక బూటకపు వ్యవహారం అని, వందలకోట్ల రూపాయల ఎజెఎల్ ఆస్తుల యాజమాన్యాన్ని, లావాదేవీలను సోనియా,రాహుల్‌గాంధీలకు కట్టబెట్టేందుకేననీ ఛార్జిషీటు పేర్కొన్నట్లు తెలుస్తున్నది.

సంబంధిత వర్గాలు పిటిఐ వార్తాసంస్థకు చెప్పిన సమాచారం ప్రకారం, కొన్ని సంవత్సరాలక్రితం ఇ డి అధికారులు సోనియగాంధీని, రాహుల్ గాంధీని వేరు వేరుగా తమ కార్యాలయానికి పిలిచి నేషనల్ హెరాల్డ్ ప్రచురణసంస్థ ఆస్తుల స్వాధీనం కేసులో వారిని విచారించారు. వారి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. కాంగ్రెస్‌లో ఒకప్పటి నాయకుడు మోతీలాల్ వోరా స్వయంగా ఎజెఎల్‌కుకు, యంగ్ ఇండియాకు సంబంధించిన వ్యవహారాలన్నీ చూసేవారనీ, బ్రతికి ఉండగా ఆయనే ఆ వ్యవహారాలు చూసుకున్నందువల్ల ఆ రెండు సంస్థలకు చెందిన కార్యకలాపాలు, వాటి లోతుపాతులూ తమకు ఏ మాత్రం తెలియవని సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఇద్దరూ ఇ.డి అధికారుల ఎదుట సాక్ష్యాలు ఇచ్చారని తెలుస్తోందని వర్గాలు చెప్పాయి. ఈ ఆస్తుల స్వాధీనం కేసులో 78 ఏళ్ళు వయసు గల కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, రాజ్యసభ ఎంపి సోనియాగాంధీని నెంబర్–1 నిందిరాలుగా ఇ.ఇ. పేర్కొంది. నెంబర్–2 నిందితుడిగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతోపాటు మరో ఐదుగురిని కూడా నిందితులుగా చేర్చింది. లెక్కలు చూపించకుండా అక్రమంగా ధనాన్ని తప్పుడు మార్గాల్లో తరలిస్తున్నారన్న ఆరోపణలపై పిఎంఎల్‌ఎ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్) చట్టం కింద ప్రాసిక్యూషన్ వారిపై కేసులు పెట్టింది. నేషనల్ హెరాల్డ్ ప్రచురణకర్త ఎజెఎల్‌కు చెందిన ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకోవడంకోసం యంగ్ ఇండియా అనే సంస్థను స్థాపించారని, ఈ సంస్థలో మెజారిటీ షేర్ హోల్డర్లుగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఉన్నారని, ఒక పథకం ప్రకారం కుట్రచేసి ఆస్తులు కాజేయడానికే యంగ్ ఇండియా సంస్థను స్థాపించారనేది ఈ కేసులో ప్రధానాంశం. 2010–11లో సోనియగాంధీ ఎఐసిసి అధ్యక్షురాలుగా పనిచేశారు. మోసపూరితంగా ఆనాడు ఎజెఎల్ ఆస్తులు కాజేసేందుకు పన్నాగం పన్నారని కేసు పెట్టడంతో దీనిని నిర్ధారించుకోవడంకోసం ఇ.డి రంగంలోకి దిగింది. రాహుల్‌గాంధీ కూడా ఎజెఎల్ షేర్ హోల్డర్లను, ఎఐసిసికి దాతలుగా ధనాన్ని సమకూర్చినవారిని మోసం చేశారని ఇ.డి తన చార్జిషీటులో పేర్కొన్నట్లు తెలుస్తున్నది.



## విదేశీ చదువులు.. చేసేది డ్రగ్స్ వ్యాపారం

### తప్పించుకోడానికి ఎస్ఐపై దాడి – ముగ్గురి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లండన్‌లో బారిష్టర్ చదువు..ఇతర ఉన్నత చదువులు చదివారు..విదేశాల్లో ఏర్పడిన పరిచయాలు..నైజీరియన్‌లతో కొనసాగిన స్నేహం చివరికి ఆ ముగ్గురిని డ్రగ్స్ వ్యాపారం లోకి దింపింది. డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ దొరల లాగా.. రాజా సాబ్ రీతిలో జల్సాలు సాగిస్తున్న వీరు ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ పోలీసులకు పట్టు పడడం ఊహించలేకపోయారు. హైదరాబాద్‌కు చెందిన అన్నదమ్ములు ప్రభు చైతన్య, వరుణ్‌తో పాటు కిరణ్ లండన్ లో ఉన్నత చదువులు చదివారు. ఇండియాకు వచ్చి చదువుకున్న చదువులతో ఉన్నతమైన వ్యాపారము విద్యాసంస్థలు నడుపుకోవాల్సిన వారు నైజీరియన్‌లతో స్నేహం పెంచుకుని డ్రగ్స్, గంజాయి వ్యాపారం లోకి దిగారు.తరచూ బెంగళూరు వెళుతూ అక్కడి నుంచి నైజీరియా వ్యక్తుల వద్ద ఉన్న పరిచయాలతో డ్రగ్సును హైదరాబాద్ కు తీసుకువచ్చి కిరణ్ తో పాటు మరికొంతమందితో అమ్మకాలు జరిపిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.వీరి గ్యాంగ్‌లో వంశీ,సాయి కృష్ణ,నందు సాయిలును కూడా కలుపుకుని దందా చేస్తున్నారు.ఈ క్రమంలోనే ప్రభుచైతన్య, వరుణ్, కిరణ్‌లు బుధవారం హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఎస్‌టిఎఫ్ ఎస్ఐ సంధ్య, మరో కానిస్టేబుల్ దాడి చేసి పట్టుకున్నారు. తమ పరువు పోతుందనే భయంతో నిందితులు ముగ్గురు పోలీసులపై దాడి చేసి పారిపోతుండగా చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి 2.58 ఎండిఎంఎ డ్రగ్స్, 38.56 గ్రాముల ఓజి కుష్ ను స్వాధీనం చేసుకున్నారు. ఒక బైకును మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులో వీరు చేస్తున్న వ్యాపారాలపై నిగా పెట్టి మిగిలిన వారిని కూడా అరెస్ట్ చేస్తామని ఎస్‌టిఎఫ్ టీం లీడర్ ప్రదీప్ రావు తెలిపారు.

# గత ఏడాది 18,200 హెక్టార్ల ప్రాథమిక అడవులు కోల్పోయిన భారత్

### గడచిన 24 ఏళ్ళలో భారీనష్టం జిఎఫ్‌డబ్ల్యు నివేదిక

**న్యూఢిల్లీ :** భారతదేశం 2024 లో 18,200 హెక్టార్ల ప్రాథమిక అడవులను నష్టపోయిందని ప్రపంచ అటవీ అధ్యయన సంస్థ గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ (జిఎఫ్‌డబ్ల్యు) సరికొత్త గణాంకాలు వెల్లడించాయి. 2023వ సంవత్సరంలో 17,700 హెక్టార్ల ప్రాథమిక అడవులను దేశం కోల్పోయింది. అంటే ఒక్క ఏడాది వ్యవధిలో ఈ నష్టపోయిన అడవుల విస్తీర్ణం 500 హెక్టార్లు పెరిగింది. మరో 100 సంస్థల సమన్వయంతో జిఎఫ్‌డబ్ల్యు ఈ గణాంకాలను సేకరించింది. అదేవిధంగా ఉపగ్రహ సమాచారం ద్వారా కూడా అత్యుత్తమస్థాయిలో ఈ గణాంకాలను సేకరించింది. అదేవిధంగా 2002 నుండి 2024 వరకూ దేశంలో తేమను అందించే 3,48,000 హెక్టార్ల ప్రాథమిక అడవులు అంతర్థానమయ్యాయి. అంటే ఆ 22 ఏళ్ళకాలంలో మొత్తం ప్రాథమిక తేమ అడవులలో 5.4 శాతం మేరకు దేశం నష్టపోయింది. ఇదేకాలంలో మొత్తం భారతదేశం 15 శాతం చెట్లను కోల్పోయింది. 2019 నుండి 2024 వరకూ భారత్ 1,03,000 హెక్టార్ల ప్రాథమిక తేమ అడవులను నష్టపోయింది. నిష్పత్తిలో చూస్తే ఇది 1.6 శాతంగా నమోదైంది. అంటే అదేకాలంలో మొత్తం14 శాతం చెట్లనీడను, వాటి ఆక్సిజన్ ఉత్పత్తిని దేశం నష్టపోయింది. అదేవిధంగా 2022లో 16,900 హెక్టార్లు, 2021లో 18,300 హెక్టార్లు, 2020లో 17,000 హెక్టార్లు, 2019లో 14,500 హెక్టార్లు తేమను అందించే ప్రాథమిక అడవుల విస్తీర్ణాన్ని మన దేశం కోల్పోయిందని జిఎఫ్‌డబ్ల్యు గణాంకాలు తెలియజేశాయి. జిఎఫ్‌డబ్ల్యు నిర్వచనం ప్రకారం, ప్రాథమిక అడవులంటే పరిణతి చెందిన ప్రకృతిసహజసిద్ధమైన తేమను వెదజల్లే ఉష్ణప్రాంత అడవులు పూర్తిగా అంతర్థానం కాలేదు. ఈ అడవులు తిరిగి పెరిన ఇటీవలి చరిత్ర మనకు అందుబాటులో ఉంది. 2001 నుండీ భారతదేశం మొత్తం 20.31 హెక్టార్ల చెట్లను, వాటి నీడను, అవి ఉత్పత్తిచేసే ఆక్సిజన్‌ను వాతావరణ సమతుల్యతను కోల్పోయింది. అదేకాలంలో 7.1 శాతం మేరకు చెట్లు క్షీణించిపోగా, అంతకు సమానంగా 1.29 గిగాటన్నుల కార్బండైయాక్సైడ్ కాలుష్యవాయువులు పెరిగాయని జిఎఫ్‌డబ్ల్యు తెలియజేసింది. ఐనప్పటికీ కూడా భారతదేశం 2000 నుండి 2020 వరకూ ఇరవైయేళ్ళలో 10.78 లక్షల హెక్టార్లలో చెట్ల నీడను, వాటి ప్రకృతి కార్యకలాపాలను భారత్ నష్టపోయింది. అదే సమయంలో 1.4 శాతం మేరకు ప్రపంచవ్యాప్తంగా చెట్లు పెరిగాయి. 2001 నుండి 2024 వరకూ అసోం రాష్ట్రం అత్యధికంగా 3.40 లక్షల హెక్టార్లలో చెట్లను కోల్పోయింది. ఇది జాతీయ సగటు 67,900 హెక్టార్లకంటే అత్యధికం. మిజోరాం రాష్ట్రం కూడా 3.34 లక్షల హెకాటర్లలో చెట్లను కోల్పోగా, నాగాలాండ్ రాష్ట్రం 2.69 లక్షల హెక్టార్లు, మణిపూర్ రాష్ట్రం 2.55 లక్షల హెక్టార్లు, మేఘాలయ రాష్ట్రం 2.43 లక్షల హెక్టార్లలో చెట్లు పోగొట్టుకున్నాయి. ఇదేకాలంలో 10.39 లక్షల హెక్టార్లలో చెట్ల మనుగడను దేశం కోల్పోయింది. నాగరికత విస్తరణవల్ల మరో 6.20 లక్షల హెక్టార్లలో వ్యవసాయ భూమిని దేశం శాశ్వతంగా నష్టపోయింది. స్థానభ్రంశాలు, పునరావాసాలు, మౌలిక ప్రాతిపదిక సదుపాయాల అభివృద్ధి వంటి కారణాలవల్ల మరో 30,600 హెక్టార్ల చెట్ల పర్యావరణాన్ని కూడా భారత్ నష్టపోయింది.



## అకాల వర్షంతో తడిసిన ధాన్యం అపారనష్టంతో రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం నీటిపాలు అయింది. అధికారులు తేమ పేరుతో కొనుగోలు చేయడం ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాలలో సరైన వసతులలేమితో సకాలంలో ధాన్యం కొనకపోవడంతో కళ్ళల్లోనే ధాన్యం వర్షం పాలయిందని వారు కన్నీటి పర్యంతమయ్యారు. కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

**లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాలతో పాటు రాజురలోని బుధవారం ఉదయం కురిసిన ఈదురు వర్షానికి ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం వేగంగా పంపకుంటే మరింత నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించాలని రైతుల కోరుతున్నారు.

**ముధోల్ :** చేతికి అందిన వరి ధాన్యం అకాల వర్షంతో నీళ్లపాలవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి తరలించడంలో జాప్యం జరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



## థియేటర్ల బంద్ నిర్ణయాన్ని ఉపసంహరించండి ఎగ్జిబ్యూటర్లకు నిర్మాతల విజ్ఞప్తి


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** థియేటర్ల బంద్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎగ్జిబ్యూటర్లకు నిర్మాతలకు నిర్మాతలు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో బుధవారం డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్లతో నిర్మాతలు నిర్వహించిన సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. గురువారం మరోసారి బేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశంలో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్ల డిమాండ్లపై ప్రధానంగా చర్చించారు. థియేటర్ల బంద్ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వారిని ఈ సందర్భంగా నిర్మాతలు కోరారు. గురువారం జరిగే సమావేశంలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుందామని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మరోసారి భేటీ అవుదామని అన్నారు. దీంతో మరో సమావేశంలో ఈ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉందని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా.. గతకొన్ని రోజుల క్రితం తెలుగు రాష్ట్రాల్లోని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేకపోవడంతో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయించారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు.

## తలసరి జిఎస్‌విఎలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం

### హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం 2015లో తలసరి జిఎస్‌విఎ (పర్ క్యాపిటా గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్)లో 9వ స్థానంలో ఉండగా, 2024 నాటికి దేశంలోనే అగ్రస్థానానికి చేరినట్టు ఐసిఆర్‌ఎ 'స్టేట్ ఎకనామిక్ ట్రెండ్స్ మే 2025' నివేదిక వెల్లడించిందని, ఇది కెసిఆర్ పాలనకు నిదర్శనమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తలసరి ఆదాయం రూ.1.25 లక్షల నుంచి రూ 3.5 లక్షలకు రెట్టింపు కాగా, 6.8 శాతం సిఎజిఆర్‌తోనే పురోగతి సాధ్యమైందని, ఈ విజయం వెనుక కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు, వ్యవసాయ విధానాలు, బలమైన పారిశ్రామిక వృద్ధి ఉన్నదని హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది సమర్థవంతమైన పాలన, ధీటైన ఆర్థిక వ్యూహాలతో తెలంగాణను దేశంలో అభివృద్ధి చిహ్నంగా నిలిపిన సాక్ష్యమని, అయిన ప్పటికీ, సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని దివాళ రాష్ట్రంగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు.

# 'గోదావరి'లో తవ్వకాలు



### నది గర్భం నాశనం, రైతుల గుండెల్లో గుబులు.. పర్యావరణానికి ప్రమాదం, భవిష్యత్తు అంధకారం..

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** తెలంగాణ జీవనాడి అయిన గోదావరి నదిలో జరుగుతున్న మట్టి తవ్వకాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు అనుమతి ఇచ్చినప్పటికీ, ఎంత మేర తవ్వకాలు జరపవచ్చు అనే స్పష్టమైన సమాచారం లేకపోవడంతో విచ్చలవిడిగా మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి ప్రాధాన్యమిస్తూ పర్యావరణాన్ని, రైతుల భవిష్యత్తును పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అనుమతుల పరిమితులు అస్పష్టం, అడ్డగోలుగా తవ్వకాలు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు మట్టి తవ్వకాలకు అనుమతి ఇచ్చింది నిజమే అయినప్పటికీ, ఎంత పరిమాణంలో తవ్వకాలు జరపాలి అనే దానిపై స్పష్టమైన నిబంధనలు లేవని తెలుస్తోంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు యథేచ్ఛగా గోదావరి నది నుండి మట్టిని తరలిస్తున్నారు. భారీ యంత్రాలతో నది గర్భాన్ని తవ్వుతుండటంతో సహజసిద్ధమైన నదీ తీరం దెబ్బతింటోంది. నీటి ప్రవాహ మార్గాలు మారుతున్నాయి.

**పర్యావరణానికి పెనుముప్పు...** జీవవైవిధ్యంపై ప్రభావం నదిలో అడ్డగోలుగా మట్టి తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిలుతోంది. ఇసుక అనేది నదీ వ్యవస్థలో ఒక ముఖ్యమైన సహజ వనరు, ఇది నీటిని ఫిల్టర్ చేయడంలో, భూగర్భ జలాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విపరీతంగా ఇసుకను తవ్వడం వల్ల ఈప్రక్రియకు అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా, నదిలో నివసించే చేపలు ఇతర జలచరాల ఆవాసాలు నాశనమవుతున్నాయి. ఇది జలచరాల సంతతిపై తీవ్ర ప్రభువం చూపుతుంది.

**రైతులపై తీవ్ర ప్రభావం...** సాగునీటి కష్టాలు గోదావరి నదిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు ఈ మట్టి తవ్వకాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నది లోతు తగ్గిపోవడం వల్ల సాగునీటి లభ్యత తగ్గుతుంది.ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో సతమతమవుతున్న రైతులకు ఇది మరింత భారంగా మారుతుంది. భూగర్భ జలాలు అడుగంటడం వల్ల భవిష్యత్తులో వ్యవసాయం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది. నదీ తీర ప్రాంతాల్లోని భూములు కోతకు గురువుతుండటంతో రైతులు పొలాలను సైతం కోల్పోతున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి...**శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు మట్టి తవ్వకాలకు ఇచ్చిన అనుమతులపై సమగ్ర విచారణ జరిపించాలి. ఎంత పరిమాణంలో తవ్వకాలు జరపాలి అనే దానిపై స్పష్టమైన నిబంధనలు విధించాలి.పర్యావరణానికి నష్టం కలిగించే విధంగా తవ్వకాలు జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి ఆదాయం ముఖ్యం అయినప్పటికీ, పర్యావరణ పరిరక్షణ, రైతుల ప్రయోజనాలను విస్మరించకూడదు. గోదావరి నది కేవలం నీటి వనరు మాత్రమే కాదు, ఇది లక్షలాది మంది ప్రజల జీవనాధారం,స్వల్ప కాలిక ప్రయోజనాల కోసం నదిని ఇలా విచ్చలవిడిగా తవ్వడం వల్ల దీర్ఘకాలంలో తీవ్ర నష్టాలు వాటిల్లుతాయి. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి,పర్యావరణాన్ని పరిరక్షించడానికి,రైతుల భవిష్యత్తును కాపాడటానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. లేకపోతే, తెలంగాణ రైతాంగం, పర్యావరణం తీవ్ర మూల్యం చెల్లించుకోక తప్పదని పరిశోధకులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**మూడు రోజులే అనుమతిచ్చాం...**

**ఎస్ఆర్ఎస్‌పి ఇఇ చక్రపాణి..** రైతుల కోసం మూడు రోజులు మాత్రమే మట్టి తవ్వకాలు అనుమతి ఇవ్వడం జరిగిందని, పరిమితికి మించి మట్టి తీస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగిందని ఎస్ఆర్ఎస్‌పి ఇఇ చక్రపాణి అన్నారు. కొందరు రాజకీయ అండతో నడుపుకుంటున్నారని వెంటనే చర్యలు చేపట్టి టిప్పర్లు సీజ్ చేస్తామని తెలిపారు.

## దివంగత ప్రధాని రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు



**ప్రజాపక్షం/కాప్రా/మల్కాజిగిరి:** ప్రధానిగా దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లో నిలిచి పోయాయని కాంగ్రెస్ వక్తలు కొనియాడారు. నాచారం, మల్కాజిగిరి ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు పెద్దసంఖ్యలో చేరి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. నాచారంలో జరిగిన కార్యక్రమంలో పార్టీనేతలు ఎండి తోషిక్, ప్రకాష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాలరాజు, నరేష్, ఫిరోజ్, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, మిర్జాల్‌గూడలో జరిగిన మరో కార్యక్రమంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్. వెంకటేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు : ఎస్‌పి వెల్లడి



**ప్రజాపక్షం /వికారాబాద్ ప్రతినిధి :** హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదులను విధించిన జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి సున్న శ్రీనివాస్‌రెడ్డికి జీవిత ఖైదు ,1000 రూపాయల జరిమానా విధించారని జిల్లా ఎస్‌పినారాయణరెడ్డి తెలిపారు. ధరూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితులకు 02.092015 రోజున హరిజన్ ప్రమీలమ్మ, తన కొడుకు హరిజన్ రవి లు అవుసుపల్లి గ్రామం, ధారుర్ మండల తమ ఇంట్లో ఉండగా అదేరోజు మధ్యాహ్నం 2గంటలకు అదే గ్రామనికి చెందిన సోమారం సమ్మయ్య ఎ1 ,అంతరపు శ్రీనివాస్ ఎ2 తన కొడుకుని త్రాగడానికి అని బయటకు తీసుకొని వెళ్లి హతమార్చారు. ఫిర్యాదు చేయగా అప్పటి ధారూర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్, సిఐ రంగ, ప్రస్తుత ధరూర్ ఎస్‌ఐ అనిత, రఘురాములు, శంకర్ , వీరన్న, తదితరులను అభినందించారు.



## నేడు ప్రధాని మోదీ ప్రారంభించనున్న బేగంపేట, వరంగల్, కరీంనగర్ స్టేషన్‌లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఎబిఎస్‌ఎస్) కింద పునరాభివృద్ధి చేసిన బేగంపేట, వరంగల్, కరీంనగర్ స్టేషన్‌లను ప్రధాని నరేంద్రమోది వర్చువల్‌గా గురువారం ప్రారంభిస్తారు. గత ఏడాది మార్చిలో బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వే స్టేషన్‌లను రూ.26.55 కోట్లు, రూ.25.85 కోట్లు , రూ.25.41కోట్లతో పునరాభివృద్ధి పనులకు శంకుస్థాన చేయగా ఇటీవలే పనులు పూర్తయ్యాయి. ఇదే రోజు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో అభివృద్ధి చేసిన మరో 100 అమృత్ స్టేషన్‌లను కూడా ప్రదాని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.



## 7211.440 టన్నుల ధాన్యం కొనుగోలు

### మేడ్చల్ జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ జిల్లాలో ఏర్పాటు చేసిన 14 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1316 మంది రైతుల నుండి 7211.440 టన్నుల ధాన్యం కొనుగోలు చేసామని జిల్లా పౌర సరఫ రాల శాఖాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో 6133.680 టన్నులు దొడ్డు రకం ధాన్యం 1055 మంది రైతుల నుండి, 1077.760 టన్నులు సన్నరకం ధాన్యం 261 మంది రైతుల నుండి కొనుగోలయిందన్నారు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్‌గా చెల్లిస్తున్నామన్నారు. రైతులకు వారు విక్రయించిన ధాన్యానికి గాను ఇవ్వాల్సిన సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నామన్నారు. శామీర్‌పేట, అలియాబాద్, జగన్‌గూడ ప్రాంతాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొని వచ్చిన రైతులతో ఆయన మాట్లాడుతూ తాము తెచ్చే ధాన్యంలో తేమ, తాలు, మట్టి బెడ్డలు లేకుండా నాణ్యతతో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇటీవలికాలంలో కురుస్తున్న అకాల వర్షం విషయం వాతావరణ శాఖ సూచనల మేరకు రైతులు అప్రమత్తంగా ఉండేలా అధికారులు చూడాలని, తమ ధాన్యం ఏ మాత్రం తడువకుండా జాగ్రత్తలు తీసుకొనేలా చూడాలన్నారు. కీసర గ్రామంలోని ధాన్య సేకరణ కేంద్రాన్ని సివిల్ సప్లయిస్ డిఎం సుగుణబాయ్ పరిశీలించారు.

## ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/పరిగి:** ప్రభుత్వ, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో పిసిసి పరిశీలకులు వినోద్‌రెడ్డి, రాంశెట్టి నరేందర్‌తో కలిసి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని, ఈ సందర్భంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురష్కరించుకొని నివాళులు అర్పించారు. గ్రామాల అభివృద్ధికి, భారతదేశ పురోభివృద్ధికి తనదైన శైలిలో సేవలందించిన రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకోసం కృషి చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో అర్హులకు పథకాలు చేరేలా కృషి చేయాలని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్నబియ్యం, రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కష్టాల్లో కాంగ్రెస్‌కు వెన్నంటి నడిచిన కార్యకర్తలే పార్టీకి బలం అన్నారు. రాబోయే ఎన్నికల్లో పనిచేసి 100శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి పంతులు, భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశూరాం రెడ్డి, పట్టణ అధ్యక్షులు కృష్ణ, లాల్ కృష్ణ , అయూబ్, ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంక్‌లో మట్టి తొలగించాలని హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుమ్రుక్కుద్దౌలా ట్యాంక్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మట్టి, ఇతర సామగ్రిని తొలగించాలని పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఒకవేళ పిటిషనర్ తొలగించకపోతే వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హైడ్రా తగిన చర్యలు తీసుకోవాలంది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో సర్వే నెం.42లో 3.03 ఎకరాలు, సర్వే నెం.50/1లో 9.24 ఎకరాలను కొనుగోలు చేశానని, ఇందులో జోక్యం చేసుకోకుండా హైడ్రాతో సహా అధికారులను ఆదేశించాలని మహమ్మద్ ఇబ్రహీం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ మరో ప్రైవేటు వ్యక్తి ఫిర్యాదుతో అధికారులు జోక్యం చేసుకుంటున్నారని, దీనిపై సివిల్ కోర్టు ఆదేశాలున్నాయని చెప్పారు. వాదనలను విన్న న్యాయమూర్తి చెరువులో వేసిన మట్టిని పిటిషనర్ సొంత ఖర్చుతో తొలగించాలని ఆదేశించారు. అదేవిధంగా పిటిషనర్ సమర్పించిన వినతి పత్రాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని హైడ్రాను ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేశారు.

## 'లిఫ్ట్ ప్రమాదాల' నివారణ చర్యలు నివేదించండి : రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా అపార్ట్‌మెంట్‌ల్లో ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్‌ల్లో చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రమాదాల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. లిఫ్ట్‌ల ఏర్పాటు, నిర్వహణలో నిబంధనలు అమలు చేయకపోవడంతో పలుచోట్ల పిల్లలు, పెద్దలు ప్రాణాలు పోతున్నాయంటూ ఓ వ్యక్తి హైకోర్టుకు లేఖ రాశారు. ఇటీవల ముగ్గురు మహిళలు గాయపడటం, నాలుగేళ్ల బాలుడితోపాటు ఓ ఆర్‌ఎంపీ డాక్టర్ మృతి చెందిన సంఘటనలను ప్రస్తావించారు. ఈ లేఖను హైకోర్టు సుమోటో పిల్‌గా పరిగణనలోకి తీసుకుంది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన బెంచ్ ఇటీవల విచారణ చేపట్టింది. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. ప్రజల భద్రతకు ఏం చర్యలు తీసుకుంటున్నారో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వేసవి సెలవుల తరువాత వాయిదా వేసింది.





## హైదరాబాద్‌లో భారీ వర్షం

**పజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో పలు ప్రాంతాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ఉదయం నుంచి తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బంది పడిన నగర వాసులకు మధ్యాహ్నం తరువాత వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమైంది. ఒక్కసారిగా వర్షం కురువడంతో వాతావరణం చల్లబడింది. భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. పలు ప్రాంతాల్లో మోకాలు లోతు వరదనీరు పోటేత్తింది. పాతబస్తీతో పాటు శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురువడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. నగరంలోని మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, సరూర్ నగర్, కొత్తపేట, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, లక్డీకపూల్, ఫిలింనగర్, బోరబండ, యూసఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులకు తోడు గాలి దూమారంతో పలు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జిహెచ్‌ఎంసి వర్షాకాల అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి.

## ఘనంగా హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ డైమండ్ జూబ్లీ వేడుకలు

### 60 మంది ప్రభుత్వ పాఠశాలల పేద బాలికలకు సైకిళ్ళ పంపిణీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ మానవతావాదం, అంకితభావంతో సామాజిక అభివృద్ధిలో చేసిన కృషిని ఏనలేనిదని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ లయన్ మనోజ్ షా ప్రశంసించారు.హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ 60 ఏళ్ల డైమండ్ జూబ్లీ ఉత్సవాలు బుధవారం సికింద్రాబాద్, బాలంరాయిలోని డ్రీమ్ లాండ్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ లయన్ మనోజ్ మాట్లాడుతూ హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ తన సేవ కార్యక్రమాలను నిరంతరంగా కొనసాగించాలని కోరారు. విద్య, వైద్య రంగాలలో లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలని సూచించారు. ప్రధానంగా అనాథలు, అభాగ్యులను ఆదరించి ఆశ్రయం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. అదేవిదంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నైపుణ్యా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు తగిన చర్యలనుతీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగాబాలికల విద్యా ప్రోత్సాహార్థంగా 60 మంది మెరిటోరియస్ ,ఆర్థికంగా బలహీనమైన బాలికలకు సైకిళ్లను అందజేయడం ఆనందంగా ఉందనిమనోజ్ షా అన్నారు. డైమండ్ జూబ్లీ వేడుకలకుగౌరవ అతిథులుగా హజరైన ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్. బాబు రావు, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్. ఆర్. సునీల్ కుమార్, మరియు మల్టిపుల్ 320, డిస్ట్రిక్ట్ 320 Aకి చెందిన ప్రముఖ నాయకులు లయన్. నరేందర్ రెడ్డి , లయన్. దీపక్ భటాచర్జీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్. డి. కోటేశ్వరరావు మరియు మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్. హెచ్. రాజి రెడ్డి, పూర్వ అధ్యక్షులు చంద్ర శేఖర్ వేముల, హరి దర్శన్ సాలికే క్లబ్ గతంలో చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ లయన్. నవీన్ మాజేటి, సెక్రటరీ లయన్. సునీల్ తాటిపల్లి, ట్రెజరర్ లయన్ . సుశీల్ కుమార్ సెలబ్రేషన్స్ కమిటీ చైర్మన్గా పిఐడి లయన్. ఆర్. సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## టోలీచౌకి పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ టోలిచౌకి పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించారు. బుధవారం ఎఫ్ఐఆర్ అయిన మొదటి పిటిషన్‌ను ఆయన పరిశీలించారు. టోలిచౌకి పోలీసు స్టేషన్ ఇటీవలే కొత్తగా ఏర్పడింది. స్టేషన్ ఎస్‌హెచ్ఒ, ఎస్ఐల పని విధానాన్ని పరిశీలించారు. ఏరియాలలో పెట్రోలింగ్, బ్లూకోర్ట్స్ పోలీసుల పని విధానంపై కూడా ఆరా తీశారు.

### బిజెపి నాయకుల అవమానకర మాటలు

## మోదీ ఖండించకపోవడం దారుణం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** బిజెపి నాయకులు సైనికుల త్యాగాన్ని వక్రీకరిస్తూ అవమానంగా మాట్లాడుతుంటే ప్రధాని మోడీ ఖండించకపోవడం దారుణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. సిపిఐ కుత్బుల్లాపూర్ మండల 4వ మహాసభ బుధవారం షాపూర్‌నగర్‌లోని ఎఐటియుసి పొట్లూరి నాగేశ్వర్ రావు భవన్‌లో మండల కార్యదర్శి ఉమా మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ ఈ దేశ స్వాతంత్ర్యంకోసం పోరాటం చేసింది భారత కమ్యూనిస్టు పార్టీనేనని , దేశభక్తులని చెప్పుకునే ఆర్.ఎస్.ఎస్ ఏనాడూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొనలేదన్నారు. ప్రస్తుతం సిపిఐ పార్టీ గురించి కమ్యూనిజం గురించి మాట్లాడడం తగదని, ఈ దేశంలో కమ్యూనిజం రావడం తథ్యమన్నారు.

బిజెపి హిందూ అనే పేరుతో దోపిడీ చేస్తూ వ్యాపారస్తులకి లాభం చేకూరుస్తున్నాడని అన్నారు. పుల్వామా లాగా పెహల్గాం ఉగ్రవాదుల దాడిని వాడుకుందాం అనుకుంటే తనకి వ్యతిరేకం అయిందన్నారు. పెరుగుతున్న ధరలను తగ్గించాలని, నిరుద్యోగం గురించి , అవినీతి గురించి మాట్లాడకుండా మతం పేరుతో రాజకీయం చేస్తున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. 'ఒకే దేశం ఒకే ట్యాక్స్' అని ప్రచారం చేసిన మోడీ పెట్రోల్ పై కూడా టాక్స్‌ను అమలు చేయకపోవడం మోడీ కేవలం నినాదాల వరకే పరిమితం అన్నారు. ఎన్నికల విధానంలో కూడా మార్పు రావాలని, దానికోసం మనం పని చేయాలని కోరారు. అందరూ పోరాటం చేస్తే తెలంగాణ వచ్చిందని, కెసిఆర్ ఒక్కరి వల్ల కాదన్నారు. తెలంగాణ వచ్చాక అవినీతి మితిమిరి పోయిందని, కబ్జాలు పెరిగిపోయాయని , కార్మికుల పై దాడులు పెరిగాయని, ఉచితాలపై మాట్లాడుతున్నారని, కానీ దోపిడీ చేస్తున్న వారి గురించి మాట్లాడట్లేదని, పనికల్పించకుండా మాట్లాడడం తగదన్నారు.

అధికారంలో ఉన్న పార్టీల నాయకులు, అధికారులను వాడుకుని పనులు చేయిస్తుంటే మరో పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ అధికారులు జైలుకు పోతున్నారన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి సమాజాన్ని కాపాడాలన్నారు. సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయ మూర్తికి మహారాష్ట్రలో అవమానం జరిగిందని, బిజెపి హయాంలో అధికారులకు గౌరవ మర్యాదలు లేవన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్ మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర మహాసభలు మన ప్రాంతంలోనే జరుగుతున్నాయని, సిపిఐ కార్యకర్తలు కదిలి జయప్రదం చేయాలని కోరారు. కుత్బుల్లాపూర్ మండలంలో లక్షల ఎకరాల్లో వేలాది మంది ప్రజలకు అనేక బస్తీలను ఏర్పాటు చేసిన చరిత్ర ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని కార్మిక హక్కులను కాపాడటానికి పోరాటం నిర్వహిస్తున్నామని అన్నారు. యువకులు, మహిళలు హిందూ అనే పేరుతో రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని మోసపోవద్దన్నారు. ప్రజల కోసం నిత్యం పని చేసేది కమ్యూనిస్టులేనని, కమ్యూనిస్టులను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.యేసురత్నం, జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, మండల కార్యవర్గ సభ్యులు హైమావతి, ప్రవీణ్, శ్రీనివాస్, నర్సయ్య, నర్సింహా రెడ్డి, దుర్గయ్య, సదానంద్, భాస్కర్, కృష్ణ, వెంకటేష్, రాములు, సహదేవ రెడ్డి, భాస్కర్, బాబు, సత్యవతి, సాయిలు, రవి, సామెల్, శ్రీనివాస్ చారి, వీరాస్వామి, సుంకరెడ్డి, ఇమామ్, భీమేష్, యూసఫ్, కీర్తి, జంబూ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపక్షాన నిలిచేది సిపిఐ మాత్రమే

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజల పక్షాన అన్ని వేళలా నిలిచి సమస్యల పట్ల పోరాటం చేసే పార్టీ కేవలం సిపిఐ మాత్రమే అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డిజి సాయిలు గౌడ్ అన్నారు. బుధవారం పార్టీ ఆల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్ అధ్యక్షతన యాప్రాల్‌లోని మల్లన్న ఆలయ ఆవరణలో ఆల్వాల్ మండల నాలుగవ మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సాయిలు గౌడ్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో పోరాటం ద్వారా ఇల్లులేని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు దక్కేలా పోరాడి సాధించిందన్నారు. ఆల్వాల్ మండలంలోని భగత్‌సింగ్ నగర్, భూపేష్ నగర్, నారాయణరెడ్డి నగర్, నిర్మలానగర్, కౌకూర్, భరత్‌నగర్ ప్రాంతాల్లో వేలాది మందితో గుడిసెలు వేయించటమే కాక వాటికి ఇళ్ల పట్టాలను సైతం ఇప్పించిన ఘనత సిపిఐదేనన్నారు. నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల లాంటి విషయాల్లో ముందుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల పట్ల ఆందోళనలు చేసి ప్రజల వెన్నంటి ఉందన్నారు. పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల కోసం పోరాటానికి సిద్దంగా ఉండాలన్నారు. ఈ నెల 25న ఇసిఐఎల్ సమీపంలో జరిగే జిల్లా మహాసభలో 400మంది ప్రతినిధులతో సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ఎన్నికంటి సత్యం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విఎస్ బోస్ తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఆగస్టు 19 నుండి 22 వరకు నాలుగు రోజుల పాటు కుత్బుల్లాపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. సిపిఐ సహాయ కార్యదర్శిలు దామోదర్‌రెడ్డి, టి. శంకర్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కె.రవి చందర్, బి.నరేంద్రచారి, రైతు సంఘం నాయకులు జంగయ్య, ఎన్.నర్సింలు, సిపిఐ ఆల్వాల్ మండల సహాయ కార్యదర్శి పి.చంద్రయ్య, సల్మాన్ బేగ్, యాప్రాల్ శాఖ కార్యదర్శి వై. వెంకటేష్ తదితరులు ఈ సభలో పాల్గొన్నారు. అనంతరం ఆల్వాల్ మండల నూతన కమిటి ఎన్నికలో 21 మంది కౌన్సిల్, 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు.

## బాచుపల్లిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ కీ॥ శే రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమలవేసి ఘన నివాళుల్పించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే నని అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికి మరవలేమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్, ఎన్ఎంసి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్, మహిళ అధ్యక్షురాలు కడియాల ఇందిర మరియు డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**అల్వాల్‌లో**

దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీ నేనని అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ ఏ బ్లాక్ అధ్యక్షులు అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీ కాంత్ రెడ్డి, సీఎల్ యాదగిరి, సూర్య కిరణ్, టిఎస్ సంజీవ్ కుమార్, సురేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి, కృష్ణ గౌడ్, ఉదయ్ కుమార్, నాగేశ్వరరావు, బలవంత రెడ్డి, రాజసింహారెడ్డి, వీనస్ మేరీ, బబిత, నిర్మల, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



**దుండిగల్‌లో**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు.

అనంతరం దివంగత మాజీ ప్రధాని ఆధునిక భారత నిర్మాత, యువ రాజకీయానికి నవ మార్గదర్శి స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు స్మరించుకున్నారు.

## వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** వర్షాలతో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ సూచించారు. బుధవారం మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యం తుకాలను పరిశీలించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల పరిధిలోని అన్నదాతలు మార్కెట్‌కు తీసుకువచ్చి ధాన్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దలకు తీసుకువచ్చే సమయంలో, మార్కెట్‌లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ధాన్యం తీసుకువచ్చిన రైతులకు తగిన మౌలిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కాంటాలు వేసిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ సూచన మేరకు మరో మూడు రోజుల పాటు వర్షం కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయని, అన్నదాతలు ధాన్యం ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకొని మార్కెట్‌కు తరలించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించుకునేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

## మణికొండలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



**ప్రజాపక్షం/గండిపేట:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల హిల్స్ కాలనీలో కొందరు పార్కు స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మించారు. ఈ విషయాన్ని కాలనీవాసులు హైడ్రా కమీషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం పార్కు స్థలాన్ని పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను ఆదేశించారు.. బుధవారం టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి భారీ పోలీస్ బంధవస్తు మధ్య ప్రహరీ గోడలను నేలమట్టం చేశారు. అక్రమ నిర్మాణాల తొలగింపునకు స్పందించిన అధికారులకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు. కూల్చివేతలో మణికొండ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ సిబ్బంది పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలతో నేరాల అదుపు

కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హస్తినాపురం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో సిసి కెమెరాలు, కాలనీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి బుధవారం అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాత నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిసి కెమెరాలతో నేరాలను అదుపు చేయడం, దొంగతాలకు తావునివ్వకుండా తగ్గిన జాగ్రతలు తీసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాలనీ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు దెంది శశిధర్‌రెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, సతీష్ గౌడ్, నరసింహ, జనార్ధన్, యాదయ్య, కాలనీ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోల్సం అమర్‌నాథ్ యాదవ్, మంద ప్రవీణ్, రాహుల్, సాగర్, విష్ణువర్ధన్, బద్రి, కృష్ణ, మంద శ్రీనివాస్‌రెడ్డి, మంకాల శేఖర్‌రెడ్డి, ఐలేష్ గౌడ్, అల్వాల్ గౌడ్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసు ఛేదించిన పోలీసులు అభినందించిన డిజిపి జితేందర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** హత్య కేసును త్వరగా ఛేదించిన నేపథ్యంలో షాద్‌నగర్ ఏసిపి రంగస్వామితోపాటు బృందాన్ని తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ ప్రత్యేకంగా అభినంధించారు. బుధవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏసిపి రంగస్వామితో పాటు బృంధాన్ని అభినంధించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును త్వరగా ఛేదించిన నేపథ్యంలో ఏసిపి రంగస్వామితోపాటు అప్పటి సిఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, హోంగార్డు పాండులను అభినంధించారు.

## రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌కెపురం డివిజన్ పరిధిలోని వాసవికాలనీ రాజీవ్‌గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మదుసూదన్‌రావు, శేఖర్‌ముదిరాజ్, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ తల్లాటి రమేష్‌నేత, వెంకటేష్‌గుప్త, పెద్దపూర సైదులు, మహేందర్, లింగస్వామిగౌడ్, యాదవరెడ్డి, మామిడి రామకృష్ణగౌడ్, ప్రేమ్ నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తా



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతున్నట్లు చైతన్యపురి డివిజన్ కార్పోరేటర్ రంగ నర్సింహగుప్త అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ప్రభాత్‌నగర్‌లో కాలనీ ప్రజలతో కలిసి కార్పోరేటర్ పర్యటించి పార్కు, కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో చెత్త సమస్యతో పాటు చెట్ల కొమ్మలు, చెట్ట మొద్దులను రెండు రోజుల్లో తొలగించాలని పరిశుభ్రం చేయాలని సంబందింత అధికారులతో, డిప్యూటీ కమీషనర్ సుజాత కు వెల్లడించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, జవాన్ రమేష్, హర్టికల్చర్ సత్యనారాయణ, కాలనీ వాసులు రాజగోపాల్, నర్సింహరావు, రఘురాం, మూర్తి, రామారావు, శంకర్, మదుయాదవ్, రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్, నవీన్‌యాదవ్, రమణ, కుల్దీప్, కన్నా పాల్గొన్నారు.

## తలసేమియా బాధితులకు కామినేనిలో ఉచిత వైద్యసేవలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** తల్లిదండ్రుల్లో తలసేమియా మైనర్ ఉంటే తమ పిల్లలకు కూడా వ్యాపించే అవకాశాలు ఉన్నాయని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాల మీదకు తెచ్చే ఈ వ్యాధిని సరైన సమయంలో గుర్తించి వ్యాధి భారిన పడకుండా పిల్లలను కాపాడుకోవచ్చు అని పిల్లల వైద్యనిపుణులు సీనియర్ పీడియాట్రిషియన్ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్.నరసింహరావు అన్నారు. బుధవారం ఆయన మాటాడుతూ తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి, పిల్లలకు తలసేమియా సంబందిత పరిక్షలు చేసేందుకు నగరంలోని కామినేని ఆసుపత్రిలో ఉచిత హెమటాలజీ శిభిరాన్ని ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో డాక్టర్‌లు కంచన్ ఎస్.చన్నావర్, ఎస్.జయంతి, ఎం.శ్రీనివాస్, అనీ క్యూ హసన్, శ్రీలత కొమాండూర్, ఎన్.వివేకానంద్, అన్నె పునీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నేతల విగ్రహాల

# ముసుగులు తొలగేనా?

జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో
దశాబ్దకాలంగా కొనసాగుతున్న విగ్రహాల వివాదం
తొలగించి, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయం
నేడు జిహెచ్‌ఎంసి స్థాయిసంఘానికి ప్రతిపాదన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) టప్రధాన కార్యాలయంలో దశాబ్దకాలంగా కొనసాగుతున్న మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిల విగ్రహాల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2010 సంవత్సరంలో విగ్రహాల ఏర్పాటు అంశం వివాదస్పందం కావడంతో వాటికి ముసుగులు వేశారు. కార్యాలయం ప్రవేశం వద్ద అప్పటి నుంచి మూడు విగ్రహాలు ముసుగుతో దర్శనమిస్తున్నాయి. ఈసారైనా ఈ వివాదానికి తెరదించుతురా? లేదా? అనే విషయం ప్రస్తుతం ఆసక్తిగా మారింది. దశాబ్దకాలంగా నడుస్తున్న విగ్రహాల వివాదానికి ముగింపు పలకాలని గ్రేటర్ హైదరాబాద్ నగరమేయర్ గద్వాల్ విజయలక్ష్మి నిర్ణయించారు. ఈ మేరకు మేయర్ విజయలక్ష్మి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌తో సమలోచనలు జరిపినట్లు సమాచారం. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని విగ్రహాలను నగరంలోని వివిధ గౌరప్రదమైన ప్రాంతాలలో ఏర్పాటు చేసేందుకు ఇరువురు అంగీకరానికి వచ్చినట్లు తెలిసింది. విగ్రహాల స్థానంలో పౌంటేన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం జరగనున్న జిహెచ్‌ఎంసి స్థాయిసంఘం సమావేశంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా స్థాయిసంఘం సమావేశ ఎజెండాలో ఈ అంశాన్ని పొందుపర్చారు. స్థాయిసంఘం సమావేశంలో తీసుకునే నిర్ణయంపై విగ్రహాల తరలింపు అంశం తెలిపోనుంది.

**2010లో వైఎస్‌ఆర్ విగ్రహం ఏర్పాటు చేసిన కార్తీక రెడ్డి ...**

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అప్పటి మేయర్ బండ కార్తీక రెడ్డి నిర్ణయించారు. రూ.18లక్షల వ్యయంతో జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రవేశ ద్వారం ముందు ఏర్పాటు చేశారు. ఈ నిర్ణయాన్ని జిహెచ్‌ఎంసి పాలకమండలిలో బలంగా ఉన్న టిడిపి కార్పొరేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. టిడిపితో పాటు బిజెపి కార్పొరేటర్లు సైతం కార్యాలయాల్లో విగ్రహాల ఏర్పాటు చేయవద్దు అనే నిబంధనలు ఉన్నాయని, తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. టిడిపి కార్పొరేటర్లు వైఎస్‌ఆర్ విగ్రహానికి ఇరువైపులా మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. రాజకీయ దుమారంతో వైఎస్‌ఆర్ మొదటి వర్ధంతి రోజున విగ్రహావిష్కరణ చేయాలని భావించిన బండ కార్తీక రెడ్డి లక్ష్యం అమలుకు నోచుకోలేదు. పలు పర్యాయాలు విగ్రహావిష్కరణకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. టిడిపి, బిజెపిలు బలంగా అడ్డుకున్నాయి. దీంతో ఈ మూడు విగ్రహాలకు అధికారులు ముసుగులు తొడిగించారు. అప్పటి నుంచి పాడైన ముసుగులను తొలగించడం, కొత్త వాటిని తొడిగించడంతోనే సరిపెడుతున్నారు.

## డిసిఎం, కారు ఢీ ముగ్గురు యువకులు దుర్మరణం



**హైదరాబాద్ :** అతి వేగంతో కారు డిసిఎంను ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం ఉదయం హయత్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.... పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్‌కు చెందిన పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు చంద్రసేనారెడ్డి(24) డిగ్రీ పూర్తి చేశాడు. చుంచు జంగారెడ్డి కుమారుడు చుంచు వర్శిత్‌రెడ్డి(23) విద్యార్థి, చుంచు శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు చుంచు త్రినాధ్‌రెడ్డి(24), ఎలిమినేటి శ్రీనివాస్‌రెడ్డి కుమా రుడు పవన్ కళ్యాణ్‌రెడ్డి(24) నలుగురు కలిసి స్కోడా కారు ఎంహెచ్ 02 డిజి 0771లో మంగళవారం రాత్రి పెద్ద అంబర్‌పేట్‌లోని ఓ రిసెప్షన్‌కు వెళ్లారు. తిరిగి అక్కడి నుండి ఉప్పల్ నారపల్లిలో ఉన్న వ్యవసాయ క్షేత్రం వద్ద రాత్రి గడిపారు. బుధవారం ఉదయం తెల్లవారుజామున నారపల్లి నుండి కుంట్లూర్‌కు ఇంటికి తిరుగు ప్రయాణంలో కుంట్లూర్ వద్ద అతి వేగంతో డిసిఎం టిఎస్ 07 యుకె 2664 కుంట్లూర్ నుండి పసుమాములకు వెళుతున్న డిసిఎంను ఢీకొట్టడంతో కారులో ఉన్న చంద్రసేనారెడ్డి, వర్శిత్‌రెడ్డి, త్రినాథ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాల పాలైన పవన్‌కళ్యాణ్‌రెడ్డిని హయత్‌నగర్ సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వారసులను కోల్పోయిన మూడు కుటుంబాల సభ్యులు గుండె పగిలేలా రోదించడంతో అందరిని కంటతడి పెట్టించాయి. రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, భువనగిరి మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ మృతుల కుటుంబాలను పరామర్శించారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** గౌతమి నగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్‌లోని గౌతమి నగర్ కాలనీ సంక్షేమ సభ్యులు కార్పొరేటర్‌ను వారి నివాసంతో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ త్వరలోనే కాలనీల్లో పర్యాటించి కాలనీ సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ నూతన అధ్యక్షులు సుధాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కిషన్, కోశాధికారి సాయి బాబా, ఉపాధ్యక్షులు రాజు, నారాయణరావు, సహాయ కార్యదర్శులు గోపిచంద్, హరిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కరుణాకర్, పిహెచ్ రెడ్డి, రవికుమార్, కార్యవర్గ సభ్యులు భాస్కర్ గౌడ్, జగన్, శ్రీరామ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన రాజీవ్

టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** దేశంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన మహోన్నత వ్యక్తి దివంగత నేత భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ అని టియుఎఫ్ఐడిసి చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి కొనియాడారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సభను రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో మందమల్లమ్మ చౌరస్తాలోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని, ఆధునిక భావాలు, నిర్ణయాత్మక శక్తి కలిగిన రాజీవ్‌గాంధీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాని అని ప్రపంచంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో మీర్పేట్ కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ చల్లా కవిత బాల్ రెడ్డి, సిద్దాల శ్రీశైలం గౌడ్, రామచందర్, నిమ్మల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



**ప్రజాపక్షం/యాచారం :** ఉపాధికూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30 న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. అంజయ్య అన్నారు. బుధవారం యాచారం మండల పరిధిలోని మల్కీజ్‌గూడ గ్రామంలో ఉపాధికూలీలతో అయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధికూలీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హమి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు పుచ్చల పల్లి సుందరయ్య 1930 లో సంఘం పెట్టారని తెలిపారు. ఉపాధి కి గ్యారంటి చట్టం కావాలని అనాధికాలంగా పోరాటం నిర్వహిస్తున్నామన్నారు. పోరాడి సాధించుకున్న చట్టం ఉపాధి హమీ చట్టమని తెలిపారు. చట్టాన్నికాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ముట్టడి కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రాజీవ్‌గాంధీ ఘననివాళి



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో నిర్వహించారు. బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి డా.కోట నీలిమ నియోజకవర్గ పరిధిలోని ఐడిహెచ్ కాలనీ (బన్సీలాల్‌పేట్), బుద్ధనగర్, అమీర్‌పేట్, సనత్‌నగర్ పార్టీ కార్యాలయం, నెహ్రూ పార్కు సమీపంలో రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల నెరవేర్చాలన్నదే లక్ష్యం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట:** ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మణికొండ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన నివాసం వద్ద మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్‌తో కలిసి 16 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశాఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు ఇల్లు కట్టుకొని సొంత నివాసంలో ఉండాలన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు వస్తాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులను పరామర్శించని సిఎం : టిడిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే పదేళ్లపాటు తమే అధికారంలో ఉంటామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడం హాస్యస్పందంగా ఉందని టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గుల్జార్ హౌజ్‌లో అగ్నిప్రమాదం జరిగితే సిఎం బాధితులను పరామర్శించలేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, ఎస్.ప్రకాష్, కిరణ్, తడక వినోద్ పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా హామీలు అమలు



ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



దేశానికి సాంకేతికత ఘనత రాజీవ్‌గాంధీదే

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రణాళిక బద్ధంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను త్వరగా చేపట్టి పూర్తి చేసేందుకు కృషి చేయాలని లబ్దిదారులకు సూచించారు. అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రభుత్వం నుండి నేరుగా లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలోనే జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.

దేశానికి శాస్త్ర సాంకేతిక రంగాన్ని తీసుకువచ్చిన ఘనత దివంగత రాజీవ్ గాంధీదేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దూరదృష్టితో తీసుకువచ్చిన సంస్కరణలతో నేడు పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయ న్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, బస్వం, చెంది తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రఘునాయక్, జమృధ్‌ఖాన్, అందె మోహన్, వంశీ, హరినాథ్‌రెడ్డి, ఇబ్రహీం, మురళి, ప్రవీణ్, రాజేష్‌గౌడ్, ఖదీర్, మాధవులు, అర్జున్, సీతారాములు, నవీన్, నీరటి వాసు పాల్గొన్నారు.

## కృష్ణమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ ప్రజాసంఘాల నేతలు

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** ఐఎన్‌టియుసి (ఆర్) జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ ప్రజాసంఘాల నేతలు జై బి.రాజు, సత్యం, పోకల కిరణ్, నాగుల శ్రీనివాస్ యాదవ్, జేమ్స్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. 15 ఏళ్లుగా కార్మికవర్గంలో ముఖ్యంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కృష్ణమూర్తికి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణచూసి ఓర్వలేకనే ఆయనపై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. కృష్ణమూర్తిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు భూదాల అమర్‌బాబు, గొల్లపల్లి దయానంద, నాగరాజు, కృష్ణగౌడ్, జనార్దన్, బండారు శైలజ, పి.అరుణ, జ్యోతి, సత్యదేవ్ తదితరులు పాల్గొన్నారు.



ఫోకస్

# కళా రంగం

## అంతరిస్తున్న కళారూపాలు



ఒక దేశపు సంస్కృతి, చరిత్ర, ప్రజల జీవనశైలులు, భావజాలాలను అద్దంలా ప్రతిబింబించే ప్రధాన సాధనాల్లో కళ ప్రథమమైనది. మనిషి ఉనికిలో మొదటి అక్షరంగా రూపుదిద్దుకున్న కళ, కాలక్రమేణా అనేక మార్పుల వల్ల అనేక రూపాలను సంతరించుకుంది. అయితే ఈ రోజుల్లో ఎన్నో సంప్రదాయ కళారూపాలు మన కళ్ల ముందే మాయమవుతున్నాయి. అవి కేవలం కళలుగా కాక, ప్రజల జీవిత గాథలుగా, వారి ఆశయాల పరిపాట్లుగా కూడా గుర్తింపు పొందినవే. కళ.. ఒక సామాజిక ఆవిష్కరణ. ప్రాచీన కాలం నుండి మనిషి భావోద్వేగాలను, అనుభవాలను, జ్ఞాపకాలను ఇతరులకు తెలియజేయడానికి కళను ఓ సాధనంగా ఉపయోగించుకున్నాడు. మొదట గుహా చిత్రాల రూపంలో ప్రారంభమైన కళా ప్రక్రియ, నాట్యకళ, సంగీతం, శిల్పకళ, వాచిక కళలు, దృశ్యకళలు వంటి అనేక రూపాలుగా విస్తరించింది. ఈ కళలన్నీ ఒక సమాజపు జీవనవిధానానికి ప్రత్యక్ష ఉదాహరణలుగా నిలిచాయి. ఇప్పటికీ మన గ్రామీణ ప్రాంతాల్లో, జానపద వూర్లలో కొన్ని కళారూపాలు జీవించి ఉన్నప్పటికీ, అవి కాలబాధితమవుతున్నాయి. అంతరించి పోతున్న కళారూపాల్లో ప్రధానమైనవి ప్రదర్శన కళలు. బుర్రకథ తెలంగాణ ప్రాంతంలో ప్రాచుర్యం పొందిన ఈ కథా కళా రూపం. ఇప్పుడు కేవలం పండుగలకే పరిమితమైంది .తిరుకూతు అనేది తమిళనాడులో ప్రజల నైతిక బోధనకు ఉపయోగపడే ఈ కళ ఇప్పుడు కనుమరుగవుతోంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించిన ఈ రూపం యక్షగానం. యువతలో ఆసక్తి తగ్గడం వల్ల మరుగున పడుతోంది. మట్టి బొమ్మలు, చెక్కబొమ్మలు, గాజు శిల్పాలు వంటి కళలు అధునిక యంత్ర సాంకేతికత వల్ల తమ ఉనికిని కోల్పోతున్నాయి. మధుబనీ, పటచిత్ర, కలంకారి వంటి సంప్రదాయ చిత్రలేఖనం ఇప్పుడు పోటీ ప్రపంచంలో నిలబడలేకపోతున్నాయి. జానపద సంగీతంజానపద గేయాలు, గ్రామీణ భక్తిగీతాలు తదితరాలన్నీ డిజిటల్ సంగీత స్రవంతుల్లో కొట్టుకొనిపోతున్నాయి. ఈ కళారూపాల నశనం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. ఆధునికీకరణ ప్రభావం ప్రధాన కారణం. సాంకేతిక విజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందడంతో పురాతన కళలు అసంపూర్తిగా లేదా పురాతనంగా భావింపబడుతున్నాయి. నేటి యువత వెబ్‌సిరీస్‌లు, డిజిటల్ గేమింగ్, సోషల్ మీడియా వంటి ఆధునిక వినోదాలకు అలవాటు పడటం వల్ల సంప్రదాయ కళల పట్ల ఆసక్తి తగ్గింది. జీవనోపాధికి అసాధ్యతసంప్రదాయ కళలతో జీవించలేమనే భావన వల్ల కళాకారులు ఇతర ఉపాధులవైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ మద్దతు లోపంఒక్కొక్కసారి ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, నిధుల కొరత, స్థిర ప్రదర్శన వేదికల లేకపోవడం కూడా కీలకంగా నిలుస్తున్నది. ఈ కళల అంతరించడంలో సమాజానికి కలిగే నష్టాలు ఎన్నో... కళల ద్వారా పొందే చారిత్రక సమాచారం పూర్తిగా కనుమరుగవుతుంది. భాషల సంపద తగ్గిపోతుంది. చాలా కళలతో భాషల పరిరక్షణ జరుగుతుంది. అవి పోవడం అనగా భాష నశనం కూడా. కళల ద్వారా మన సంప్రదాయ విలువలు వెల్లడవుతాయి. అవి పోతే మన మూలాలను మరచిపోతాం. సృజనాత్మకతకు గుణాత్మక హానితప్పడం లేదు. కళలు ఒక మానవుడి ఆలోచనా శక్తికి పదును పెడతాయి. అవి లేకపోతే ఆలోచనల పరిమితి తగ్గిపోతుంది. కళల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక నిధుల ఏర్పాటు చేయాలి. కళాకారులకు పదవులు, అవార్డులు, ఆర్ట్స్ స్కూల్స్, జానపద కళాశాలలు స్థాపన జరగాలి. విద్యా వ్యవస్థలో కళలకు స్థానం కల్పించాలి. జానపద కళలను పాఠ్యాంశాల్లో చేర్చడంవిద్యార్థుల్లో కళల పట్ల ఆసక్తిని పెంపొందించడం. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రచారంయూట్యూబ్, సోషల్ మీడియా, డాక్యుమెంటరీల ద్వారా కళల ప్రదర్శనకళాకారులకు సొంత చానల్స్ ప్రారంభించి ఆదాయం లభించేలా చేయాలి. యువతను ప్రోత్సహించడంవారసత్వ కళల్లో శిక్షణ ఇవ్వడంకళల మీద ఆధారిత స్టార్టప్‌లు, డిజైన్ కంపెనీల స్థాపన జరగాలి. అప్పుడే కళారూపాలకు ఊతం.. కళాకారులకు జీవితం.

## ప్రపంచంలో అతి చిన్న రంగస్థలం



ప్రపంచంలో అతి చిన్న రంగస్థలం 'క్రెమ్లిన్ థియేటర్ ఇన్ ది కప్‌బోర్డ్', జర్మనీలోని బ్రెమెన్‌లో ఉంది. ఈ రంగస్థలానికి 'అతి చిన్న పూర్తి స్థాయి థియేటర్'గా గిన్నీస్ వరల్డ్ రికార్డు 2014లో లభించింది. జర్మనీ కళాకారుడు జెన్స్ జె. జిర్కే దీనిని నెలకొల్పాడు. ఈ రంగస్థలం విస్తీర్ణం పొడవు 1.60 మీటర్లు, వెడల్పు 1.20 మీటర్లు. కేవలం 2 నుంచి 3 మంది మాత్రమే ప్రేక్షకులు ఇక్కడ ప్రదర్శనలు తిలకించే అవకాశం ఉంది. ఒక పాత అల్మారాను రంగస్థలంగా మార్చడం విశేషం. చిన్న స్క్రీన్‌లా ఉండే తలుపులు తెరిచి, ఆ లోపల మినియేచర్ రంగస్థలం ఏర్పాటు చేశారు. మినీ లైటింగ్, సౌండ్ సిస్టమ్, మానికిన్‌లు ఉన్నాయి. కళకు పరిమితులు లేవని ఈ వేదిక నిరూపించింది. కళకు పరిమిత స్థలమో, శబ్ద వ్యవస్థలమో అవసరం లేదని, వ్యక్తిత్వంతో కూడిన, ప్రామాణికతతో నిండిన నాటికలు కూడా కళగా నిలవవచ్చని రుజువు చేసింది. ఇద్దరు లేదా ముగ్గురు ప్రేక్షకులు రంగస్థలం ముందు కూర్చొని నేరుగా ప్రదర్శనను ఆస్వాదించవచ్చు. ఇది వ్యక్తిగత అనుభూతిని పెంచుతుంది. ఈ రంగస్థలాన్ని ఒక అల్మారిలా ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు, తిరిగి ప్రదర్శనకు సిద్ధంగా ఉంచవచ్చు. అతి చిన్న వేదిక ద్వారా కళలో కొత్త ప్రయోగాలకు దారి చూపుతున్నది. చిన్న వేదిక కళాకారుడు, ప్రేక్షకుల మధ్య సన్నిహిత అనుభవాన్ని కలిగిస్తుంది. చిన్న ప్రదేశాల్లో కళాభివృద్ధి సాధ్యమన్న భావనను కలిగిస్తుంది. భారీ ఖర్చులు లేకుండా చిన్న ప్రదేశాల్లో కూడా రంగస్థలాన్ని ఏర్పాటు చేయవచ్చని చక్కటి ఉదాహరణ. భారతదేశంలో కూడా పలు చిన్న చిన్న వేదికలు ఉన్నాయి. పెద్దలు వినిపించే పిల్లల నాటికలు (ఫింగర్ పపెట్స్,) కూచిపూడి, కథకళి వంటి నృత్య ప్రదర్శనలు ఈ చిన్న వేదికలపై జరుగుతుంటాయి. కళ అనేది ఆకారంతో కాకుండా భావంతో జీవిస్తుంది. చిన్నదైనా ఎంతో గొప్పదిగా నిలిచే కళా రంగస్థలం ఇది. ఈ రంగస్థలం ద్వారా మనం నేర్చుకోవలసిన విషయం – పరిమితులు సృజనశీలతను ఆపలేవు. ఆలోచన గొప్పదైతే, వేదిక ఎంత చిన్నదైనా ప్రపంచాన్ని తాకుతుంది.

## ఇండోనేషియాలోనూ తోలు బొమ్మలాట!





ఒకప్పుడు విశేష ఆదరణ పొంది, క్రమంగా కనుమరగవుతున్న తోలుబొమ్మలాట కేవలం మన దేశానికి మాత్రమే పరిమితమనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. కానీ, దీనిని ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో, వివిధ పేర్లతో ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా ఆసియా దేశాల్లో తోలుబొమ్మలాటకు ప్రత్యేక స్థానం ఉంది. ఇండోనేషియాలో దీనిని 'వయాంగ్ కులిట్' అంటారు. ప్రపంచంలో అత్యంత పాతదైనదేగాక, సాంప్రదాయ బద్ధమైన కళారూపాల్లో 'వయాంగ్ కులిట్' ఒకటి. ఇది ఇండోనేషియాలో, ప్రధానంగా జావా, బాలీ ద్వీపాలలో ఎక్కువగా ప్రాచుర్యం పొందింది. 'వయాంగ్' అంటే 'ఛాయ' లేదా 'నీడ'. కులిట్ అంటే 'తోలు' లేదా 'చర్మం'. నీడగా రూపాలను కలిగిన తోలుబొమ్మలతో ఆడించే నాటకమే 'వయాంగ్ కులిట్'. ఈ కళ రూపం ఆధ్యాత్మికత, సంగీతం, నాట్యం, కథా విన్యాసం, కళల సమ్మేళనంగా నిలుస్తుంది. దీనిద్వారా పలు ఇతిహాసాలు, జావనీస్ కథలు ప్రజలకు అందుతాయి. ఈ కళను 'అవ్యక్త సాంస్కృతిక వారసత్వ' (Intangible Cultural Heritage'గా యునెస్కో 2003లో గుర్తించింది. వయాంగ్ కులిట్ యొక్క మూలాలు 9వ శతాబ్దానికి చెందుతాయి. హిందూబౌద్ధ ప్రభావం ఉన్న కాలంలో జావా ద్వీపానికి చెందిన రాజవంశాలు భారతీయ సంస్కృతి నుంచి గొప్పగా ప్రభావితమయ్యాయి. ఈ ప్రభావంతో పలు ఇతిహాస కథలు స్థానిక కథలతో కలిసి నాట్య రూపం పొందినాయి. వయాంగ్ కులిట్ స్థానికంగా జావనీస్ భాషలో ప్రదర్శిస్తారు. ముస్లిం రాజ్యాల అనంతరం కూడా ఈ కళ రూపం కొనసాగుతూ, ఇస్లామిక్ తత్వాలను కూడా స్వీకరించి జీవించగలిగింది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఈ కళ ప్రజలకు వినోదంగా, విద్యగా ఉపయోగపడుతున్నది. వయాంగ్ బొమ్మలు సాధారణంగా ఎద్దు తోలుతో చేస్తారు. వాటిని ఎంతో శ్రమతో చెక్కి, గొప్పగా అలంకరిస్తారు. ప్రతి బొమ్మా ఒక ప్రత్యేకమైన పాత్రను సూచిస్తుంది. వీటిలో దేవతలు, రాక్షసులు, రాజులు, సాధువులు మొదలైన బొమ్మలు ఉంటాయి. దలాంగ్ అనేది నాటకం చెయ్యే వ్యక్తి పేరు. అతనే బొమ్మలు కదిలించే వాడు. అన్ని పాత్రలకు గళం ఇస్తాడు. కథను కొనసాగిస్తాడు. కాగా, గమెలాన్ సంగీతాన్ని నడిపించేవాడు. దలాంగ్ పాత్ర అత్యంత కీలకమైనది. అతడు తత్త్వజ్ఞానాన్ని, నైతిక బోధనను, హాస్యాన్ని సమతుల్యంగా సమర్పించాలి. ఈ కళకు గమెలాన్ సంగీతం ఎంతో ముఖ్యమైనది. ఇది ప్రత్యేకమైన సంగీత వాయిద్యాల సమూహం. గాంగ్స్‌మెటలోఫోన్లు, డ్రమ్స్, ఫ్లూట్లు వాడతారు. పాటలు జావనీస్, బాలినీస్ భాషలలో ఉంటాయి. వయాంగ్ ప్రదర్శనలో ఒక తెల్లటి తెర వెనుక, ఒక దీపం వెలుగులో బొమ్మల ఛాయలు కనపడతాయి. ఇది ప్రేక్షకులకు నిజమైన మాయాలోకంలా అనిపిస్తుంది. వయాంగ్ కులిట్ కథలు మూడు ప్రధాన విభాగాల్లో వర్గీకరిస్తారు. వయాంగ్ పుర్వ రామాయణ, మహాభారత ఇతిహాసాల ఆధారంగా ఇది కొనసాగుతుంది. మానవ జీవిత సత్యాల గురించి చర్చించే కథలు చెప్తుంది. వయాంగ్ మాద్యా జావనీస్ రాజవంశాల మీద ఆధారపడిన కథలు. వయాంగ్ గోల్ అనేది 3డి బొమ్మలతో సాగే ప్రదర్శన. పశ్చిమ జావాలో ఇది బాగా ప్రాచుర్యం పొందింది. వయాంగ్ కులిట్ కళ రూపం ఇండోనేషియా సంస్కృతిలో పునాది వంటిది. దీని ద్వారా, తాత్వికత, జీవితం, నైతిక విలువలు, ధర్మం వంటి భావనలు వినోదం రూపంలో చెప్తానరు. పిల్లలకు పాఠశాలలలో ఈ కళ ద్వారా పాఠాలు చెప్పడం ఆనవాయితీ. ఇది యాజ్ఞ పరంగా కూడా వినియోగపడుతుంది. రాజకీయ, సామాజిక అంశాలపై వ్యంగ్యంగా ప్రదర్శనలు కూడా చాలా కాలం క్రితమే రంగ ప్రవేశం చేశాయి. కాగా, వయాంగ్ కులిట్ ఇప్పుడు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నది. టీవీ, ఇంటర్నెట్, సోషల్‌మీడియా ప్రభావంతో యువత ఈ కళపై ఆసక్తి కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంతాల సంస్కృతి కనుమరుగవుతోంది. ప్రదర్శనలకు వీలులేకపోతున్నది. అంతేగాక, నూతన తరం దలాంగ్‌లు తగ్గిపోతున్నారు. శిక్షణ కేంద్రాలు తక్కువగా ఉన్నాయి. పర్యాటక ప్రదర్శనల కోసం అసలు తత్త్వం మరుగున పడుతున్నది. ఈ కళారూపం తన వాస్తవ రూపాన్ని కోల్పోతున్నది. పరిస్థితిని చక్కదిద్దడానికి ఇండోనేషియా ప్రభుత్వం వయాంగ్ కళను పాఠశాలలలో ప్రవేశపెట్టింది. ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోంది. యునెస్కో ఈ కళను ప్రపంచ వారసత్వంగా గుర్తించి, ఉనికిని కాపాడే ప్రయత్నం చేస్తున్నది. పలు దేశాల్లో ఈ కళా రూపాలను ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నది. యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలపై వయాంగ్ ప్రదర్శనలు లభిస్తున్నాయి. వయాంగ్ కులిట్ కళా రూపాన్ని మానవ జీవితం యొక్క ప్రతిబింబంగా పరిగణిస్తారు. మనిషి అంతర్గత సంకర్షణలు, ఆధ్యాత్మిక విజ్ఞానం అన్ని కలగలిసి ఉంటాయి. ఒక దలాంగ్ సమాజంలో గురువు, తాత్వికుడు, వినోదకుడు, విమర్శకుడు అనే రాలుగు కీలక పాత్రలు పోషిస్తాడు. ఈ కళను కేవలం వినోదంగా కాకుండా జీవన మార్గదర్శకంగా కూడా భావించవచ్చు. వయాంగ్ కులిట్ అనేది ఒక గొప్ప కళారూపం మాత్రమే కాదు.. అది ఒక జీవనశైలి. భారతీయ ఇతిహాసాలను తీసుకుని, స్థానిక జీవనానికి అన్వయిస్తూ, భావప్రాప్తిని అందించే కళ. ఇటువంటి సంప్రదాయ కళలను పరిరక్షించడం ప్రతి తరానికి బాధ్యత. వయాంగ్ కులిట్‌ను సంరక్షించుకోవాలంటే:విద్యా విధానంలో కలుపుకోవాలియువతను శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వం, యునెస్కో మద్దతు పెంచాలి. ప్రజలు కూడా తమ వంతు పాత్ర పోషించాలి. అప్పుడు వయాంగ్ కులిట్ వంటి కళారూపాలు బతికి ఉంటాయి. ప్రేక్షకులను అలరిస్తుంటాయి.

# సాగునీటి కష్టాలు తీరేందుకు 'సీతారామ'లో మార్పులు జరగాలి

- పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి
- అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు
- ఎంఎల్‌ఎ కూనంనేని
- రూ.4.49కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతాంగ సాగునీటి కష్టాలను తీర్చేందుకు, ఈ ప్రాంత రైతాంగానికి జిల్లా నీటి వనరులు ఉపయోగపడేలా సీతారామ ప్రాజెక్టు కాల్వల నిర్మాణం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం పాల్వంచ మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయితీల పరిధిలో రూ.4.49 కోట్ల నిధులతో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు శంకు స్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నాటి పాలకులు అనాలోచిత నిర్ణయాలతో గోదావరి జలాలు ఈ జిల్లా ప్రజలకు అందకుండా పోయే ప్రమాదం ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి జిలాల్లోని ఐదు నియోజకవర్గాలకు సాగు నీరు అందించాలని, కొత్తగూడెం నియోజకవర్గానికి అధిక సాగునీటిని అందించాలన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని పలుమార్లు ముఖ్యమంత్రి, ఇరిగేష్ మంత్రి దృష్టికి తీసుకళ్లామని, నీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పట్టణాలకు ధీటుగా గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గల్లీకి రహదారులు, డ్రైన్లు నిర్మాణానికి ప్రణాళికతో నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. అతిత్వరలో చిన్న చిన్న గల్లీల్లో కూడా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మండల పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల నాణ్యతతో పదికాలాల పాటు ఉండేలా చేపట్టాలని, అందుకు అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్మాణాల్లో లోపాలు చోటు చేసుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. నిర్మాణ పనులు నాణ్యతను ప్రజలు పర్యవేక్షించాలన్నారు. వివిధ పథకాల గ్రాంట్లు ద్వారా అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని, మిగతా వాటికి కోసం ప్రతిపాదనుల సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నియోజకవర్గ సమస్యలను పరిష్కరించుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి తాను అను నిత్యం అందుబాటులో ఉంటానని ఎంఎల్‌ఏ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహశిల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓ విజయ్‌భాస్కర్ రెడ్డి, పంచాయితీరాజ్ డిఇ రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, టిడిపి నాయకులు కొనగాల అనంతరాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, నాయకులు నాగరాజు, శ్రీనివాసరావు, వెంకన్న వీరమోహన్ రావు, గిరి, రాంబాబు, వెంకట్రావు, డిఇలు, ఏఇలతో పాటు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని మోదీ

పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి : ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని రిలయన్స్, ఆదాని, అంబా నీలకు కట్టబెడుతూ ప్రైవేట్ పరం చేయడం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఆరోపించారు. మర్రిగూడ మండల సిపిఐ కౌన్సిల్ సమావేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌సి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడుతూ సామాన్యు లు, పేదలు వాడే నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి పెట్రోలు డీజిల్ గ్యాస్ ధరలను జిఎస్‌టి పేరుతో పన్నులు వే స్తూ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని విమర్శంచా రు. కార్మికులు సాధించుకున్న చట్టాలను మార్పులు చేస్తూ కార్పొరేట్ వర్గాలకు వత్తాసు పలుకుతున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు జులై 9న సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బిసి, డిండి లిఫ్ట్ ఇరిగేష న్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి జిల్లా ప్రజలకు తాగు, సాగు నీరందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభు త్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను గాలికొదిలేసిందన్నారు. ఎస్ఎల్‌బిసి, నక్కలగండి ప్రాజెక్టులను ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలో ఉందని, ప్రజా, రైతు ఆకాంక్షల మేరకు ప్రాజెక్టులను ప్రారంభించిన కాంగ్రెస్ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన కోరారు.రైతు భరోసా నిధులు విడుదల చేసి వర్షాకాలం పంటలకు రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని దీని మూలాన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం ఋతుపవనాలు ముందస్తుగా రావడంతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ధాన్యం కొనుగోలను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సురేష్, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు బుర్ర శేఖర్, కార్యవర్గ సభ్యులు ఎరుకలి నిరంజన్, కొండ్రెడ్డి గిరి, ఎరుకలి యాదయ్య, కౌన్సిల్ సభ్యులు వేముల సత్తయ్య, ఆకుల వెంకటరామ్, జక్కలి అంజయ్య కొమరయ్య, కృష్ణయ్య, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## ఫీజులను నియంత్రించాలి :ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఈ విద్యా సంవత్సరము ఫీజుల నియంత్రణ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పరిపాలన అధికారి జగన్మోహన్ గౌడ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు, కనీస మౌలిక సదుపాయా లు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలని కోరారు. జిఒ నెంబర్ 42 ప్రకారం ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్బన్‌లో, రూరల్‌లో ప్ర భుత్వ నిర్ణయించిన ప్రకారమే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఫీజులు తీసుకోవాలని చెప్పారు. జిఒ నెంబర్ 1,10,92,42 ప్రభుత్వ జిఒలను పగడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. డీజీ, ఒలంపియాడ్, ఈటెక్నో, ప్ర భుత్వ అనుమతి లేని తోక పేర్లను తొలగించాలని కోరారు. ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేసి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎఐఎస్‌ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో అనుమతులేని కనీస మౌలిక సదుపాయాలు లేని పాఠశాలల ముందు ప్ర త్యక్షంగా ధర్నాలకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఎఐఎస్‌ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, జిల్లా సమితి సభ్యులు రాంపాక చందు తదితరులు పాల్గొన్నారు.



## హనుమకొండ జిల్లా మహాసభలకు సిపిఐ జీపు జాతా

ప్రారంభించిన సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** మండల కేంద్రంలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే సిపిఐ జిల్లా 2వ మహాసభల విజయవంతం చేయాలని,అందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి కర్రే బిక్షపతి పిలుపు నిచ్చారు. బుదవారం హసన్‌పర్తిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిక్షపతి మహసభల జీపు జాతాను ప్రారంభించారు. ఈసందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ తప్ప మరెవరు న్యాయం చేయలేరని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ పుట్టి 100 సంవత్సరాల చరిత్రలో పేద ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా పేదల సమస్యలు, ముఖ్యంగా ఇండ్లు, ఇండ్ల స్థలాలు, సాగు భూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నడుపుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ అని దేశంలో పాలకులు మతం పేరుతో, కులం పేరుతో ప్రజలను విడదీస్తూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని వారు అన్నారు. సిపిఐ జిల్లా 2వ మహాసభల విజయవంతం కోసం జిల్లా వ్యాప్తంగా తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారులచే జీపు జాత, 3 రోజు ల పాటు జరగనుందని తెలిపారు. అదేవిధంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి. జ్యోతి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి, ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని అన్యాయం చేసారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రైతురుణమాఫీ పూర్తిగా ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ పారదర్శకంగా అర్హులైన పేదలకు అందించాలని,జిల్లాలో అసంపూర్తిగా ఉన్నా దేవాదుల ప్రాజెక్టును పూర్తిగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు నేదునూరి రాజమౌళి, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, నాయకులు ఎదునూరి వెంకట్రాజం, తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరెల్లి రవి, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టేపాక రవి, కళాకారులు భరత్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు అండగా కమ్యూనిస్టులు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/మునగాల:** కార్మిక, కర్షకుల మధ్య తరగతి జీవులకు అండగా నిలిచి కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మునగాల మండల కేంద్రంలో జరిగిన మండల మహాసభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. చట్ట సభల్లో సీట్లు ఉన్నా లేకపోయిన నిత్యం ప్రజల మధ్య నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులని అన్నారు. మునగాల పరగాణలో భూ సమస్యల పరిష్కారం కోసం, తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనలో వ్యతిరేకంగా పోరాటాలు చేసిన గడ్డ మునగాల పరగాణ అని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో దేశ సమగ్రతకు సమైక్యతకు కమ్యూనిస్టులు అంకితమై పనిచేస్తున్నారని, ఎలాంటి ప్రతిఫలాక్ష లేకుండా పనిచేస్తున్న లక్షలాది మంది కార్యకర్తల నుండే సిపిఐ 100 సంవత్సరాలుగా సజీవంగా ఉందని అన్నారు. అంతకు ముందు పార్టీ జెండాను గన్నా చంద్రశేఖర్ ఎగురవేశారు. సిపిఐ మండల కార్యదర్శిగా చిల్లంచర్ల ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చిల్లంచర్ల ప్రభాకర్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు రాఘవరెడ్డి, శ్రీను, రవి, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఎంపిడిఓ కార్యాలయంలో హరితహారం



**ప్రజాపక్షం/మక్తల్ :** సమీక్ష సమావేశంలో పాల్గొన్న స్థానిక శాసనసభ్యులు డా॥ వాకిటి శ్రీహరి ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ మన ఊరు మన పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ప్రతి పౌరుడు ఒక మొక్కను నాటి, సంరక్షించుకోవాలి అని అన్నారు. తద్వారా సకాలంలో వర్షాలు పడతాయని అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా ప్రతి ప్రభుత్వ ఉద్యో కొంత పరిధి వరకు బాధ్యతగా తీసుకొని మొక్కలను సంరక్షించుకోవలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలను ఎవరన్నా నరకడం కాల్చడం వంటివి చేస్తే వారి పై కఠినంగా వ్యవహరించాలని అటవీ శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, అటవీ శాఖ అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన యెన్నం



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** బుధవారం ఉదయం మహబూబ్ నగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి వర్షం కురిసిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహబూబ్ నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేతో పాటు టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి , డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఫయాజ్, అజ్మత్ అలి, సిజె బెనహార్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా తదితరులు ఉన్నారు.

## లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అధికారులు చర్యలు : కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వలన వర్షపు నీరు నిలిచి లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో షాషాబ్‌గుట్టలో వర్షపు నీటి కాల్వను నగరపాలక సంస్థ, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి పరిశీలించారు. రాబోవు వర్షాకాలంలో వర్షాల వలన ముంపు ప్రాంతాలు జలమయం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షపు నీటి నీల్వ కాల్వ మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాల వలన ప్రాణ, ఆస్తి, నష్టం లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి , పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటి ఈఈ మనోహర్ తదితరులు ఉన్నారు.

## ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం గాలింపు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుసుమూర్తి గ్రామ శివారులోని, భీమా నదిలో జింకల తిప్పన్న అనే రైతును ముసలి లాక్కెళ్ళగా జిల్లా ఎస్పి యోగేష్ గౌతమ్ బీమా నది పరిసరాలను పరిశీలించి అక్కడి అధికారులతో, ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఎన్‌డిఆర్‌ఎఫ్ నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు, ఫారెస్ట్ అధికారులకు, గజ ఈతగాళ్లు, లోకల్ పోలీసులు సంయుక్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. తనిఖీ నిర్వహించి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పి తెలిపారు. ఎస్పితో పాటు మక్తల్ సిఐ రామ్ లాల్, కృష్ణ ఎస్ఐ ఎస్.ఎం నవీద్, ఎమ్ఆర్ఓ కృష్ణ తదితరులు ఉన్నారు.

## నారాయణపేట్-మక్తల్-కొండగల్ ఎత్తిపోతల పథకం పూర్తిచేయాలి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే నారాయణపేట, మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పథకం వెంటనే పూర్తి చేయాలని జల సాధన సమితి జిల్లా కో కన్వీనర్ హెచ్ నర్సింహా బిజ్వార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజ్ఞప్తి చేశారు. ఈ ఎత్తిపోతలకు సంబంధించిన జిఒ 69 జారీ చేసి మే 23కు పదకొండు సంవత్సరాలు పూర్తి అయిన సాగునీరు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా చెందిన శాసనసభ్యులు ముఖ్యమంత్రి కావడం వలన ఈ ఎత్తిపోతల పథకం పూర్తి అవుతుందనే నమ్మకం జిల్లా రైతులకు ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో పూర్తి చేసి సాగునీరు ఇస్తాం అని చెప్పారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పైపులైన్ పనుల సర్వే పూర్తి చేసి భూమి తీసుకోవడం చాలా సంతోషం అన్నారు. ఈ ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించే రిజర్వాయర్లకు భూమి సరిహద్దులు గుర్తించి వెంటనే ఎత్తిపోత పథకం పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలని విజ్ఞాప్తి చేశారు. భూమి కోల్పోయిన రైతులక ఎకరాకు నలభై లక్షలు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ ఎత్తిపోతలకు సంబంధించిన డిపిఆర్ విడుదల చేసి జిల్లాలో ఏయే గ్రామాలకు ఎన్ని ఎకరాలకు సాగునీరు వస్తుందో తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తాయప్ప, చంద్రప్ప, చిన్న నర్సింహా, మహేష్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని మూడోవార్డు తిలక్‌నగర్‌కు చెందిన డేగరోళ్లఅంజి అనారోగ్యంతో మృతిచెందారు.మృతిచెందిన విషయాన్ని కార్మికసంఘం అధ్యక్షులు సూర్యప్రకాష్‌రావుద్వారా తెలుసుకున్న మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్ , బిఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పలవెంకటేష్ మృతుడి అంత్యక్రియలకు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణజాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోనిగణేష్, బిఆర్‌ఎస్‌పార్టీ సీనియర్ నాయకులు మధు, రాములు, నాగయ్య, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

**ప్రజాపక్షం/ఊర్కొండ :** నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో గణపతి, ధ్వజస్తంభ, నవగ్రహప్రతిష్ట, గర్భాలయంపై రాజగోపురంపైకళ ప్రతిష్టకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు సాదరస్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర జిల్లానాయకులు, మండల నాయకులు, అర్చకులు, దేవాలయ కమిటీసభ్యులు, భజనమండలసభ్యులు, గ్రామపెద్దలు, యువకులు, మహిళలు, గ్రామప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రూ.5.30 కోట్లతో మక్తల్‌లో క్రీడలకు పెద్దపీట

### ప్రకటించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ నియోజకవర్గాన్ని క్రీడా పరంగా అభివృద్ధి చేసేందుకు తన వంతు సాయం చేస్తానని, అందులో భాగంగా నియోజకవర్గంలోని పలు మండలాల్లో గ్రౌండ్‌ల అభివృద్ధి కోసం రూ.5.30 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆహ్వానం మేరకు బుధవారం మధ్యాహ్నం మక్తల్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మండలానికి గ్రౌండ్ల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని స్పోర్ట్స్ చైర్మన్‌ను కోరారు. దీంతో పాటు మక్తల్ గ్రౌండ్ ఆవరణలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ ఏర్పాటు, వాలీబాల్ , కబడ్డీ , క్రికెట్ కోచ్‌ల నియామకం, జిమ్ పరికరాలు షటిల్ , కబడ్డీ బ్యాడ్మింటన్ కోర్టులో ఏర్పాటు, స్విమ్మింగ్ పూల్, స్పోర్ట్స్ హాస్టర్, గ్రౌండ్ చుట్టూ ప్రహరీ గోడ, జిమ్ పరికరాలు, కరాటే మ్యాట్, వాష్ రూమ్‌లు, తాగునీటి సదుపాయం, వాచ్మెన్ ఇలా 15 అంశాతో సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గం నుంచే ఎక్కువ మంది పిటిలుగా ఎంపికయ్యారని, క్రీడలకు మక్తల్‌లో అధిక ప్రాధాన్యత ఉందని, నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే వినతిపై స్పందించిన శివసేనా రెడ్డి మాట్లాడుతూ. మక్తల్ పట్టణంలో గ్రౌండ్ అభివృద్ధి కోసం రూ.2.50 కోట్లు, ఆత్మకూరులో గ్రౌండ్ అభివృద్ధి కోసం కోటి 50 లక్షలు, నర్వలో గ్రౌండ్ కోసం రూ.50 లక్షలు, అమరచింతలో గ్రౌండ్ అభివృద్ధి కోసం రూ.50 లక్షలు, ఉట్కూరులో గ్రౌండ్ అభివృద్ధి కోసం రూ.30 లక్షలు రూపాయలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు ఎమ్మెల్యే అడిగిన 15 అంశాలలో దాదాపు 11 అంశాలను మం జూరు చేస్తున్నట్లు అక్కడికక్కడే ప్రకటించారు. జిమ్ పరికరాల కేటాయింపు ఈ ఏడాదికి పూర్తయిందని, వ చ్చే ఏడాది బడ్జెట్లో నియోజకవర్గం మొత్తానికి కలిపి కో టి రూపాయల జిమ్ పరికరాలను అందిస్తానని హామీ ఇచ్చారు. ఒక స్పోర్ట్స్ హాస్ట ల్, స్విమ్మింగ్ పూల్ సదుపాయంకు కాస్త సమయం పడుతుందన్నారు.మక్తల్‌లో 2000 మంది విద్యార్థులను క్రీడా ఎంపికలకు సిద్ధం చేయాలని, అప్పుడు మరిన్ని నిధులతో పాటు అభివృద్ధి పనులను చేపడతానని, భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పిఇటిలు, క్రీడాకారులు చైర్మన్‌ను షాలువా కప్పి సత్కరించారు. అనంతరం మక్తల్ సూపర్ ప్రీమియర్ లీగ్‌ల భాగం గా టైటానిక్ వీరభద్ర జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌ను టాస్ వేసి ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్‌ఓ వెంకటేష్ శెట్టి, మాజీ జెడ్పటిసి లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, నాయకులు కోళ్ళ వెంకటేష్, ఆనంద్ గౌడ్, రాజప్ప గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులను చేసి చూపిస్తా : వాకిటి**

**నర్వ :** నేను ఎన్ని అనుమానాలు పడ్డ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో అనుకున్న అభివృద్ధి పనులన్నీ చేసి చూపిస్తామని మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం నర్వ మండలం కేంద్రంలోని జాంగ్ర గుట్ట వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం గత ఆరు నెలల క్రితం జూనియర్ కాలేజ్ కోసం ఈ జాంగ్రగుట్టను తొలగించి లెవలింగ్ చేసి ఐదున్నర ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగింది. ఇట్టి స్థలంలో కొంత భాగాన్ని యువతకు క్రీడా ప్రాంగణం కోసం ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రీడా ప్రాంగణం అభివృద్ధి కోసం రాష్ట్ర క్రీడల అభివృద్ధి శాఖ చైర్మన్ శివసేన రెడ్డి మక్తల్ నియోజకవర్గం పర్యటనలో భాగంగా నర్వలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అడిగిన తక్షణమే 60 లక్షల రూపాయలను ఈ మైదానం అభివృద్ధి కోసం హామీ ఇచ్చారు. అడిగిన తక్షణమే నిధుల హామీ ఇవ్వడంతో ఆయనకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో తన హయాంలో ఎన్నో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. మండలంలో అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణాలు నిధులు ఏర్పాటు చేశామన్నారు. జంగం రెడ్డిపల్లి ఎత్తిపోతల పథకానికి 150 కోట్ల నిధులతో శ్రీకారం చుట్టామన్నారు. అదే విధంగా 4.30 కోట్ల నిధులతో నర్వ నుండి రాంపూర్ గేట్ బీటీ రోడ్డు, నర్వ నుండి జక్కనపల్లె బీటీ రోడ్డు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఆయన తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే సర్వతోముఖాభివృద్ధి : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి :** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే తెలంగాణ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలు, గ్రామీణ ప్రాంతాలు సైతం సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తున్నాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కళ్యాణ సాయి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్, సిఎంఆర్‌పి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోనే తెలంగాణ రాష్ట్రం సర్వతో అభివృద్ధి సాధిస్తుందని, మారుమూల ప్రాంతంలోని గ్రామీణ ప్రాంతాలకు సైతం ప్రభుత్వ పథకాలు గడపగడపకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయబడిందన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకం నిజమైన లబ్దిదారులకు అందుతుందని మరో మూడేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వ పాలననే కొనసాగుతుందని రానున్న లోకల్ బాడీ ఎన్నికలలో ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన 503 మంది సిఎంఆర్‌పి లబ్ధిదారులకు,201 మంది కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ లబ్దిదారులకు సంబంధించి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, పిసిసి సభ్యులు శంకర్ ప్రసాద్ , వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్ , వనపర్తి జిల్లా దిశ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి , వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్లు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆయా మండలాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, సింగిల్ విండో అధ్యక్షులు , డైరెక్టర్లు, మాజీ జడ్‌పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్ణయంపై దివ్యాంగులు హర్షం



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** తెలంగాణ రాష్ట్రంలోని ఇద్దరు దివ్యాంగులై ఉండి పెళ్లి చేసుకుంటే ప్రభుత్వం ఇచ్చే వివాహ ప్రోత్సాహకాని ఇద్దరికీ వర్తించే విధంగా జిఒ పాస్ చేయడం హర్షించదగ్గ విషయమని వికాలాంగుల రాజ్యాధికార సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిజ్వార్ నగేష్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ అజీజ్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రోజు ఉట్కూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాళ్లు మాట్లాడుతూ గతంలో దివ్యాంగులు ఎవరైనా పెళ్లి చేసుకుంటే రూ.3000లు వచ్చేవి వాటిని రూ.50 వేలకు పెంచి తర్వాత 1,16 కు గత ప్రభుత్వం పెంచడం జరిగింది. కానీ గతంలో కూడా ఇద్దరు దివ్యాంగులకు పెళ్లి చేసుకుంటే ఇద్దరికీ ఇవ్వాలన్న డిమాండు గతంలో పట్టించుకోలేదు ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల పైన ఉన్న ప్రేమ అభిమానంతో దివ్యాంగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇద్దరూ దివ్యాంగులై ఉండి పెళ్లి చేసుకుంటే వివాహ ప్రోత్సాహాన్ని ఇద్దరికీ వర్తించే విధంగా జిఒ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని దృష్టిలో పెట్టుకొని త్వరలో రూ.6000లు పెన్షన్ వర్తించే విధంగా చూడాలని వాళ్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు తిరుపతయ్య కూడా పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రైతులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామంలో వరిధాన్యం కొనుగోలుకేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకేంద్రాలలో నిర్వహిస్తున్న రిజిస్టర్‌లను పరిశీలించారు. ఇంతవరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు రైస్‌మిల్లులకు తరలించిన వివరాలు, మద్దతుధర చెల్లించిన వివరాలు మొదలగు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాలలో సరిపడా ధాన్యం కొనుగోలు, లారీలు, గోనేసెంచుల సమాచారం పట్ల రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం తడవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతులనుండి ధాన్యం సేకరించడం జరుగుతుందని రైతులు ఎలాంటి ఆందోళనపడాల్సిన అవసరం లేదన్నారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ఈసంవత్సరం అధిక దిగుబడి ఉన్నందున అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలపై జిల్లాయంత్రాంగం తగిన చర్యలు తీసుకుందని తెలిపారు. అనంతరం పైలట్ ప్రాజెక్టు కింద పెంట్లవెల్లి మండలంలో అన్ని గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతులు, ప్రజలనుండి భూసంబంధిత అంశాలపై అర్జీలు స్వీకరించామని, ఈనేపథ్యంలో వచ్చిన అర్జీలపై రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కూడిన బృందాలు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియ తీరును పెంట్లవెల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలి స్తూ, భూభారతిచట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్‌డిఓ భన్సిలాల్, పెంట్లవెల్లి తహసీల్దార్ జయసింహ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష**

నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్లో జిల్లావ్యాప్తంగా వరిధాన్యం కొనుగోలుపై బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 75వేలమెట్రిక్‌టన్నుల వరిధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా అధికారులు వివరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అకాలవర్షాలకారణంగా రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. రానున్న 15రోజులు ఎంతో కీలకమని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఓపిఎంఎస్‌లో నమోదుచేసిన 48గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమఅవుతుందన్నారు. ఈసమీక్ష సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారులు హైదర్‌అలీ, రాజేందర్, డిఆర్‌డిఓపిడి చిన్నఓబులేసు, డిసిఓ రఘునాథరావు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** జిల్లావైద్య ఆరోగ్యశాఖ ఆదేశానుసారం నాట్కోఫార్మాకంపెనీవారి ఆధ్వర్యంలో క్షయవ్యాధిగ్రస్తులకు బలవర్ధకమైన న్యూట్రిషన్‌కిట్లు బుధవారం పంపిణీ చేసినట్లు బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.శివకుమార్ తెలిపారు. వ్యాధితగ్గడానికి ప్రభుత్వం ఉచితంగా అందజేసిన మందులతోపాటు బలవర్ధకమైన పౌష్టిక, సమతుల్య ఆహారం అధికమొత్తంలో తీసుకోవాలని పోషక విలువలు బలవర్ధకమైన ఆహారం వారికి అత్యంత అవసరమన్నారు. ఒకవైపు మందులు, ఒకవైపు ఆహారం తీసుకున్నప్పుడే వ్యాధి తీవ్రతతగ్గి సమర్థవంతంగా ఆరోగ్యంగా ఉండుటకు శరీరం సహకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాట్కోఫార్మాకంపెనీ డిప్యూటీ మేనేజర్ సూర్యనారాయణ, డాక్టర్ మదన్‌కుమార్, రమణారెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్రఫుడ్ కమిషన్‌చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలో బుధవారం బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రఫుడ్ కమీషన్‌చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కేక్‌కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పుట్టరాంరెడ్డి మాజీవైస్ ఎంపిపి ఐజాక్, మాజీసర్పంచ్‌లు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ జంగిలినిరంజన్, నర్సింహ్మా, సింగిల్‌విండోడైరెక్టర్ శేఖర్, నాయకులు జంగిలిఆనంద్, జోగయ్య, మధుసూదన్‌రెడ్డి, కొండల్ యాదవ్, రవికుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు





**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపాల్టీలోని సుభాష్ చౌరస్తాలో స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను బుధవారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రమోది పాండేశ్వర్ రెడ్డి, బ్లాక్ కాగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశానికి ప్రధానిగా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. కంప్యూటర్లు, సెల్ ఫోన్లు, టెలికాం, ఐటి రంగాల్లో భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నేత, దేశం కోసం ప్రాణాన్ని త్యాగం చేసిన నాయకుడని తెలిపారు. ఆయన ఆశయాల కొరకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్ సాగర్ , రమణ, భాను ప్రకాశ్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, మోతే రాములు, రామన్ గౌడ్ , నర్సింహ నాయుడు, శివసాయి, వీరస్వామి, సునీల్ , మాలపల్లి రాము, రాజేష్ , శివ, వెంకటేష్ గౌడ్ , చెలిమిల రాముడు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తిలో ....**

దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయ సాధనకై ప్రతి ఒక్కరం కృషి చేద్దామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో గల ఆయన రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పీసీసీ సభ్యులు మార్కెట్ కమిటీ చైర్మన్ , వనపర్తి పట్టణ అధ్యక్షులు వనపర్తి జిల్లా దిశా కమిటీ నంబర్ మాజీ మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ , మాజీ కౌన్సిలర్స్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సోషల్ మీడియాకన్వీనర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**కొత్తకోటలో ....**

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల టౌన్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

**బిజినేపల్లి మండలకేంద్రంలో...**

పాలెం గ్రామంలో మాజీప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముక్తార్ ఆధ్వర్యంలో బుధవారం పాలెంగ్రామంలో ఘనంగా నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీప్రధాని రాజీవ్‌గాంధీ సాంకేతిక పరిజ్ఞానంతోపాటు కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానా న్ని దేశానికి పరిచయం చేసిన గొప్పవ్యక్తి అన్నా రు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నజీర్, పాలెం గ్రామకాంగ్రెస్‌పార్టీ సలహాదారులు మునీర్, బాలస్వామి, శాం తయ్య, రాములు, రామకృష్ణ, సుల్తాన్, నర్సింహ్మారెడ్డి, మైనార్టీసెల్ కార్యదర్శి ఖిజర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు కరాటే బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్లు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రంలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ చెందిన విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్‌లను ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారులు చిన్న వయసులో రాటే నేర్చుకోవటం వల్ల శారీరక మానసికంగా ఉంటారని , ప్రతి ఒక్క విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని తెలియజేస్తూ శిక్షణ ఇచ్చినటువంటి మాస్టర్స్ జి. హరీష్ యాదవ్ , ఎండి. ఇంతియాజ్ లను వారు ప్రత్యేకంగా అభినందించారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## వరి ధాన్యం శుభ్రపరిచే యంత్రాన్ని పరిశీలన



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రైతులు వీలైనంత తొందరగా ధాన్యము కొనుగోలు కేంద్రాలలో తమ ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా వరి ధాన్యాన్ని శుభ్రపరిచే యంత్రాన్ని ప్రభుత్వం కొన్ని సెంటర్ల వద్ద సమకూర్చింది. ఆ యంత్రాలు ఏ మేరకు పని చేస్తున్నాయోనని పరిశీలించడానికి బుధవారం యాదాద్రి జిల్లా జాయింట్ కలెక్టర్ వీరారెడ్డి జూలూరు పిఏసిఎస్ సెంటర్ వద్ద పరిశీలించారు. అకాల వర్షాలు నేపథ్యంలో రైతులు ధాన్యపు కుప్పలను టార్పలిన్ కవర్లతో కప్పి కాపాడుకొని సూచిస్తూ ప్రభుత్వం సమకూర్చిన యంత్రంతో ధాన్యాన్ని శుభ్రం చేసుకుని వెంటనే కొనుగోళ్ళను పూర్తి చేయాలని అధికారులు ఆయన ఆదేశించారు.

# భాను పురి
# ప్రతిష్ట మసకబారుతోంది!

## పెచ్చురిల్లుతున్న అవినీతి : రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్న అధికారులు

**ఉద్యమాల ఖిల్లాగా... చైతన్యవంతమైన ప్రాంతంగా... రాజకీయ యోధులకు నెలవైన సూర్యాపేట నేడు అవినీతి అధికారులకు, మెడికల్, ఇసుక, బియ్యం అక్రమ రవాణా మాఫీయాదారుల అవినీతి అక్రమాలకు నిలయంగా మారింది. రోజు రోజుకు వీరి అవినీతి అక్రమాలు పెరుగుతుండటంతో సూర్యాపేట ప్రతిష్ట మసకబారుతోంది. వీరు రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉండటంతో మరింతగా రెచ్చిపోతున్నారు. దీంతో అనేక మంది ఏసిబి అధికారులను ఆశ్రయించడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు వరుసగా ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి.**



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** సూర్యాపేట జిల్లాలో ఇటీవల కాలంలో ప్రభుత్వ అధికారుల అవినీతి అక్రమాలు పెచ్చురిల్లుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం వస్తున్న ప్రజల నుండి ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక ఏసిబి అధికారులను ఆశ్రయించడంతో పాటు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. గత ఆరునెలల క్రితం సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ ఓ స్థల రిజిస్టేషన్ కోసం ఓ వ్యక్తి నుండి డబ్బులు డిమాండ్ చేయడంతో అతను ఏసిబి అధికారులను అశ్రయించాడు. దీంతో ఏసిబి అధికారులు ఆయనను వలపన్ని పట్టుకున్నారు. ఇతనికన్నా ముందు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన మల్లిఖార్జున్, బలరాంలు భూముల రిజిస్టేషన్‌లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన అధికారులు వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో సస్పెండ్‌కు గురయ్యారు. ఇది ఇలా ఉండగా సివిల్ సప్లై శాఖలో తుంగతుర్తి డిప్యూటి తహసిల్దార్‌గా పనిచేసిన ఓ అధికారి ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాలో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సదరు అధికారిపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సస్పెండ్ చేశారు. ఆత్మకూర్( ఎస్ )మండలం నెమ్మికల్ గ్రామ శివారులో సర్వే నెంబర్ 75లో నిమ్మల భారతమ్మ అనే వ్యక్తికి చెందిన 5 ఎకరాల వ్యవసాయ భూమి వివదానికి సంబంధించి డిప్యూటి తహసిల్దార్ హరిచంద్రప్రసాద్, ఆర్ఐ రమేష్ లు గతంలో పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ ఇంద్రకుమార్ లు లక్షలాది రూపాయలు ఇతరుల నుండి తీసుకుని వారికి పట్టామార్పిడి చేసినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబును విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఇది నిజమని తేలడంతో ఈనెల 9న వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా సూర్యాపేట డిఎస్‌పి పార్ధసారధి, పట్టణ సిఐ వీరరాఘవులు ఓ స్కానింగ్‌సెంటర్ నిర్వాహకునిపై కేసు నమోదు కాగా అతని నుండి రూ.16 లక్షలు డిమాండ్ చేయడంతో సదరు బాధితుడు ఏసిబి అధికారులను ఆశ్రయించారు. ఇది వాస్తవమని తేలడంతో వారిని ఏసిబి అధికారులు అదుపులోకి తీసుకుని హైద్రాబాద్‌లోని ఏసిబి కోర్టుకు హాజరుపర్చారు. ఇది ఇలా ఉండగా చిలుకూరు మండలం శీతల్‌తండాకు చెందిన ఇస్లావత్ వినోద్‌కుమార్ గతంలో మహబూబ్‌నగర్ జిల్లా మార్తాల్ లో ఆర్‌డబ్ల్యూ ఎస్‌లో ఏఇగా విధులు నిర్వహిస్తున్న సమయంలో పనులు చేసిన ఓ కాంట్రాక్టర్‌కు ఎంబి చేసేందుకు డబ్బులు డిమాండ్ చేయగా అతను ఏసిబి అధికారులను అశ్రయించారు. తాను అడిగిన డబ్బులు కోదాడ వద్దకు తీసుకవచ్చి ఇవ్వాలంటూ చెప్పగా సదరు కాంట్రాక్టర్ ఏసిబి అధికారులు ఆశ్రయించడంతో వారు వల పన్ని పట్టుకున్నారు. అతని ఇంటితో పాటు బంధువుల ఇంట్లో సోదాలు నిర్వహించారు. జిల్లాలో మెడికల్ మాఫియా మరింత రెచ్చిపోతుంది. ధనార్జనే లక్ష్యంగా అర్హతలైని వైద్యులు వైద్యం చేస్తూ ప్రజల రోగులకు చికిత్స చేస్తు ప్రాణాలను బలికొంటున్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందినా స్థానిక వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న పాపన పోలేదు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులను అకస్మికంగా తనిఖీ చేయగా వారిఅసలు భాగోతం బయటపడింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులకు, అర్హతలేని వైద్యులతో కుమ్మక్కై వారు ఇచ్చే ముడుపులతో నీమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిపోయింది. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సదరు ఆసుపత్రులపై విచారణ జరుగుతుండగానే ఇద్దరు మహిళలను ఆసుపత్రి నిర్వాహకులు వచ్చిరాని వైద్యులతో వైద్యం చేయించి వారిని బలి తీసుకున్నారు. ఇసుక, బియ్యం అక్రమ రవాణా మాఫీయాకు సంబంధిత మైనింగ్, పోలీస్, సివిల్ సప్లై అధికారులు దాసోహమై వారి అక్రమ వ్యాపారాలకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇందులో కొన్ని వాస్తవమని తేలడంతో ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులపై వేటు కూడా పడింది.

**రాజకీయ అండదండలతో రెచ్చిపోతున్న అధికారులు**

రాజకీయ నాయకుల అండదండలతో కొంతమంది ప్రభుత్వ అధికారులు రెచ్చిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూర్యాపేట జిల్లా రాష్ట్ర రాజధాని హైద్రాబాద్‌కు ఏపి రాజధాని అమరావతి మద్యలో 65వ జాతీయరహదారి సమీపంలో విస్తరించి ఉంది. దీంతో ప్రభుత్వ అధికారులు ఈ ప్రాంతంలో పనిచేసేందుకు ఎక్కువగా ఆశక్తి చూపుతున్నారు. దీనికి తోడు ఆదాయ వనరులు కూడా జిల్లాలో మెండుగా ఉండటంతో రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకుని పోస్టులు తెచ్చుకుంటున్నారు. ప్రధానంగా పోలీస్‌శాఖలో పోస్టును బట్టి రూ.25 లక్షల నుండి రూ.10 లక్షల వరకు, రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, మైనింగ్, వైద్య ఆరోగ్య, డిఆర్‌డిఏ, వ్యవసాయ శాఖలలో పోస్టులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ శాఖలో పోస్టుల కోసం రాజకీయ నాయకులకు లక్షల రూపాయలు ముట్టచెప్పి తాము అనుకున్నచోట పోస్టులు దక్కించుకుంటున్నారు. ఇలా తమ పోస్టుల కోసం పైరవీ కోసం రాజకీయ నాయకులకు ముట్టచెప్పిన డబ్బులను త్వరితగతిన రికవరి చేసుకునే క్రమంలో వివిధ పనుల కోసం వచ్చే వారిని డబ్బులు డిమాండ్ చేస్తున్న పరిస్థితి. ఈ క్రమంలోనే వీరిపై ఏసిబి అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ అవినీతి అధికారులకు చెక్ పెట్టకుంటే జిల్లా ప్రతిష్ట మరింత మసకబారే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు.



## విద్యార్థుల సంఖ్య పెంచాలి

**ప్రజాపక్షం/యాదాద్రి :** భువనగిరి పట్టణంలోని బీచ్ మహిళ హై స్కూల్లో జరుగుతున్న టీచర్స్ ట్రైనింగ్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ హనుమంతరావు సందర్శించి టీచర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచి వారికి మంచిగా అర్థం అయ్యే విధంగా బోధన అందించాలన్నారు. పేద విద్యార్థులకు మంచిగా చదువు చెప్పి వారి జీవితాల్లో వెలుగులు కురిపిస్తే విద్యార్థులకు అంతకమించినది ఇంకొకటి ఉండదన్నారు. టీచర్లు విద్యార్థులకు మంచి చదువు అందిస్తే ఉన్నత స్థాయికి వెళ్లడం ద్వారా పేదరికం తొలగిపోతుందన్నారు. తరతరాల తల రాతలు మార్చేది చదువు ఒక్కటే అని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా లౌడ్ రీడ్ ద్వారా టీచర్లు పాఠాలు చెప్పి ఒకటికి రెండుసార్లు వ్రాయించాలన్నారు. విద్యార్థులకు స్లిప్ టెస్ట్‌లు పెట్టి అందులో వెనుకబడిన వారిని కేటగిరి వైజ్‌గా తీసుకొని వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఒక్క విద్యార్థి పాస్ అయ్యే విధంగా టీచర్లు చర్య తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి జీవితానికి అండగా నిలవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో టీచర్లు సంబంధిత ట్రైనర్లు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యానికి తరుగు తీయొద్దు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులందరిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐకేపీ కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకుండా నెలల తరబడి జాప్యం చేయడం వల్ల అకాల వర్షాలకు తడిసిందన్నారు. హమాలీలు, గోనె సంచులు లేవని, లారీలు దొరకడం లేదని కుంటి సాకులు చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ధాన్యం తడిసి నీటిలో కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యానికి 5 నుంచి 10కేజీల వరకు తరుగు తీయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏటా రైతులు నష్టపోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తడిసిన ధాన్యానికి ఎలాంటి తరుగు తీయకుండా కొనుగోలు చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రైతులకు మేలు జరిగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## రైతాంగానికి సాగునీరు అందించాలి

మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు



**ప్రజాపక్షం/చింతపల్లి :** మునుగోడు, దేవరకొండ నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించాలని మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరి రావు అన్నారు. మండల పరిధిలోని రోటిగడ్డ తండా గ్రామంలో బుధవారం ఆ పార్టీ గ్రామ శాఖ నిర్వహించిన సమావేశానికి ముఖ్యతిథిగా యాదగిరిరావు హాజరయి ప్రసంగించారు. భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ఏవైనప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడేది కమ్యూనిస్టు పార్టీనే అన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసి, కౌలు రైతులకు రైతుబంధు, పేదలందరికీ ఇళ్ళను మంజూరు చేసి, పేదలకు నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి రేషన్ బియ్యాన్ని అందించాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి రైతులుకు సాగునీరం దించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకట య్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావ్, మండల కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరాచారి, ఇస్లావత్ పాప, ససీతారామ్, బిచ్యచ జాను, రామ్‌చంద్, తౌర్య, తార, హన్మ, బూర, లక్ష్మి , గోప్య పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ పోటీలో ప్రతిభ

నల్లగొండ జిల్లా జట్టుకు రెండవ స్థానం



**ప్రజాపక్షం/నందికొండ:** జనగామ జిల్లా బతుకమ్మ కుంట స్టేడియంలో ఈనెల 15నుంచి18 న జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ టోర్నమెంట్ బాలికల విభాగంలో నల్లగొండ జిల్లా జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థానం సాధించిందని జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ జె కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన స్థానిక సెయింట్ జోసఫ్ పాఠశాల విద్యార్థులు రెండవ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించినట్లు అన్నారు.బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి క్రీడాకారులను నాగార్జునసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను నాయక్, ఉమ్మడి జిల్లా కబడ్డీ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కర్తయ్య, సెయింట్ జోసఫ్ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ లలిత, కరస్పాండెంట్ సిస్టర్ మాతీన అభినందించారు.

## సిపిఐ మునగాల మండల కార్యదర్శిగా ప్రభాకర్



**ప్రజాపక్షం/మునగాల:** సిపిఐ మండల కార్యదర్శిగా చిల్లంచర్ల ప్రభాకర్ మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల మహాసభలో ఆయనను ఎన్నుకోవడం జరిగింది. ప్రభాకర్ వరుసగా 4వ సారి పార్టీ మండల కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేర్వేరు ప్రకటనలో హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తాను శక్తివంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి వరుసగా గత 4 పర్యాయలుగా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండలంలోని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇండ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

పెద్దవూర,నాగార్జునసాగర్‌లో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యటన



**ప్రజాపక్షం/నందికొండ/(పెద్దవూర):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణంలో భాగంగా నాగార్జునసాగర్ నియోజక వర్గానికి మంజురైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం సంబంధిత అధికారులతో కలిసి నాగార్జునసాగర్ వద్ద స్థలాన్ని పరిశీలించారు.పెద్దవూర మండలం చలకుర్తిలో ఉన్న ప్రభుత్వ భూమి (ఎన్ఎస్ పి)ని ఆమె తనిఖీ చేశారు. ప్రస్తుతం ఆ స్థలంలో పల్లె ప్రకృతి వనాన్ని నిర్వహిస్తుండగా, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి గల అవకాశాలను ఆమె పరిశీలించారు.అనంతరం జిల్లా కలెక్టర్ నాగార్జునసాగర్ ప్రభుత్వ బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి అక్కడ ప్రధాన రహదారిపై తరచూ సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాల నివారణకు గాను ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు పరిశీలించి తగు ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈ బీసీ రెసిడెన్షియల్ పాఠశాల లో డిగ్రీ కళాశాల వస్తున్న దృష్ట్యా ఇదివరకు ఉన్న పాత బిఈడీ కళాశాలను తమకు కేటాయించాలని బీసీ రెసిడెన్షియల్ పాఠశాల యాజమాన్యం జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేయగా, వారి కోరిక మేరకు జిల్లా కలెక్టర్ పాత బిఈడి కళాశాల భవనాన్ని పరిశీలించారు.ఎంపీడీవో కార్యాలయం పక్కనే ఉన్న భవిత కేంద్రాన్ని ,ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం భవనాన్ని తనిఖీ చేశారు.జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ,గృహ నిర్మాణ శాఖ పీడి రాజకుమార్, పెద్దఊర ఎంపీడీవో నాయక్, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి ,ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

**కనగల్ మండలం తేలకంటి గూడెంలో** : కనగల్ మండలం తేలకంటి గూడెం లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి లబ్ధిదారులు వర్షాకాలంలోపు గృహప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆమె తేలకంటి గూడెంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని తనిఖీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఈ సంవత్సరం జనవరి 26 న కనగల్ మండలం, తేలకంటి గూడెం లోని ఇండ్లు లేని 107 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగింది. ఇందులో 71 ఇండ్లు గ్రౌండ్ కాగా, ప్రస్తుతం 48 ఇండ్లు బేస్మెంట్ స్థాయిలో,రెండు రూఫ్ స్థాయిలో ఉన్నాయి .44 ఇండ్లకు సంబంధించి బేస్మెంట్ వరకు బిల్లుల చెల్లింపులు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతూ సంవత్సరాలనుండి గుడిసెల్లో జీవిస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడమే కాకుండా, ఇంత త్వరగా ఇండ్లు కట్టించి ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. ఇందుకుగాను వారు రాష్ట్ర ప్రభుత్వానికి ,జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు .



## మంగళితండాలో పిడుగుపాటుకు 36 మేకలు,గొర్రెలు మృతి

**ప్రజాపక్షం/కోదాడరూరల్:** పిడుగుపాటుకు 36 గొర్రెలు, మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని నల్లబండగూడెం శివారు మంగళితండాలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లబండగూడెం గ్రామానికి చెందిన బడుగుల లక్ష్మయ్య మేకలను, గొర్రెలను మంగళితండా రోడ్డులోని రైస్‌మిల్లు ఎదురుగా ఉన్న పొలంలో మేపుతున్నాడు. ఈ క్రమంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చి మబ్బులు కమ్ముకుని వర్షం పడుతుండటంతో సమీపంలోని చెట్టు కిందకు తన మేకలను, గొర్రెలను చేర్చాడు. అదే సమయంలో మేకలు, గొర్రెలపై పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంలో మేకల కాపరి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పశువైద్యశాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామ చేశారు. మేకల కాపరి లక్ష్మయ్య తన మేకలను అమ్మి కూతురు వి వాహం చేయాలనుకున్న సమయంలో మేకలు, గొర్రెలు మృతి చెందడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

## మల్టీపర్పస్ సిబ్బందికి హెల్త్ ఇన్సూరెన్స్

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బిఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ మల్టీపర్పస్ సిబ్బందికి ప్రతి సంవత్సరం హెల్త్ ఇన్సూరెన్స్ చేయిస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో నిర్వహించిన పారిశుద్ధ్య, తడిపొడి చెత్త సేకరణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వర్మీ కంపోస్ట్ తయారీపై మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురు మల్టీపర్పస్ కార్మికులను ఆయన సన్మానించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ కార్మికులు గ్రామంలో మెరుగైన సేవలు అందించాలన్నారు. మల్టీపర్పస్ సిబ్బందికి హెల్త్ ఇన్సూరెన్స్ రూ.470తో ప్రతి సంవత్సరం తన సొంత డబ్బులతో బీఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ చేయించి ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేయిస్తానని అన్నారు. ప్రతిరోజు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు, ఇతరులకు అమ్మడం వల్ల గ్రామపంచాయతీలకు ఆర్థికంగా డబ్బు సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో ఎం.వెంకటయ్య, డీఎల్‌సీవో రాఘవేంద్ర, ఎంపీడీవో శేషగిరిశర్మ, ఎంపీవో మాతంగి రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.



## దేశ సంపదను పెట్టుబడిదారులకు పంచుతున్న మోదీ

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి :** దేశానికి అన్నం పెట్టే రైతులకు, శ్రమ ద్వార సంపదను సృష్టించే కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తూ పెట్టుబడిదారులకు మాత్రం లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ప్రధాని మోదీ అప్పనంగా పంచిపెడుతున్నాడని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోని చింతకుంట్ల గ్రామంలో జరిగిన సిపిఐ గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ దేశంలో అసమానత పెరుగుతుందన్నారు. పేదలు నిరుపేదలు అవుతుండగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారేటట్లు కేంద్ర ప్రభుత్వ పాలన నడుస్తుందని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు, బడా బాబులకు కేంద్ర ప్రభుత్వం 17లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందని ఆరోపించారు. ఉద్యోగాలు, ఉపాధి లేక దేశంలో కార్మిక కుటుంబాలు పెరుగుతున్నాయని అన్నారు. ధరలు 30 నుండి 56 శాతానికి పెరిగాయని అన్నారు. పాలసీదారులుగా ఉన్న ఎల్ఐసి వాటాలను అమ్మేందుకు తెగబడిందని విమర్శించారు. రైతు చట్టాల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మే 29న చెన్నమనేనిపల్లిలో మండల మహాసభ జరగనుందని, సిపిఐ సభ్యులు సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు కల్లు చరణ్‌రెడ్డి, పన్నాల శ్రీనివాస్, శాఖ కార్యదర్శి వెంకటయ్య, కాశయ్య, మధు, ఇద్ద య్య, మీనమ్మ, బుచ్చయ్య, మల్లేష్, రాములు, సత్యం పాల్గొన్నారు.

# క్రీడ

# తొలి రౌండ్‌లోనే సింధు ఓటమి!

## ప్రణయ్, శ్రీకాంత్ ముందంజ



మలేషియా మాస్టర్స్‌లో భారత స్టార్ షట్లర్లు అదరగొట్టారు. ఫేవరెట్లు హెచ్‌ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్‌లతో పాటు కరుణాకరన్, ఆయుశ్ శెట్టిలు ముందంజ వేశారు. పురుషుల సింగిల్స్‌లో సత్తా చాటిన ఈ ముగ్గురు రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. అయితే.. మహిళల సింగిల్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు పోరాటం ముగిసింది. ఒలింపిక్ విజేత అయిన సింధు మొదటి రౌండ్‌లోనే నిరాశపరుస్తూ ఇంటిదారి పట్టింది. కౌలాలంపూర్ వేదికగా జరుగుతున్న మలేషియా మాస్టర్స్‌లో ప్రణయ్ అదరగొట్టాడు. జపాన్‌కు చెందిన ఐదో సీడ్ కెంటా నిషిమోటోను చిత్తు చేశాడు. గంట 22 నిమిషాల పాటు సాగిన పోరులో భారత స్టార్ 21–17, 21–16తో గెలుపొందాడు. రెండో రౌండ్‌లో ప్రణయ్‌కు జపాన్ షట్లర్ యుషి తనక ఎదురువ్వనున్నాడు. ఇక మూడో సీడ్ చౌ థియెన్ చెన్‌తో జరిగిన మ్యాచ్‌లో కరుణాకరన్ అద్భుతంగా ఆడాడు. చైనీస్ తైపీ ఆటగాడైన చౌపై 21–13, 21–14తో జయభేరి మోగించి టోర్నీలో శుభారంభం చేశాడు. తర్వాతి రౌండ్‌లో క్రిస్టో పొపోవ్(ఫ్రాన్స్)ను కరుణాకరన్ ఢీ కొట్టనున్నాడు.

### 57 నిమిషాల పోరులో

మాజీ నంబర్ 1 కిడాంబి శ్రీకాంత్ సైతం తన రాకెట్ పవర్ చూపిస్తూ ప్రత్యర్థిని మట్టికరిపించాడు. తనకంటే ఎక్కువ ర్యాంకర్ అయిన లూ గాంగ్ జూ(చైనా)ను చిత్తుగా ఓడించాడు. 57 నిమిషాల పోరులో శ్రీకాంత్ తొలి సెట్ గెలిచి జూపై పైచేయి సాధించాడు. అయితే.. ఆ తర్వాత పుంజుకున్న చైనీస్ షట్లర్ రెండో సెట్ గెలవగా. మూడో సెట్ కీలకమైంది. ఈ సెట్లో చెలరేగిన శ్రీకాంత్ 21–11తో గెలుపొంది రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు.

ఈ సీజన్‌లో పెద్దగా ఫామ్ లేని సింధు.. మలేషియా ఓపెన్‌పై భారీ ఆశలు పెట్టుకుంది. కానీ, చెత్త ఆటతో తొలి రౌండ్‌లోనే ఓడి టోర్నీనుంచి నిష్క్రమించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో వియత్నాం షట్లర్ గుయెన్ థుయ్ లిన్హ్ ధాటికి భారత స్టార్ చేతులెత్తేసింది. రెండో సెట్ గెలుపొందినప్పటికీ.. 11–21, 21–14, 15–21తో పరాజయం పాలైంది. మిక్సడ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీష క్రాస్టో ద్వయం రెండో రౌండ్‌లో అడుగు పెట్టింది.



## ఐపిఎల్ నా జీవితాన్ని మార్చివేసింది

### విప్రాజ్ నిగమ్

ఐపిఎల్ తన జీవితంలో చాలా మార్పులకు కారణమైందని ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ అంటున్నాడు. క్రికెట్ దిగ్గజాలతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం వల్ల తన ఆట మెరుగవుతోందని ఆనందం వ్యక్తం చేశాడు. విప్రాజ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.50లక్షలు వెచ్చించి వేలంలో దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతో అతడు ఐపీఎల్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణిస్తున్నాడు. 'ఐపిఎల్‌తో నా జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సీనియర్ ఆటగాళ్లతో మైదానాన్ని పంచుకొని, వారి నుంచి ఆటలో మెళకువలు నేర్చుకునే అవకాశం లభిస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ నన్ను ఎంపిక చేసినప్పుడు.. నా కోచ్‌లు, యాజమాన్యంతో చర్చించాను. లీగ్, దేశవాళీ క్రికెట్‌లో వారు నా బ్యాటింగ్‌ను చూశారు. నేను ఆల్ రౌండర్ పాత్ర పోషించాలని వారు ఎప్పుడూ నాకు చెబుతుండేవారు. అందుకే బ్యాటింగ్, బౌలింగ్.. రెండింటికీ సమ ప్రాధాన్యం ఇస్తున్నా' అని విప్రాజ్ అన్నాడు. నేషనల్ క్రికెట్ అకాడమీకి వెళ్లి వచ్చిన తర్వాత తన ఆటలో వచ్చిన మార్పుల గురించి వివరించాడు. 'నేను ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత ముగ్గురు కోచ్‌లు నా ప్రగతికి కారణమయ్యారు. నేను నిజానికి బ్యాటర్‌గా వెళ్లాను. కానీ అక్కడ బ్యాటింగ్, బౌలింగ్ రెండూ ప్రాక్టీస్ చేశా. ఒక లెగ్ స్పిన్నర్‌గా బౌలింగ్‌ను సీరియస్‌గా తీసుకోమని వారు నాకు సూచించారు. నేను మొదట్లో పార్ట్‌టైమ్ బౌలర్‌గా కొన్ని ఓవర్లు బౌలింగ్ చేసేవాణ్ని. కానీ ఎన్‌సీఏకు వెళ్లిన తర్వాత నా ఆలోచన ధోరణి పూర్తిగా మారింది' అని విప్రాజ్ నిగమ్ చెప్పుకొచ్చాడు.

## సునామీలా విరుచుకుపడ్డ సూర్య..




ప్లేఆఫ్స్ బెర్తును నిర్ణయించే కీలక పోరులో ముంబై ఇండియన్స్ హిట్టర్ సూర్యకుమార్ యాదవ్ (73 నాటౌట్)సునామీలా విరుచుకుపడ్డాడు. వాంఖడే మైదానాన్ని బౌండరీలతో హోరెత్తించాడు. ఓపెనర్లు విఫలమైనా.. అర్ధ శతకంతో మెరిసిన ఈ హిట్టర్.. ఢిల్లీ బౌలర్ల లయను దెబ్బ తీస్తూ ఫోర్లు, సిక్సర్లతో అలరించాడు. డెత్ ఓవర్లలో తనమార్క్ విధ్వంసక ఆటతో.. జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించాడు. నమన్ ధిర్(24 నాటౌట్) ముకేశ్ వేసిన 19వ ఓవర్లో 27 రన్స్ రాబట్టి స్కోర్ 150 దాటించాడు.ఇక చమీర బౌలింగ్‌లో సూర్య రెండు ఫోర్లు, సిక్సర్‌తో చెలరేగాడు. దాంతో, ముంబై 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. టాస్ ఓడిన ముంబై ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు రోహిత్ శర్మ(5), రియాన్ రికెల్టన్(25)లు ధాటిగా మొదలెట్టారు. ముకేశ్ వేసిన తొలి ఓవర్ 5వ బంతిని రోహిత్ మిడాఫ్ దిశగా బౌండరీకి పంపాడు. ఆ తర్వాత చమీరకు చుక్కలు చూపిస్తూ వరుసగా 3, 4 బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు రికెల్టన్. దాంతో, ఆ ఓవర్లో 15 పరుగులు వచ్చాయి. అయితే.. 3వ ఓవర్ వేసిన ముస్తాఫిజుర్ డేంజరస్ హిట్‌మ్యాన్‌ను ఔట్ చేసి ఢిల్లీకి తొలి బ్రేకిచ్చాడు. రికెల్టన్‌ను ఔట్ చేసిన కుల్దీప్ యాదవ్ ఐపీఎల్‌లో 100వ వికెట్ సాధించాడు. వరసగా వికెట్లు పడిన ముంబైని సూర్యకుమార్ యాదవ్(73 నాటౌట్), తిలక్ వర్మ(27)లు ఆదుకున్నారు.

# రీల్

## 'రాజా శివాజీ' ఫస్ట్ లుక్ రిలీజ్

నటుడిగా బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన రితేష్ దేశ్‌ముఖ్ ఇప్పుడు దర్శకుడిగా మారి తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాజా శివాజీ'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమా 2026 మే 1న, అంటే మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్ సినిమాపై భారీ అంచనాలను పెంచుతోంది. నటుడు అభిషేక్ బచ్చన్ ఈ పోస్టర్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకుంటూ, భారతదేశ గొప్ప యోధుడు, రాజు ఛత్రపతి శివాజీ మహారాజ్‌కి సినిమా రూపంలో నివాళి అర్పించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రితేష్ దేశ్‌ముఖ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు, స్వయంగా ఛత్రపతి శివాజీ పాత్రను పోషిస్తున్నారు. మరాఠీ, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళంతో సహా ఆరు భాషల్లో రిలీజ్ కానుంది. ప్రస్తుతం మహారాష్ట్రలోని ముంబై మరియు వాయ్ ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాలో హిందీ, మరాఠీ చిత్ర పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖ నటులు భాగం అవుతున్నారు. వారిలో సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, మహేష్ మంజ్రేకర్, సచిన్ ఖేడేకర్, భాగ్యశ్రీ, ఫర్దీన్ ఖాన్, జితేంద్ర జోషి, అమోల్ గుప్తే, జెనీలియా దేశ్‌ముఖ్, మరియు రితేష్ విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ ఉన్నారు.



'రాజా శివాజీ' చిత్రం

## కేన్స్‌లో మెరిసిన జాన్వీ



తారల సందడితో 78వ కేన్స్ చిత్రోత్సవాలు కోలాహలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈనెల 13న ప్రారంభమైన ఈ సినీ వేడుక 24 వరకు జరగనుంది. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఇప్పటికే కొందరు నటీనటులు అరంగేట్రం చేసి ఆకట్టుకున్నారు. తాజాగా నటి జాన్వీకపూర్ తొలిసారి కేన్స్‌లో మెరిశారు. తన లుక్‌తో శ్రీదేవిని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆమె కేన్స్ లుక్‌కు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. పొడవాటి గౌన్‌ను ధరించిన జాన్వీ రాచరికం ఉట్టిపడేలా రెడ్ కార్పెట్‌పై హొయలొలికించారు. ఆమెతో పాటు 'హోమ్ బౌండ్' చిత్ర బృందం కూడా కేన్స్‌కు హాజరైంది. రెడ్ కార్పెట్‌పై జాన్వీకి ఇషాన్ ఖట్టర్ సాయం చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. జాన్వీ లుక్ చూసినవారంతా శ్రీదేవి గుర్తుకు వస్తున్నారంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఇషాన్ ఖట్టర్, జాన్వీ కపూర్ జంటగా నీరజ్ ఘైవాన్ తెరకెక్కించిన 'హోమ్ బౌండ్' సినిమాని ఆ వేడుకలో ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది కేన్స్‌కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. ఇది టీమ్‌కు దక్కిన గౌరవం అని జాన్వీ అన్నారు. దీనికోసం చిత్ర బృందమంతా అక్కడికి చేరుకుంది.



## 'థగ్ లైఫ్' నుంచి 'షుగర్ బేబీ' సాంగ్ రిలీజ్

కమల్ హాసన్ హీరోగా, మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'థగ్ లైఫ్' సినిమా నుంచి షుగర్ బేబీ అనే రెండో పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ పాటలో త్రిష ప్రధానంగా కనిపించింది. ఈ పాటకి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు, అనంత శ్రీరామ్ తెలుగులో సాహిత్యం అందించారు. అలెగ్జాండ్రా జాయ్, శుభ, నకుల్ అభ్యంకర్ ఈ పాటను పాడారు. 'థగ్ లైఫ్' చిత్రం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. కమల్ హాసన్, శింబు, త్రిష, ఐశ్వర్య లక్ష్మి, అశోక్ సెల్వన్, జోజూ జార్జ్, నాజర్, అభిరామి వంటి తారాగణం ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఒక గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందించబడింది.

## రౌడీ జనార్దన్‌లో కీర్తి సురేష్?

మహానటి చిత్రంతో జాతీయ ఉత్తమ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్, తన పాత్రల ఎంపికలో కొత్త ధోరణిని అనుసరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న చిత్రాలను ఎంచుకున్న కీర్తి, ఇప్పుడు తన వెర్షన్ 2.0ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మార్పుకు కారణం విజయ్ దేవరకొండతో ఆమె నటించబోయే సినిమా 'రౌడీ జనార్దన్'. తాజా సమాచారం ప్రకారం, రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న 'రౌడీ జనార్దన్' చిత్రంలో కీర్తి సురేష్ రొమాంటిక్ పాత్రలో కనిపించబోతోంది. ఈ చిత్రంలో విజయ్ దేవరకొండతో లిప్ లాక్ సన్నివేశాలు కూడా ఉండవచ్చని పుకార్లు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు కీర్తి సురేష్ ఏ హీరోతో లిప్ లాక్ సన్నివేశాల్లో నటించలేదు. 'సర్కారు వారి పాట' చిత్రంలో మహేష్ బాబుతో రొమాంటిక్ సన్నివేశాలు ఉన్నప్పటికీ, పూర్తిస్థాయి లిప్ లాక్ లేదు. అయితే, 'రౌడీ జనార్దన్'లో మాత్రం ఇది నిజం కావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక రౌడీ జనార్దన్ సినిమా విషయానికి వస్తే.. ఇది ఒక మాస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. విజయ్ దేవరకొండకు 'రౌడీ' ఇమేజ్ ఉండటంతో, ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా సరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారు.



## 26 నుంచి 31వరకు జనసేవా దళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరం

### పంజాల రమేష్ జనసేన రాష్ట్ర కన్వీనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, శారీరకంగా దృఢత్వం పెంపొందించుకునేందుకు జనసేవా దళ్ శిక్షణ శిబిరాలు దోహదపడతాయని జనసేవా దళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్ అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో బుధవారం ఈనెల 26 నుండి 31వరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో నిర్వహించనున్న జనసేవా దళ్ రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరంవాల్ పోస్టర్‌ను సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, జనసేవా దళ్ రాష్ట్ర కో కన్వీనర్ మారూపాక అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివ, సి పిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు భాతరాజు రాజు నరసింహ తో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంజాల రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలకు వ్యసనాలకు బానిస అవుతూ తమ విలువైన జీవితాలను అంధకారంలోకి నెట్టి వేసుకుంటున్నారన్నారు. సమాజంలో మెరుగైన పౌరులుగా తీర్చిదిద్దడానికి జనసేవా దళ్ శిక్షణ శిబిరం ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. 6 రోజులపాటు జరిగే శిక్షణ తరగతుల్లో ఆత్మ రక్షణకు సంబంధించి వివిధ రకాలైన శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. విపత్తుకరమైన పరిస్థితుల్లో ప్రజలకు కష్టాలు వచ్చినప్పుడు ఈ శిక్షణ పూర్తి చేసుకున్న యువతి యువకులు సేవా కార్యక్రమంలో నిమగ్నం కావచ్చన్నారు. యువతి యువకులకు క్రమశిక్షణలో కెరియర్ డెవలప్మెంట్ తదితరమైనటువంటి అంశాల పైన అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బోయ శ్రీరాములు, బోయ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

### మధ్య భారతంలో మారణహోమాన్ని ఆపాలి

### శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్



**ప్రజాపక్షం/హనుమకొండ :** మావోయిస్టులతో చర్చలు జరపడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సార్యం వీడి వెంటనే కాల్పులు విరమణ చేయాలని శాంతి చర్చల కమిటి చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కేంద్రం హరిత కాకతీయ హోటల్ లో శాంతి చర్చల కమిటి ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జైసింగ్ రాథోడ్ అధ్యక్షతన బుధవారం జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మధ్య భారతదేశంలో జరుగుతున్న పోలీసులకు నక్సలైట్లకు మధ్య జరుగుతున్న అంతర్ యుద్ధంలో సామాన్య ప్రజలు, అమాయక ఆదివాసీలు చనిపోతున్నారని, ఆరు నెలల పాప, గర్భవతి, ఆహారం కోసం అడవికి వెళ్ళిన ఆదివాసీలు అసువులు బాస్తున్నారని, రాజ్యం తరుపున పోలీసులు సైతం మరణించి మధ్య భారతమంతా నెత్తురోడుతున్నదన్నారు. చనిపోతున్న వారిలో ఎవరు మావోయిస్టులో, ఎవరు ఆదివాసీలో తెలియని స్థితి నెలకొన్నదని ఈ మారణహోమాన్ని గమనించిన శాంతి చర్చల కమిటి అభ్యర్థన మేరకు మావోయిస్టు పార్టీ కాల్పులు విరమణ చేసి శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారని, కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించకుండా దాడులను మరింత పెంచి సామాన్య ప్రజలను సైతం నిష్కారణంగా చంపేస్తున్నారని, కాల్పుల విరమణ స్థితిలో ఉన్నవాళ్ళను చుట్టుముట్టి చంపేయడం చాలా దుర్మార్గమని విమర్శించారు. హక్కుల కోసం పోరాటం జరిగిన నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, అస్సాం, మణిపూర్ ఉద్యమకారులతో చర్చలు జరిపి ఒప్పందాలు చేసుకున్న భారత పాలకులు మావోయిస్టులతో చర్చలు జరిపితే సమస్య ఏంటని ప్రశ్నించారు. కాల్పుల విరమణ, శాంతి చర్చల కోసం కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి లాంటి వాళ్ళను సంప్రదించాలని చూసినా వారు పట్టించుకోవడం లేదని అన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడం కోసం ప్రధాని మోడీ, హోం మంత్రి వెంటనే నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఉగ్రవాదులను దేశంపైకి ఉసిగొల్పి అమాకులను చంపుతున్న శత్రు దేశంతో చర్చలు జరుపుతున్న పాలకులు మన దేశ పోరాటయోధులతో ఎందుకు చర్చలు జరపడం లేదో ప్రజలంతా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఛత్తీస్ ఘడ్ లో ఎన్నికల సమయంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తె మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపుతామని మానిఫెస్టోలో పొందుపరచి అందుకు బిన్నంగా ప్రవర్తిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ చర్యల వల్ల మధ్య భారత దేశంలో ఆదివాసీల జీవనం మొత్తం చిన్నాభిన్నమై జీవించే హక్కు కోల్పోతున్నారని అన్నారు. ఇక నుండి ఏ ఒక్కరు చనిపోయినా మోడీ, అమిత్ షా లే బాధ్యత వహించాలని, మధ్య భారత క్రూరత్వానికి బిజెపి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. దేశ భక్తి అంటే దేశంలోని ప్రజలు అభివృద్ధి చెంది సమానత్వం రావాలని, దేశ సంపదను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెట్టడం కాదని అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన పాలకులు రాజ్యాంగ హక్కులను హరించి వేయడాన్ని ఎవరు ఒప్పుకోరని అన్నారు. శాంతి చర్చల కమిటి రాష్ట్ర సభ్యుడు సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సిద్ధబోయిన లక్ష్మి నారాయణ, చుంచు రాజేందర్, అనిక్ సిద్ధికి, చిల్ల రాజేంద్ర ప్రసాద్, బొట్ల బిక్షపతి, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పట్టింపులకు పోకుండా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి అఖిల పక్ష కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. పౌర సమాజం వివిధ ప్రజా సంఘాల నాయకులు అన్ని ప్రతిపక్ష పార్టీలను సంప్రదించి శాంతి చర్చల కోసం దేశ వ్యాప్త ఉద్యమం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అబ్దుల్ నబీ, పండుగ శ్రీనివాస్, ఆదినారాయణ, దొమ్మటి ప్రవీణ్ కుమార్, కోండ్ర నర్సింగరావు, మిద్దేపాక ఎల్లన్న, బానోతు మంగీలాల్, ఉదయ్ సింగ్, డాక్టర్ జగదీష్, ముంజాల బిక్షపతి గౌడ్, రాదండి దేవేందర్, నున్న అప్పారావు, సూరం నిరంజన్, ఐతం నగేష్, నలిగింటి చంద్రమౌళి, సింగారపు అరుణ, పోతరాజు లక్ష్మి నారాయణ, బొష్టెట్టి వెంకన్న, కందుకూరి దేవదాసు, యాకయ్య, వలపదాసు కుమార్, ఆర్ వి చలం, లాజరస్, కల్లెపెల్లి సుభద్ర, చాగంటి కిషన్, ఎర్ర విజయ్, మంగీలాల్ నాయక్, మాన్ సింగ్, బిరుదు రాజు శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ ఖాతాలో ఉంటే స్వాధీనం చేసుకుంటాం

### సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన కేంద్రం



**న్యూఢిల్లీ :** ప్రభుత్వ భూములపై 'వక్ఫ్ బై యూజర్'లకు కూడా ఎలాంటి హక్కూ లేదని సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం వాదించింది. వాటిని తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉందని కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టు ధర్మాసనానికి చెప్పారు.. సవరణల చట్టం–2025కు వ్యతిరేకంగా వినతులు దాఖలు చేసిన పిటిషనర్లు తప్పుతోవ పట్టించడం మాత్రమేకాదు, వారి వాదనలు కూడా తప్పుడు వాదనలేనని అన్నారు. ఈ కేసుపై విచారణ సుదీర్ఘంగా కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం తన లిఖితపూర్వక అఫిడవిట్‌లో వక్ఫ్ సవరణచట్టాన్ని చాలా బలంగా సమర్థించింది. సహజసిద్ధంగా వక్ఫ్ అనేది ఒక లౌకిక భావన, రాజ్యాంగం ప్రకారం దానికి అనుకూలంగా స్టే ఇవ్వలేరని పేర్కొంది. ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండా, ముస్లిం మత ధార్మిక ప్రయోజనాలకోసం స్థిరచరాస్థులను తమ అధీనంలో ఉంచుకుని వాటిని ఉపయోగించుకుంటున్న వక్ఫ్ బై యూజర్లకు కూడా ప్రభుత్వ భూమిపై ఎలాంటి హక్కులూ ఉండబోవని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాషిష్‌లతో కూడిన ధర్మాసనానికి తుషార్ మెహతా బుధవారంనాడు చెప్పారు. ''ప్రభుత్వ భూమిపై ఎవ్వరికీ హక్కులు లేవు, ఒకవేళ ప్రభుత్వ భూమిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటిస్తే, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది, ప్రభుత్వ భూములను రక్షించాలనేది సాక్షాత్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పే'' అని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో బాధితులనేవారు ఎవ్వరూ కోర్టును ఆశ్రయించలేదని, ఇది ఏ బాధితుడికీ సంబంధించిన కేసు కాదనీ, వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేవిధంగా శాసనం చేయడానికి పార్లమెంటుకు ఎలాంటి హక్కూ లేదని ఉదయం వాదనలు ప్రారంభం కాగానే తుషార్ మెహతా ధర్మాసనానికి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేసిన వక్ఫ్ సవరణ చట్టం–2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలుచేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన వినతులకు ఆయన సమాధానంగా ఈ విషయం చెప్పారు. పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించేముందుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలలో ప్రభుత్వాలను, అన్ని వక్ఫ్ బోర్డులను సంప్రదించిందనీ, ఈ బిల్లును పరిశీలించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి నివేదిక తయారు చేసిందని నివేదిక ఆమోదం పొందిందని తుషార్ మెహతా ధర్మాసనానికి చెప్పారు.

## ఉచ్చులో రైతు

(మొదటి పేజీ తరువాయి)

వర్తింప జేసి రైతులకు పరిహారం ఇప్పించవచ్చు. అధికార యంత్రాంగం కూడా విత్తన డీలర్లు, విత్తన విక్రయ దుకాణాలపై దృష్టి సారిస్తున్నారు కానీ గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న హైబ్రీడ్ విత్తన సంస్థలపై దృష్టి సారించడం లేదు. నేరుగా రైతులకు విత్తనాలను అంటగడుతున్నారు. ధర తక్కువ దిగుబడులు ఎక్కువ అనే రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. రైతులకు విత్తన కొనుగోలు కూడా అదనపు పెట్టుబడిగా మారిన నేపథ్యంలో కొంత మంది రైతులు ఈ సంస్థల మాయలో చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా పత్తి, మిర్చికి సంబంధించి ప్రచారం హోరెత్తుతుంది. చాటుమాటుగా కొందరు వ్యక్తులు చేస్తున్న ఈ దగా దశాబ్ద కాలంగా కొనసాగుతుంది. కలిసొస్తే సరే సరి. లేదంటే రైతులు తీవ్రంగా నష్టపోయి లబోదిబోమంటున్నారు. రైతుల వద్ద నుంచి ఏజెంట్లు విత్తనాలను బుక్ చేసుకుని ద్విచక్ర వాహనాలపై రహస్యంగా చేరేస్తున్నారు. ఇది విత్తన చట్టానికి విరుద్ధం. విత్తన చట్టాల విషయానికి వస్తే 1966లో భారతదేశంలో తొలి విత్తన చట్టం వచ్చింది. ఆ విత్తన చట్టం 1969 అక్టోబరు నుంచి అమల్లోకి వచ్చింది. 2004లో విత్తన బిల్లును తీసుకు వచ్చారు. విత్తన బిల్లు నియామ నిబంధనల ప్రకారం విత్తనాలు తయారు చేసే ప్రతి కంపెనీ రిజిస్టర్ చేయడంతో పాటు తమ సంస్థల నిర్మాణం, అభివృద్ధి తయారైన విత్తనంపై ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యమో లేదా ఇతరత్రా కారణాల వల్ల విత్తన సంస్థలపై నిరంతర పర్యవేక్షణ జరగడం లేదు. 2019లో విత్తన మూసాయిదా బిల్లును తీసుకు వచ్చారు. చట్టాలు పకడ్బందీగానే ఉన్న అమలులో మాత్రం రైతాంగానికి మేలు జరగడం లేదు. విత్తన సంస్థల కారణంగా రైతాంగం నష్టపోయిన ప్రతి సారి ప్రకృతి వైపరీత్యం కారణంగా చూపుతూ పరిహారాన్ని ఎగవేస్తున్నారు. జన్యులోపం కారణంగా మొలకెత్తక పోయినా భూమిలో పదును ఇతరత్రా కారణాలను చూపుతూ పరిహారం చెల్లించడం లేదు. దిగుబడి విషయానికి వచ్చినప్పుడు ఇతర ప్రాంతాల్లో వచ్చిన దిగుబడిని ఏకకరువు పెడుతూ ఇక్కడి రైతులకు శఠగోపం పెట్టేందుకు ప్రయత్నం జరుగుతుంది. అధికార యంత్రాంగం హైబ్రీడ్ సంస్థల ప్రతినిధులు డీలర్ల నుంచి కాకుండా రైతులకు నేరుగా ఏజెంట్లు విత్తనాలను అంటగట్టే ప్రక్రియపై దృష్టి సారించాల్సి ఉంది. గ్రామంలో సమావేశాలు, సభలు ఏర్పాటు చేసి రైతులను చైతన్యపర్చాల్సి ఉంది. బిల్లు లేకుండా విత్తనాలను కొనుగోలు చేస్తే జరిగే పరిణామాలపై రైతులకు వివరించాల్సి ఉంది. ఒక్కసారి విత్తన లోపం జరిగితే ఆ ఏడాది మొత్తం రైతు నష్టపోవాల్సి వస్తుందన్న విషయాన్ని విత్తన ఎంపికపై జాగృతతో వ్యవహరించేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.

## ఖాతాలో భారీగా నగదు

(మొదటి పేజీ తరువాయి)

పెంచారు. కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్ డేటాను కూడా సేకరించారు. విజయనగరంలోని డిసిసిబి బ్యాంక్‌లో సిరాజ్‌కు బ్యాంక్ ఖాతా ఉందని పోలీసులు తేల్చారు. ఈ ఖాతాలో భారీగా నగదు జమ ఉన్నట్లు కూడా వివరాలు సేకరించారు. ఈ నగదు ఎవరు పంపించారు, ఎందుకు పంపిచారు, ఏఏ బ్యాంక్‌ల నుంచి ఏఏ ఖాతా నెంబర్ల నుంచి నజీర్‌కు డబ్బు ట్రాన్స్ అయ్యిందనే విషయాలపై పోలీసులు కూపి లాగుతున్నారు. అలాగే సిరాజ్ తన ఖాతా నుంచి ఎవరెవరికి డబ్బులు పంపించాడు, ఎందుకు పంపించాడు అనే విషయాలపై కూడా ఆరా తీస్తున్నారు. అయితే ఇదే డిసిసిబి బ్యాంక్‌లో నజీర్‌కు లాకర్‌ను గుర్తించి పోలీసులు సీజ్ చేశారు. లాకర్‌లో ఏంఉంది. విజయనగరంలోని డిసిసిబి బ్యాంక్‌లో నజీర్ ఎందుకు లాకర్ సౌకర్యం పొందాడు అనేది దర్యాప్తు అధికారులకు అంతుపట్టని సమస్యగా మారింది. పెద్ద వ్యాపారులు, పారిశ్రామిక వేతలు, ఆదాయ రాబడి ఎక్కువ ఉన్న వారు మాత్రమే ఎక్కువగా బ్యాంక్‌లో లాకర్‌లను ఉపయోగించుకుంటారు. ఎలాంటి ఉద్యోగం, పనిచేయని నజీర్ బ్యాంక్‌లో లాకర్‌ను ఎందుకు తీసుకున్నాడు, ఇంతకి ఆ లార్‌లో ఏం ఉంది అనేది ఆసక్తిగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు లాకర్‌ను తెరిస్తే అసలు సంఘతి బయట పడుతుంది. ఇదిలా ఉండగా సిరాజ్ తండ్రి పోలీసు శాఖలో ఎఎస్‌ఐగా పనిచేస్తున్నాడు. సిరాజ్ అరెస్టు చేసిన తరువాత అతని పేరుపై ఉన్న లాకర్‌ను తెరిచేందుకు సిరాజ్ తండ్రి విఫలయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఖాతాను సీజ్ చేయడంతో లాకర్ తెరవటానికి కుదరదని సిరాజ్ తండ్రికి బ్యాంక్ అధికారులు తేల్చి చెప్పారు. ఈ విషయంపై రెండు రోజుల పాటు బ్యాంక్ అధికారులను సిరాజ్ తండ్రి కలిసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏఎస్‌ఐగా పని చేస్తున్న సిరాజ్ తండ్రితో పాటు కుటుంబ సభ్యుల కదలికలపై దర్యాప్తు సంస్థలు మరింత నిఘా పెట్టాయి.

### కస్టడీ పిటిషన్ దాఖలు..

నజీర్, సమీర్‌లను మరింత లోతుగా విచారించి సమాచారాన్ని రాబట్టేందుకు విజయనగర్ టూ టౌన్ పోలీసులు స్థానిక కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేసినట్లుగా తెలిసింది.ఏడు రోజుల కస్టడీ ఆ పిటిషన్‌లో పోలీసులు అడిగినట్లు సమాచారం. పోలీసు కస్టడీలో వారిద్దరిని విచారిస్తే ఉగ్రవాదుల మొత్తం గుట్టు బయటపడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బోయిగూడలో సమీర్‌ను అరెస్టు చేయడంపై హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. అతని కుటుంబ నేపథ్యంపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com